మొజాయిక్ గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 195 పేజీలు: 12 వెల: 6.50

## ఎర్రకోట పేలుళ్లు అల్‌ఖైదా పనే: ఐరాస నివేదిక

## ముప్పుతోనే విమానం మారా: ట్రంప్


9లో



# నిరవధిక వాయిదా

9లో

- 18 రోజులు సాగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు
- చర్చల కంటే వాయిదాలతోనే సరి
- ఉభయ సభల్లోనూ విపక్షాల రభస
- పార్లమెంట్ వెలుపలా ఆందోళనలు
- మూజువాణి ఓటుతోనే బిల్లులు ఆమోదం
- చివరి రోజు ప్రధాని మోడీ, అమిత్‌షా, రాహుల్‌గాంధీ సహా సభ్యులంతా హాజరు
- 'వందేమాతరం' ఆలాపనతో ముగింపు
- ప్రతిపక్షాల తీరుపై రిజిజు మండిపాటు



# అంగారకుడిపై రత్నాల రాసులు!

## నాసా ప్రయోగాల్లో బయటపడిన ఆనవాళ్లు

**న్యూయార్కు, ఆగస్టు 13:** అంగారకుడిపై సాధారణంగా కనిపించిన ఓ రాయిని పరిశీలించేందుకు నాసా రోవర్ లేజర్ ప్రయోగించింది. ఆ రాయిలో భూమిపై రత్నాలతో సంబంధం ఉన్న ఖనిజాల ఆనవాళ్లు బయటపడ్డాయి. నాసాకు చెందిన పర్సీవరెన్స్ రోవర్ జెజెరో క్రేటర్లో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ అనూహ్య విషయాన్ని గుర్తించారు. రోవర్లోని సూపర్క్యామ్ పరికరంతో రాయిపై లేజర్ ప్రయోగించి దాని రసాయన కూర్పును పరిశీలించారు. ఇందులో క్రోమియం కలిగిన కొరండం ఖనిజం ఉన్నట్లు తేలింది. భూమిపై కొరండం ఖనిజానికి చెందిన కొన్ని రూపాలు రూబీ, సఫైర్ వంటి విలువైన రత్నాలుగా కనిపిస్తాయి.

అంగారకుడిపై ఇలాంటి ఖనిజాలు ఈ ప్రాంతంలో ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగా ఊహించలేదు. ఈ ఖనిజాలు కోట్లాది ఏళ్ల క్రితం ఏర్పడి ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. భూగర్భంలో వేడి నీరు రాళ్లలోని పగుళ్ల నుంచి ప్రవహించినప్పుడు ఇలాంటి ఖనిజాలు ఏర్పడే అవకాశం ఉంది. అంగారకుడిపై కూడా ఒకప్పుడు నీరు చురుగ్గా కదిలిందన్న వాదనకు ఈ పరిశీలన మరింత బలం చేకూర్చుతోంది. ఈ ఆవిష్కరణతో అంగారకుడి భౌగోళిక చరిత్రపై మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రహంపై గతంలో అగ్నిపర్వత కార్యకలాపాలుఎలా సాగాయి భూగర్భంలో నీరు ఎలాప్రవహించింది అక్కడి పరిస్థితులు ఎప్పుడైనా జీవుల జీవనానికి అనుకూలంగా ఉన్నాయా అన్న విషయాలపై పరిశోధనకు ఈ ఖనిజాలు ఉపయోగపడొచ్చు. పర్సీవరెన్స్ రోవర్ మరిన్ని నమూనాలను సేకరిస్తోంది. భవిష్యత్తులో వాటిని భూమికి తీసుకొచ్చి లోతుగా పరిశీలించే అవకాశం ఉంది. అప్పుడు అంగారకుడి సుదీర్ఘ భౌగోళిక చరిత్రపై మరిన్ని ఆధారాలు లభించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# రాజధానికి రాజమార్గం 'సీడ్ యాక్సెస్'

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

- ఐదు కాన్సెప్టులతో దేశం మెచ్చిన రాజధానిగా అమరావతి
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసభవన సముదాయం పరిశీలన



గురువారం అమరావతి స్టీల్ బ్రిడ్జ్, సీడ్ యాక్సెస్‌రోడ్డు ప్రారంభించిన అనంతరం సభలో సిఎం చిరుదరహాసం

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుఅన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సిఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజ ధాని అమరావతిని విజయవాడ -మంగళగిరి - గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఇ3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సిఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లివద్ద ఏర్పాటు చేసినశిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సిఆర్‌డిఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సిఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభ జన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా

>>2

## బాలికలపై లైంగిక వేధింపులు పాస్టర్‌కు 20యేళ్ల జైలు

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సండే బైబిల్ స్కూల్ నిమిత్తం చర్చికి వచ్చే మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఓ పాస్టర్‌కు విజయవాడ ప్రత్యేక పోక్సో కోర్టు తీవ్రమైన శిక్ష ఖరారు చేసింది. దోషిగా తేలిన పాస్టర్‌కు 20యేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ పోక్సోకోర్టు న్యాయమూర్తి కె.జయలక్ష్మి తీర్పు వెలువరించారు. విజయవాడలోని మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ చర్చిలో ప్రతి ఆదివారం జరిగే 'సండే స్కూల్'కు వచ్చే ముగ్గురు మైనర్ బాలికలతో అక్కడి పాస్టర్ అసభ్యంగా ప్రవర్తించేవాడు. వారిపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఈ విషయాలు బయటకు చెబితే తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ఆ బాలికలను భయభ్రాంతులకు గురిచేసిబెదిరించేవాడు. పాస్టర్ ఆగడాలు తట్టుకోలేక బాధిత బాలికలు ధైర్యంచేసికుటుంబసభ్యులకు తెలపడంతో, పేరెంట్స్ 2020లో మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయస్థానంలో ఈ కేసులో సాక్ష్యాధారాలు రుజువు కావడంతో నిందితుని న్యాయమూర్తి జయలక్ష్మి శిక్షను విధించారు.దోషికి రూ.30,000 జరిమానా విధించారు. బాధితులైన ముగ్గురు చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున పరిహారం అందజేయాలని పేర్కొంది.

## మానవ - వన్యప్రాణి సంఘర్షణ లేకుండా జీవనం అత్యున్నతం



### ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం

2లో

### కుంకీ ఏనుగుల రాకతో సత్ఫలితాలు

### అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డి.సిఎం పవన్ కల్యాణ్




14-08pg2exHMNWJQE_14-08pg2exHMNWJQE.qxd 13/Aug/26 11:24 PM Page 1





గురువారం అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాల్ని ఆవిష్కరిస్తున్న డి.సిఎం పవన్

## మానవ - వన్యప్రాణి సంఘర్షణ లేకుండా

# జీవనం అత్యున్నతం

## అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డి.సిఎం. పవన్ కల్యాణ్

**విశాఖపట్నం(జ్ఞానాపురం), ఆగస్టు 13 ప్రభాతవార్త:** "ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించా' ' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు – వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 150 ఏనుగుల కారిడార్లను దేశవ్యాప్తంగా గుర్తించడం ద్వారా ఏనుగుల ఆవాసాలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఏనుగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కి, అప్పటి అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య సహకారం మాత్రమే కాదు. ఇది ప్రజలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం సాగుతున్న పరస్పర సహకారం. కుంకీ ఏనుగులు ఇప్పటికే మదపుటేనుగులు చేసే విధ్వంసాలను అరికట్టే 15 కార్యకలాపాలలో సహాయపడ్డాయి. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70శాతం తగ్గింది. పంట నష్టం కూడా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా సొంత కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. ఇప్పటికే ఒక శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఉంది. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది మా ప్రణాళిక" అని స్పష్టం చేశారు.

**హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు**

"మానవులు – వన్య ప్రాణుల మధ్య నెలకొన్న ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వేగవంతమైన స్పందన, సాంకేతికత, వణ్య ప్రాణులతో కలిగే నష్ట నివారణ కోసం సమగ్ర మానవవన్యప్రాణుల సంఘర్షణ నిర్వహణ వ్యవస్థ అయిన హనుమాన్ ప్రాజెక్టును 2026, మార్చిలో ప్రారంభించాం. 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్స్‌లను ఈ ప్రాజెక్టులో సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులు రక్షి ంచడమే కాకుండా, 30కి పైగా వన్యప్రాణులను తరలింపు కార్యక్రమం జరిగింది. సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజాన్ని దీనిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష ్యంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి రైతు భయం లేకుండా సాగు చేయగలిగే పరిస్థితికి చేరుకోవాలన్నదే లక్ష ్యం. వణ్య ప్రాణులను, ప్రజలను విడదీయడం మా ఉద్దేశం కాదు... ప్రజలు, వన్యప్రాణులు ఒకే ప్రదేశంలో సురక్షి తంగా కలిసి జీవించగలిగే భవిష్యత్తును సృష్టించడమే అసలైన విజయం" అని డి.సిఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కరణ**

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్' పుస్తకాన్ని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షి ణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌తోపాటు వైల్డ్ లైఫ్ సైన్స్‌కి సంబంధించిన పలు పుస్తకాలను విడుదల చేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## రాజధానికి రాజమార్గం 'సీడ్ యాక్సెస్'


ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసభవన సముదాయం


రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిపనులను చూపిస్తున్న సిఎం చంద్రబాబు

>> పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు**

"అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్ట్ అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్‌గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఎఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్-5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది. అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం" అని సిఎం అన్నారు.

**జెండా సాధించాల్సిన అజెండాతో సంకల్పం**

"2047 నాటికి ఎపిని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి"అని సిఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపి భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సిఎం చంద్రబాబు పరిశీలించారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సంగీత నాటక అకాడమీ అవార్డు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న గుమ్మడి


గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుమ్మడి గోపాలకృష్ణ

**విజయవాడ,ఆగస్టు 13, ప్రభాత వార్త ప్రతినిధి:** సుప్రసిద్ధనటుడు, ఎపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు గుమ్మడి అందుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ఆయనకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. నాటకరంగం – నటన విభాగంలో 2024 సంవత్సరానికి గాను అందుకున్నందుకు మీకు హృదయపూర్వక శుభాభినందనలని సిఎం పేర్కొన్నారు.తెలుగు నాటకరంగానికి, ప్రత్యేకించి కాలాతీతమైన తెలుగు పద్యనాటక సంప్రదాయానికి మీరు అంకితమైన అసాధారణమైన నాలుగు దశాబ్దాల ప్రస్థానానికి ఈ జాతీయ గౌరవం తగిన గుర్తింపు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు మరియు శ్రీనాథుడి పాత్రలలో మీ అద్భుతమైన నటన ద్వారా, మీరు మన పురాణాలు, చరిత్ర మరియు సాహిత్యంలోని పాత్రలను తరతరాల ప్రేక్షకులకు సజీవమైన, మరపురాని అనుభవాలుగా మార్చారు.మీ శక్తివంతమైన ..కంఠం, భావయుక్తమైన నటన,.. కవిత్వంపైపట్టు మరియు మన సాంస్కృతిక సంప్రదాయాలపై లోతైన అవగాహన నాటక ప్రియుల హృదయాలలో మీకు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి. అంతేకాకుండా, తెలుగు నాటకరంగ వైభవాన్ని భారతదేశం దాటి, దాని సౌందర్యాన్ని మరియు లోతును అమెరికాతో సహా విదేశీ ప్రేక్షకులకు పరిచయం చేయడానికి మీరు చేసిన కృషి కూడా ప్రశంసనీయం. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్‌గా, మీ అనుభవం మరియు హోదా యువ కళాకారులను ప్రోత్సహించడంలోనూ, మన అమూల్యమైన ప్రదర్శన కళల వారసత్వాన్ని పరిరక్షించడంలోనూ మీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మీకు అపారమైన ఆనందాన్ని కలిగించి, రాబోయే మరెన్నో సంవత్సరాల పాటు వేదికను ప్రకాశవంతం చేస్తూ, మన సాంస్కృతిక జీవితాన్ని సుసంపన్నం చేయడానికి మీకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. మరోసారి హృదయపూర్వక అభినందనలు, నా వ్యక్తిగత శుభాకాంక్షలు అని వ్యాఖ్యానించారు.

### వారం - వర్జ్యం

14-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.విదియ సా.6.52
న.పూర్వఫల్గుణి రా.3.44
వ.మ.12.21-మ.1.53
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. మ.12.38-మ.1.29
రాహు ఉ.10.30-ఉ.12.00
శుభ ఉ.6.00-ఉ.7.00

### వారాఫలం

**మేషం :** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. వస్త్ర లాభం.

**వృషభం :** నూతన వ్యాపారాలు పరిశ్రమలను ప్రారంభిస్తారు. మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు.

**మిథునం :** ప్రముఖ వ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కర్కాటకం :** పనులు వాయిదాపడే సూచనలు ఉన్నాయి. మిత్రులు ఒత్తిడి వలన కొంత బాధ కలుగుతుంది.

**సింహం :** కుటుంబంలో శుభకార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఓర్పుతో, ధైర్యముతో చేయవలసిన పనిని సఫలము చేయగలుగుతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**తుల :** విధి నిర్వహణలో గాని, వ్యాపారములో గాని మార్పులు జరుగ వచ్చును. క్రయ విక్రయాలలో లాభాలు.

**వృశ్చికం :** రాజకీయాలు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యక్రమాలకు అనుకూల కాలము. క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు :** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది. మొండి బాకీలు రాబట్టు కోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**మకరం :** ముఖ్యమైన విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసి వస్తాయి.

**కుంభం :** కార్యాలయాలలో సహోద్యోగుల సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం :** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ప్రజారోగ్యానికి సవాలుగా మారిన ఊబకాయం

### రాష్ట్రంలో ప్రతి ఇద్దరిలో ఒకరికి అధిక బరువు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** ఊబకాయ సమస్య రాష్ట్ర ప్రజారోగ్యానికి సవాల్ విసురుత్నోదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర రూపం దాలుస్తోన్న ఊబకాయ సమస్యను ఎదుర్కొనేందుకు జాయింట్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్య శాఖతోపాటు విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. విజయవాడలో గురువారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఊబకాయం, జీవక్రియ ఆరోగ్యంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి బహుళరంగ భాగస్వామ్యుల సదస్సులో మంత్రి మాట్లాడారు. జీవనశైలిలో వస్తోన్న మార్పులకారణంగా ఊబకాయం ప్రధాన ప్రజారోగ్య సవాల్‌గా మారుతోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సంపద పెరుగుతున్న వేగం కంటే ఊబకాయం విస్తరిస్తున్న వేగం ఎక్కువగా ఉందన్నారు. పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక ప్రగతితో జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నప్పటికీ.. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమతగ్గడం వంటి కారణాలతో ఊబకాయం సమస్య తీవ్రతరమవుతోందని చెప్పారు. దీనిని నిరక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యంతోపాటు ఉత్పాదకత, ఆర్థిక ప్రగతిపైనా ప్రభావం పడుతుందని వివరించారు. సిఐఐ రాష్ట్ర ఛైర్మన్ నరేంద్రకుమార్, మాజీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, ప్రిన్సిపల్ అడ్వైజర్ (హెల్త్‌కేర్) డాక్టర్ షుబ్నుమ్ సింగ్ మాట్లాడుతూ.. సీఐఐ ఆర్థిక వ్యవహారాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కూడా కృషి చేస్తోందన్నారు. ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఊబకాయ సమస్య తీవ్రతను గుర్తించి రాష్ట్రాల వారీగా అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై సీఐఐ తరఫున ప్రతిపాదనలు అందిస్తామని చెప్పారు.ఈ సదస్సులో వైద్య, ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, బోధానాసుపత్రుల వైద్యులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని ఊబకాయం పరిష్కార చర్యలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం సంఘీభావం


గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 13, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమ్మె రెండో దశలో భాగంగా జూనియర్ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుతంగా ఆందోళన కొనసాగించారు. జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. జూనియర్ వైద్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్‌తో పాటు డాక్టర్ కట్టా శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ రమ్య, డాక్టర్ కే. మారుతీదేవి, డాక్టర్ వై. రవీంద్రకుమార్, డాక్టర్ ఎస్. అరుణాదేవి, డాక్టర్ బి. శివగోపాల్, డాక్టర్ పి. రాజా, డాక్టర్ అజయ్, డాక్టర్ పి. సుధారాణి, డాక్టర్ టి. వెంకట శివరామకృష్ణ, డాక్టర్ పి. టాబిత, డాక్టర్ మురళి తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జూనియర్ వైద్యులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవని, వైద్య రంగ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న సమయంలో విద్యార్థులపై ఫీజులు, వసతి గృహ రుసుములు, అద్దెలు, పుస్తకాలు, వైద్య సదస్సులు, ఇతర విద్యా సంబంధిత ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జూనియర్ వైద్యుల ఉపకార వేతనాన్ని సకాలంలో సవరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**అర్హత కలిగిన వారికే బోధనా అవకాశాలు**

ఎంఎస్సీ, పిహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బంది నియామకాల విషయంలో కూడా స్పష్టమైన విధానం అవసరమని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఇలాంటి బోధనా సిబ్బంది వైద్య కళాశాలలు లేదా జాతీయ స్థాయి వైద్య సంస్థల్లో శిక్షణ పొంది, వైద్య విద్యార్థులకు బోధించడంలో తగిన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన వైద్య స్నాతకోత్తర బోధనా సిబ్బంది అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే ఇటువంటి నియామకాలను పరిగణించాలని, అవి మొత్తం నియామకాల్లో పది శాతానికి మించకూడదని సూచించారు. నిర్దేశిత నిబంధనలకు మించి నియామకాలు చేపట్టడం, పదవీ విరమణ వయస్సును పెంచడం వల్ల యువ వైద్యులకు ఉద్యోగ, బోధనా అవకాశాలు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సీనియర్ వైద్యుల అనుభవం, విజ్ఞానం రాష్ట్ర వైద్య రంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## రాజకీయాల్లోకి వచ్చే యువతకు కన్నా లక్ష్మీనారాయణ ఆదర్శం

### అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**గుంటూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు సీనియర్ నేత కన్నా లక్ష్మీ ్మనారాయణ జీవితం ఎంతో ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కొనియాడారు. గుంటూరు లో గురువారం ఘనంగా జరిగిన ఖకన్నాఖ రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు, ఆయన 73వ జన్మదిన మహోత్సవ వేడుకలకు అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి ఎన్నికల్లో గెలిస్తే రెండోసారి గెలవడం కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో, కన్నా లక్ష్మీ ్మనారాయణ ఏకంగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసిన ఏకైక నేతగా ఘనత సాధించారని కితాబిచ్చారు.క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ కన్నా నైజమని, ఆయన నడిచిన బాట నుంచి నేటి తరం ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాడు దివంగత ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం వల్లే నేడు ప్రజల ఎదుట ఇలా నిలబడే అవకాశం కలిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు. నేటి యువత చురుగ్గా రాజకీయాల్లోకి వచ్చి స్వచ్ఛమైన పాలన అందించాలని పిలుపునిచ్చారు.

# నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం


గురువారం ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు. చిత్రంలో ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ విజయ సునీత

## నిర్వాసితుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం

### నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**మార్కాపురం, ఆగస్టు 13, ప్రభాతవార్త ప్రతినిధి :** మూడు దశాబ్దాల పశ్చిమ ప్రాంత కల సాకారం కానున్న వెలిగొండ ప్రాజెక్టును ఈనెలాఖరులో జాతికి అంకితం చేయడం జరుగుతుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ప్రాజెక్టు నీటి విడుదలపై నిర్వాసితుల సమస్యలను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును ఆయన చేతుల మీదుగానే ఈ నెలాఖరులో జాతికి అంకితం చేయడం ఓ సువర్ణ అధ్యాయం అన్నారు. మూడు జిల్లాల్లో సాగు, తాగునీరు అందించే భారీ వెలిగొండ ప్రాజెక్టు నీటితో పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో మిగిలిపోయిన పనులన్నింటిని ప్రణాళికబద్ధంగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగామన్నారు. కొల్లం వాగు నుంచి రెండు టన్నెల్స్‌ల ద్వారా నల్లమల సాగర్‌కు నీరు అందించేందుకు రాత్రింబవళ్లు అధికారులు, సిబ్బంది కష్టపడి పని చేయడం జరిగిందన్నారు. లైనింగ్ పనులు, టన్నెల్ నిర్మాణ పనులు వంటి పెండింగ్ ఉండగానే 2024లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసి దగా చేశారని విమర్శించారు. ఎటువంటి పనులు చేపట్టకుండానే కేవలం జాతికి అంకితమంటూ ఓట్ల కోసం పశ్చిమ ప్రాంతప్రజలను మోసం చేశారన్నారు. రెండవ టన్నెల్‌లో 80వేల క్యూసెక్కుల మట్టి తొలగించడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాలన్న సంకల్పంతోనే శరవేగంగా పనులు పూర్తి చేశామన్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ తొలగింపుకు పెద్ద ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని, 1900 మెట్రిక్ టన్నులు ఉన్న బోరింగ్ మిషన్‌విడిభాగాలకుగాను 1500 మెట్రిక్ టన్నులు బయటకు తీసుకు రావడం జరిగిందని, మరో 400ఈనెల 17వతేదీలోపు తొలగించడం జరుగుతుందన్నారు. టన్నెల్ బోరింగ్‌మిషన్ గుత్తేదారు పనులపై స్టేఉన్నందున న్యాయ నిపుణులతో చర్చించి ఆ స్టేను తొలగించడం జరిగిందన్నారు. 11వేల క్యూసెక్కుల ప్రవాహం కలిగిన ఫీడర్ కెనాల్ గండి పడిపోగా పరిస్థితిని అధ్యాయనం చేసి ఫీడర్ కెనాల్‌కు సిసి వాల్, లైనింగ్ పనులు రూ.4కోట్లతో పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన 900 కోట్ల రూపాయల పరిహారానికి గాను గత నెలలో రూ.315 కోట్లు ఇవ్వడం జరిగిందని, మిగిలిన బ్యాలెన్స్ పరిహారం కూడా నెలాఖరులోపు పూర్తి స్థాయిలో చెల్లించడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల త్యాగాలు మరువలేమని, నిర్వాసితుల సమస్యలన్నింటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా అందుతుందన్నారు. గజిట్‌లోపేర్లు తప్పులు పడి పరిహారం తీసుకోని వారి సమస్యలు పరిష్కరించి పరిహారం అందించడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి గ్రామానికి అధికారులతో కమిటీలు వేయడం జరిగిందని, ఆ కమిటీలు నిర్వాసితుల ప్రతి సమస్యను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఎవరికైనా పరిహారం రాకపోతే ఎందుకు ఇవ్వలేకపోయామో కూడా కారణాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఏఒక్కరికి అన్యాయం జరగకుండా సమస్యలను పరిష్కరించి ఆదుకోవడమే తమ కర్తవ్యం అన్నారు. కూలీనాలి చేసుకుని జీవించే నిర్వాసిత ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వెలిగొండ నీటి విడుదల ద్వారా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాకుండా అన్ని రకాలుగా వెనుకబాటుకు గురైన పశ్చిమ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం జరుగుతుందని, తద్వారా యువతకు ఉపాధిఅవకాశాలు మెరగవుతాయన్నారు. ఆర్థికంగా, సామాజికంగా పశ్చిమప్రాంతం ఎదగనుందన్నారు. వెలిగొండ నీటి ద్వారా ఫ్లోరిన్ సమస్యకు స్వస్తిచెప్పడమే కాకుండా భూగర్భజలాలు మెరుగుపడి సాగు, తాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం కానుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా మూడు దశాబ్దాల పశ్చిమ ప్రాంత కల కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేరుతుండడం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

14-8Pg3exHMNWJQE_14-8Pg3exHMNWJQE.qxd 13/Aug/26 11:03 PM Page 1





భుజానికి శస్త్ర చికిత్సపూర్తయిన అనంతరం గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న జూనియర్ ఎన్టీఆర్

# ఆస్పత్రి నుంచి జూనియర్ ఎన్టీఆర్ డిశ్చార్జ్

## రెండు నెలలు విశ్రాంతి అవసరం

### సినీనటుడికి వైద్యుల సూచన, హెల్త్‌బులెటిన్ విడుదల

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 13 ప్రభాతవార్త:** భుజం నొప్పితో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శస్త్ర చికిత్స అనంతరం గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల ఆయన భుజానికి శస్త్రచికిత్స విజయ వంతంగా చేసినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఆయన ఆస్పత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. డా. ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వీ, డా.నితిన్ బెజంకి నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయనకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ఆయన పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఇకపై క్రమబద్ధమైన పున రావాస(రిహాబిలిటేషన్) కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయి.

### స్వయం సహాయక సంఘాలకు

# ప్రభుత్వం గుడ్ న్యూస్

## 10 మంది నిబంధన సడలింపు

### పొదుపు సంఘాలకు సులభంగా బ్యాంక్ రుణాలు

### ఎపి గ్రామీణ బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు

### ఇతర బ్యాంకులూ అనుసరించాలని మంత్రి పిలుపు

**సచివాలయం, ఆగస్టు 13 ప్రభాతవార్త :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవా సాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్‌డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ఈ క్రమంలోనే ఎపి గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని, అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు అక్రమాలు లేకుండా పాత బకాయలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. రుణసడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే రీతిలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బిసి), రాష్ట్రంలో ఉన్న ఇతర బ్యాం కులు కూడా ముందుకు వచ్చి, మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సం ఘాలకు 10 మంది నిబంధనను సడలించి, సులభంగా రుణ పునరుద్ధరణ సహాయం అందించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఎండి హెప్సిబా



**సచివాలయం, ఆగస్టు 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతి పేదవానికి పక్కా ఇల్లు అందించాలని, ఆలక్ష్యానికి అనుగుణంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ళను సకాలంలో పూర్తి చేయడానికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషిచేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి,రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ హెప్సిబా కొర్లపాటి పిలుపునిచ్చారు.గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జ్ ఎండిగా నియమితులైన ఆమె అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ లబ్దిదారులను ప్రోత్సహిస్తూ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు క్రమం తప్పకుండా లేఅవుట్‌లను సందర్శించి పనుల పురోగతిని,నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి అధికారి,ఉద్యోగి సమయపాలన పాటిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.సమావేశంలో సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ కృష్ణయ్య,జనరల్ మేనేజర్లు గోవిందరావు,లీలారాణి తదితర అధికారులు పాల్గొన్నారు.




# దేశంలోనే తొలి ప్రైవేట్ బ్రాండ్ రైలు 'స్ప్రైట్ తేజస్'

**లక్నో, ఆగస్టు 13:** దేశంలోనే తొలి ప్రైవేట్ రైలు పేరు తేజస్. ఈ రైలును ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ప్రారంభించింది. ఇది లక్నో- ఢిల్లీ మధ్య నడుస్తుంది. ఇప్పుడు ఈ రైలును స్ప్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్ అని పిలువనున్నారు. ఈ ప్రకటన హక్కులను ఆరునెలల కాలానికి ఐఆర్‌సీటీసీ కల్పించింది. దీంతో ఈ రైలును స్ప్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్ పిలవాలని నార్త్ ఈస్టర్న్ రైల్వే సూచించింది. దేశంలో ఒక రైలుకు బ్రాండ్ పేరు పెట్టడం ఇదే మొదటిసారి. సూపర్‌ఫాస్ట్ రైలు అయిన దీనిలో ఏసీతో పాటు అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. దీనిలో ఆహార, పానీయాలు, ఇన్ఫోటైన్‌మెంట్ సేవలు కల్పిస్తారు. అదేవిధంగా గ్రూప్ బుకింగ్ చేసుకోవచ్చు. సమావేశాలు, వివాహాలు, ఏదైనా ఈవెంట్ కోసం 78 సీట్ల ఏసీ చైర్ కార్‌ను వినియోగించుకోవచ్చు. ఈ ప్రైవేట్ రైలు ట్రాకులు, మౌలిక సదుపాయాలు వినియోగించుకుంటున్నందుకు అయ్యే ఖర్చును ఐఆర్‌సీటీసీ భారతీయ రైల్వేకు చెల్లిస్తుంది. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ రైలు అయిన తేజస్‌ను ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఐదేళ్లక్రితం డిసెంబర్ 3న ప్రారంభించారు.

# రాజధానితో అన్ని జిల్లాలకు సమన్యాయం: మంత్రి నారాయణ



బకింగ్‌హామ్ కెనాల్ స్టీల్ బ్రిడ్జిపై మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని, ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నై ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మన్ ఫోస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు. అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉంటుందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని.. కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామని అన్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానుల అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరిశీలన చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినప్పటికీ అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు సిఎం చంద్ర బాబు కు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

# 'సర్'ను పారదర్శకంగా పూర్తి చేయాలి: సిఇఒ

## 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు

### అభ్యంతరాలు సమర్పించేందుకు 30 వరకూ గడువు




గురువారం సచివాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఇఒ వివేక్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఈవో, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలన్నారు. మ్యాపింగ్ చేయని ఓటర్లు, లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయడం, విచారణలు పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. బుక్ ఎ కాల్ పెండింగ్ అంశాలు, ఎన్‌జీఎస్పీ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఈ నిర్ణీత ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల ప్రతినిధులు (బీఎల్ఏలు) పోలింగ్ కేంద్రాల్లోనే స్వయంగా అందుబాటులో ఉండి పౌరులకు ఓట్ల నమోదు, ఫారమ్‌ల పూర్తిపై మార్గదర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ఈ ప్రక్రియను పారదర్శకంగా ముగించాలన్నారు. 18- 19 ఏళ్ల వయసు గల యువ ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, అర్హులైన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు).అదనపు డిఈవోలు పాల్గొన్నారు. ఇక ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 15 నుంచి జులై 24 మధ్య మీ వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫాంలను బూత్ స్థాయి అధికారులకు ఇంకా సమర్పించ లేనివారికి, తాజాగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేనివారికి ఎన్నికల సంఘం ఓ అవకాశం కల్పించింది. మీ పేరు జాబితాలో ఉన్నా పేరు, వివరాలు, చిరునామాల్లో ఏమైనా తప్పులు, సవరించుకునేందుకు, లేకుంటే మార్పులు కోసం,జాబితాలోని అనర్హుల పేర్లపై అభ్యంతరం చెప్పేందుకు వీలు కల్పించింది. ఆయా అంశాలపై దరఖాస్తు చేసుకునేందుకు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు.బిఎల్‌ఏ ఎవరైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఆగస్టు 30 వరకూ సమయం ఇచ్చింది.

# సిట్ నివేదికను బయటపెట్టిన మంత్రి డోలా

## 97.55 శాతం ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు

### ప్రైవేట్ రిసార్ట్‌లో, అనర్హులతో వాల్యుయేషన్ జరిపినట్లు గుర్తింపు

### యువతను మోసం చేసిన జగన్ సమాధానం చెప్పాలి



**విజయవాడ, ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు. సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహిం చడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్‌వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16వేల డీఎస్సీ ఉద్యో గాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబ ద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తిచేశామన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నవారు, ముందుగా సిట్ నివేదికలో తేలినతమ అక్రమాలపై సమా ధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, గతంలో జరిగిన అక్రమా లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్ సైట్ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 13,ప్ర,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్ సైట్ ని ఉపయోగించుకొని అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. గురువారం తాడేపల్లిలోని ఎస్సి కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్సైట్ ప్రారంభించారు. ఈ వెబ్ సైట్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపరిచారు. పథకాలకు సంబంధించిన అర్హతలు, రుణ పరిమితి, సబ్సిడీ వంటి వివరాలతో పాటు ఆయా పథకాలకు సులభతరంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా వెబ్సైట్ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎస్సీలకు విద్య, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధితో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సి కార్పొరేషన్ వెబ్సైట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం కోసం ఉచిత శిక్షణ అందించి వారికి ఇజ్రాయెల్ దేశంలో ఉపాధి కల్పిస్తామన్నారు. దీని కోసం ఈ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, గుం టూరు, తిరుపతి కేంద్రాలుగా జర్మన్ లాంగ్వేజ్ లో ఉచిత శిక్షణ ఇప్పించి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఔత్సాహికులు ఈ వెబ్ సైట్ ని ఉపయోగించుకొని ఆయా పథకాలకు దర ఖాస్తు చేసుకోవాలని మంత్రిడోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కోరారు.ఈ కార్యక్రమంలో మాదిగ, మాల కార్పొరేషన్ చైర్మన్లు ఉండవల్లి శ్రీదేవి, పెదపూడి విజయ్‌కుమార్, సాంఘిక సం క్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్, ఎస్సి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై కసరత్తు .. సెప్టెంబర్ 30తో ముగినయున్న గడువు

**విజయవాడ, ఆగస్టు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై మంత్రుల బృందం గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. 2024-26 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు. ప్రతిపా దించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది.

అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనం తరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధితపూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు.

# గత పాలకులు రైతులను అవమానాలకు గురి చేశారు: మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ.ఆగస్టు13,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రైతులను ఎన్నో అవమానాలకు గురిచేశారని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. రాజధాని కోసం భూములిచ్చేందుకు రైతులు ముందుకు వచ్చినా వారిని కించపరిచారని, గతంలో పవన్ కల్యాణ్ తన పర్యటనల ద్వారా రైతుల పడుతున్న బాధలను స్వయంగా అర్థం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలనేదే పవన్ కల్యాణ్ ఆకాంక్ష అని చెబుతూ రాజధాని అమరావతి రైతులకు ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి సహకారంతో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మరిన్ని కీలక చర్యలు తీసు కుం టుందని మంత్రి స్పష్టం చేశారు.రాజధాని నిర్మాణం కోసం 30 వేల మంది రైతులు ముందుకొస్తే, వారిని అవమానించారని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలు రాజధాని రైతులను నానా ఇబ్బందులు పెట్టారని, వాటిని రైతులు ఎప్పటికీ మర్చిపో కూడదని మంత్రి సూచించారు. రైతులు ఆనందంగా ఉండాలనేదే పవన్ కల్యాణ్ కోరికని నాదెండ్ల మనోహర్ తెలిపారు. నాడు పర్యటనల్లో పవన్ స్వయంగా రైతుల బాధలను చూసి చలించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమరావతి నిర్మాణ కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాజధాని అభివృద్ధికి మరిన్ని వేగవంతమైన చర్యలు తీసుకుం టామని వెల్లడించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక పోరాటం చేసిన అమరావతి రైతులకు మంత్రి నాదెండ్ల మనోహర్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# పలువురు జిల్లా జడ్జీల బదలీ

## ఎపి జుడీషియల్ అకాడెమీ డైరెక్టర్‌గా వైవిఎస్‌బిజి పార్థసారథి

**విజయవాడ, ఆగస్టు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా జడ్జిలను హైకోర్టు బదిలీ చేసింది. మరోవైపు హైకోర్టులో పలు నియామకాలు చేపట్టింది. విశాఖపట్నం జిల్లా పిడిజెగా సేవలు అందిస్తున్న చిన్నశెట్టి రాజు హైకోర్టు రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్)గా నియమితులయ్యారు. రాజు ఈ పోస్టులో బాధ్యతలు స్వీకరించాక కొత్తగా మంజూరైన రిజిస్ట్రార్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. నెల్లూరు జిల్లా పిడిజె జి.శ్రీనివాస్ విశాఖ జిల్లా పిడిజెగా నియమితులయ్యారు. శ్రీనివాస్ విశాఖ పిడిజెగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎపి వ్యాట్ అప్పీలేట్ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కడప జిల్లా పిడిజెగా పనిచేస్తున్న డాక్టర్ సి.యామిని కృష్ణా జిల్లా(మచిలీపట్నం) పిడిజెగా బదలీ అయ్యారు. చిత్తూరు జిల్లా తిరుపతి కుటుంబ న్యాయస్థానం, అయిదో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.రామ గోపాల్ కడప జిల్లా పిడిజెగా నియమితులయ్యారు. తిరుపతిలోని ఎర్రచందన స్మగ్లింగ్ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఎ.నరసింహమూర్తి నెల్లూరు పిడిజెగా నియమితులయ్యారు. హైకోర్టులో రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్)గా సేవలు అందిస్తున్న వివిఎస్ఎస్ శ్రీనివాస శర్మ కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మొదటి అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) శ్రీనివాస శివరాం బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీచేశారు. ఈనెల 19లోగా కొత్త స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఇక హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జి)గా పనిచేస్తున్న వైవిఎస్‌బిజి పార్థసారథి ఎపి జుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పిడిజె)గా పనిచేస్తున్న గుత్తాల గోపి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు.

# సైనికుల సంక్షేమానికి రూ.3 లక్షల విరాళం



**విశాఖపట్నం, ఆగస్టు 13, ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలుస్తూ రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఎంపీగా అందుకున్న తొలి నెల జీతంరూ.3లక్షలను అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందిం చారు.ఈ మేరకు విరాళం చెక్కును కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వయంగా అందజేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank
...the name you can BANK upon!
సాధారణ సేవల పరిపాలన విభాగం – జోనల్ ఆఫీసు
6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లలో ఆర్కిటెక్చరల్ సేవలు అందించు ఆర్కిటెక్ట్‌లు / సంస్థల ఎంప్యానెల్‌మెంట్ ప్రకటన
'ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలలో వివిధ విభాగాలలో ఆర్కిటెక్చరల్ సేవలను అందించే ఆర్కిటెక్ట్‌లు / సంస్థల ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తులను' పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల డౌన్‌లోడ్ ప్రారంభం: తేదీ 14.08.2026 ఉదయం 10:00 గంటల నుండి. దరఖాస్తుల డౌన్‌లోడ్ మరియు సమర్పణకు చివరి తేదీ: 27.08.2026 సాయంత్రం 17:00 గంటల వరకు. ప్రీ-క్వాలిఫికేషన్ దరఖాస్తు పత్రాన్ని మా వెబ్‌సైట్ www.pnbindia.in/Tender.aspx నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బ్యాంక్‌లో ప్రస్తుతం ఎంప్యానెల్ అయి ఉన్న ఆర్కిటెక్ట్‌లు / ఆర్కిటెక్చరల్ సేవల సంస్థలు కూడా ఈ ప్రస్తుత ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియలో తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
పూర్తిగా భర్తీ చేసిన దరఖాస్తు ఫారమ్‌ను అవసరమైన అన్ని పత్రాలతో కలిపి పంజాబ్ నేషనల్ బ్యాంక్, GSAD, జోనల్ ఆఫీస్, 6-1-73, రెండవ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 500004 చిరునామాలో సమర్పించాలి. పైన పేర్కొన్న ప్రీ-క్వాలిఫికేషన్ పత్రానికి సంబంధించి ఏవైనా సవరణలు (Corrigendum) లేదా స్పష్టీకరణలు ఉంటే కేవలం పైన తెలిపిన వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి. కావున వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా చూడగలరు.
చీఫ్ మేనేజర్

AU SMALL FINANCE BANK
నమోదిత కార్యాలయం: 19-A ధులేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా, 302001.
www.au.bank.in
బంగారంపై రుణం-"ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా" ప్రాతిపదికపై వేలం ప్రకటన
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి బంగారంపై రుణ సౌకర్యాలు పొందిన క్రింద పేర్కొన్న వారిని రుణగ్రహీత/లు వారి రుణ బకాయి మొత్తాలను చెల్లించవలసినదిగా నోటీసులు జారీ చేయడమైనది. రుణ గ్రహీత/లు అతని/వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున అందులో నిర్దేశించబడిన పద్ధతి ప్రకారం క్రింద పేర్కొనబడిన శాఖలలో 14 సెప్టెంబర్ 2026న ఉ.11.00 మ.3.00 (సమయం) మధ్య తాకట్టు పెట్టిన బంగారు ఐటమ్‌లు/వస్తువులు యొక్క వేలం మేము బహిరంగ వర్చ్యువల్ నిర్వహించబోతున్నాము. దివంగతులైన రుణగ్రహీతల విషయంపై వారి చట్టబద్ధమైన వారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి. పై వేలం నిర్వహించడం ఒకవేళ విఫలమైతే బ్యాంక్ ముందస్తుగా తెలియపరచవలసిన అవసరం లేకుండానే మరొక వేలం నిర్వహించటానికి దానికి హక్కు రిజర్వ్ అయిఉన్నదని దయచేసి గమనించవలసినదిగా ఇందుమూలముగా తెలియజేస్తున్నాము.
భౌతిక వేలం శాఖ వివరాలు
యెమ్మిగనూరు -L25660001817382 L25660001956519 L26660000895548 L25660001875881 L26660000794778 L25660001980233 L25660001891780 L25660001911485 L25660001897189 । నరసన్నపేట - L25660001820865 L25660001813609 L25660001988918 । కనిగిరి -L9001090157542743 L9001090157546112 L25660001879794 L26660000919026 పొన్నూరు L25660002016912 తాడిపత్రి -L25660001943904 L25660001936947 L25660001813419 L25660002148313 L25660001990214 L25660002013977 L25660002017040 L25660002013447 । సుజాత నగర్ ఒంగోలు -L26660000907328 L25660001966000 L25660001888696 । గుంటూరు -L26660000613131 L26660000286995 । అల్లగడ్డ - L25660000708915 । గిద్దలూరు -L25660002039888 L25660002030965 L25660001959164 L25660002100314 L25660001831535 L25660002100524 L25660001925418 । రమణయ్యపేట కాకినాడ L25660001927795 L25660001900705 L25660001971250 । మచిలీపట్నం L26660000826120 L25660001813179 L26660000886056 । కాకినాడ L26660000792872 L25660001806263 L25660001897779 । నందికొట్కూరు L25660001932355 L25660001821644 । గుంతకల్ - L25660001830686। దేవరపల్లి - L26660000901909 L25660001840287 L9001090158529639 । బొబ్బిలి -L26660000799969 L25660001842184 L25660001892768 L25660001910876 । రేపల్లె -L26660000811628 L25660001953735 మార్కాపూర్ -L25660000687552 L25660001848763 L25660001995495 పెద్దాపురం - L25660001972148 L25660001907943 L25660002035715 L25660001961569 L25660001958275 । గాయత్రి నగర్ విజయవాడ - L9001092053810279 L26660000676831 । కడప -L25660001913461 L25660002039248 L25660002025475 । నరసరావుపేట - L25660001969905 L25660001895413 L25660001803958 L25660001997771 । ఆత్మకూరు -L25660001842984 L25660002011361 L25660001871048 L25660001934691 । CB రోడ్ చిత్తూరు -L25660001923962 L25660002035285 L25660002034607 L25660001882587 L25660002023728 L25660002025935 । కర్నూలు -L25660001961049 L25660001812061। జంగారెడ్డిగూడెం -L25660001985864 L25660002028789 L26660000778609 L25660001843412 L25660002029317 L25660002038680 । అద్దంకి -L25660001961239 L25660001960971 L25660001821184 L25660001948605 । Ctm రోడ్ మదనపల్లి L26660000904604 L25660002038270 L26660000795536। తిరువూరు L25660001856357 L25660001862835 । Rc రోడ్ తిరుపతి -L26660000528701 L25660001871718 L25660001863924 L25660001401085 L25660001871988 L25660001812421 L25660001812371 । మురళీ నగర్-విశాఖపట్నం L25660001837754 L26660000513359 L25660002183175 L25660001856807 । రాజమండ్రి -L25660001913961 । అనకాపల్లి - L25660000724204 । కోవూరు L26660000662087 L26660000842309 L26660000898153 । నంద్యాల -L25660002023428 L26660000748146 । అమలాపురం -L25660001901244 । ఏలూరు -L26660000860835 L25660001235956 L26660000784767 L26660000860575 నందిగామ L25660002028079 L25660002290814 L26660000388933 । పిడుగురాళ్ల L25660001810255 । వినుకొండ -L25660002287580 L25660002287070 । నాయుడుపేట - L25660001929491 L25660000959931 । చీరాల -L25660002007729 L26660000674705 L25660001938654 । గూడూరు-L25660002032041 । పాలకొల్లు -L25660001848633
గమనిక: 1. ఒకవేళ భౌతికంగా వేలం విఫలమైతే వెబ్‌లింక్ - https://gold.samil.in ఉపయోగించటం ద్వారా ఇ-వేలం నిర్వహించవచ్చును.
2. ఒకవేళ ప్రతిపాదించబడిన వేలం విఫలమైతే తర్వాతి వేలం కొరకు ఈ నోటీసును ముందస్తు-ప్రకటనగా దయచేసి పరిగణించవలెను.
3. వేలం యొక్క ప్రారంభానికి ముందు అందుబాటులో ఏర్పాటు చేసిన బిడ్ ఫారమ్‌లోని రూఢీ అయిన నియమాలు మరియు నిబంధనలకు లోబడి వేలం ఉంటుంది.
సం/- మేనేజర్, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

మన కష్టసుఖాలకు తరచూ కారణమయ్యేది మన మాట తీరే.
- షేక్స్పియర్

# రాజకీయ గ్రహణంలో దేవుళ్లు!

భారతీయ సంస్కృతికి మారుపేరుగా, భక్తి విశ్వాసాలకు నిలయాలుగా ఒకనాడు ప్రజాదరణ పొంది, దేదీప్యమానంగా వెలుగొందిన దేవాలయాలు రానురాను దీనావస్థకు చేరుకుంటున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లు వేలాది కోట్ల రూపాయల ఆస్తిపాస్తులున్నా నిత్యపూజలకు నోచుకోలేక, కనీసం దీపంపెట్టే దిక్కులేక, కళావిహీనంగా ఎన్నో ఆలయాలు జీర్ణావస్థకు చేరుకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. రాజకీయ అవసరాల కోసం దేవుడిని, దేవాలయాలను, దైవభక్తిని దుర్వినియోగం చేసే దుష్టసంప్రదాయం ఆరంభమైనప్పటి నుంచి దేవాలయ వ్యవస్థ పతనం ఆరంభమైందని చెప్పొచ్చు. పవిత్రమైన హిందూదేవాలయ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరుగుతున్న కొద్దీ దేవుళ్లకు, భక్తులకు కష్టాలు పెరుగుతున్నాయి. ఎవరు ఎంత అరచి గీపెట్టినా, ఎన్ని హెచ్చరికలు చేసినా, దేవుళ్ల ఆస్తుల దుర్వినియోగం నివారించలేకపోతున్నారు. ఒర్లి, ఒర్లి వారుపోతారు, వండక తిని మనం పోతాం అన్నట్లుగా ఉంది పరిస్థితి. గతంలో ఎన్నో విదేశీ దాడులు ఎదుర్కొని మరెన్నో ఆటు పోట్లు తట్టుకున్న దేవుళ్లు ఇప్పుడు స్వజనుల దోపిడీలను, దుర్మార్గాలను నియంత్రించలేపోతున్నారేమోననిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ముప్ఫైఆరువేలకు పైగా దేవాలయాలు ఉంటే అందులో నాలుగోవంతు దేవుళ్లు నిత్యపూజలు అందుకోలేకపోతున్నారు. ఆస్తులు స్వాహా చేయడమే కాదు, వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన అపురూప శిల్పకళాఖండాలున్న దేవాలయ ప్రాంగణాల నుంచి విగ్రహాలను పెకిలించుకుపోతున్నారు. గుప్తనిధుల కోసం నిరాటంకంగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ముఠాలు అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడినా అంతంత మాత్రం చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారు. ఇక దేవుళ్ల ఆస్తులు అన్యాక్రాంతమైపోయాయి, పోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం వరకు తీసుకున్నా రికార్డుల ప్రకారం దాదాపు తొంభైవేల ఎకరాలకుపైగా భూములు దేవుళ్లకు ఉన్నాయి. ఇందులో పదివేల ఎకరాలకుపైగా అన్యాక్రాంతమైనట్లు సమాచారం. అసలు దేవుళ్ల మాన్యాలను గుర్తించడం కష్టసాధ్యంగా మారిపోయింది. దేవాలయాల్లో నిత్యపూజ కైంకర్యాల నిర్వహణ, అర్చకుల జీవనోపాధి కోసం నిజాం, కాకతీయ ప్రభువుల నుంచి సామాన్య భక్తుల వరకు పెద్దమొత్తంలో భూములను విరాళంగా ఇచ్చారు. ఇప్పటికీ వాటి వివరాలు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. మరికొన్ని భూములకు సంబంధించి వివిధ స్థాయిలో న్యాయస్థానాల్లో వివాదాల్లో కొనసాగుతున్నాయి. ఇంకొకపక్క ఆక్రమించుకునేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నాదేవుళ్ల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన దేవాదాయ శాఖ కానీ, పాలకులు కానీ అంతగా పట్టించుకోకపోవడం దురదృష్టకరం. జీతభత్యాలపై ఉన్న శ్రద్ధ దేవుళ్ల ఆస్తులపై ఉండడం లేదు. అసలు దేవాలయాల భూములు ఎన్ని? భవనాలు ఎన్ని? ఎవరు ఆధీనంలో ఉన్నాయి? వాటిపై రావాల్సిన ఆదాయం ఎంత? ఎంత వస్తున్నది? తదితర వివరాలు దేవాదాయ శాఖ వద్ద స్పష్టంగా లేవనే చెప్పొచ్చు. కొన్ని తెలిసినా రకరకాల కారణాలతో నోరు విప్పరు. గతంలో ఈ భూములకు రికార్డులు ఎంతో పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలన్నీ నోట్ చేయడమేకాక జమాబంధి రూపంలో తనిఖీలు కూడా నిర్వహించేవారు. ఇప్పుడు రికార్డులు ఏమైనారాస్తున్నారేమోకానీ అవి ఏ మేరకు వాస్తవమో ప్రశ్నార్థకమే. దేవాదాయ భూములకు సంబంధించి నిజాం కాలంలో ఒక నిర్దిష్టమైన పద్ధతుల్లో నమోదు అయ్యేవి. హైదరాబాద్ రెగ్యులేషన్ కింద 1349 ఫస్లీ నుంచి తెలంగాణలో మొత్తం దేవాలయ భూములు వాటిపై వస్తున్న ఆదాయం పరిశీలించేవారు. ఆదాయ ఖర్చులకు సంబంధించి వివరాలు నమోదు చేసేవారు. ఆర్డిఒ స్థాయి అధికారితో పరిశీలన కూడా జరిగేది. దేవునిసొమ్ము ఏమాత్రం భోంచేసినట్లు తెలినా శిక్షలు తీవ్రంగా ఉండేవి. అప్పటి వరకు అమలులో ఉన్న మద్రాస్ యాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా కొనసాగించారు. 1966లో 17/66 చట్టం ద్వారా తెలంగాణ, ఆంధ్ర దేవాదాయ శాఖలను కలిపివేశారు. అప్పటివరకు అంతో ఇంతో రికార్డులు ఉండేవి. రానురాను భూములు అన్యాక్రాంతం కావడం, ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల పరిస్థితి అదుపు తప్పింది. హైదరాబాద్ నడిబొడ్డులో అత్యంత విలువైన వందలాది ఎకరాలకుపైగా భూమిని తొంభైతొమ్మిది సంవత్సరాలకు ఒక కంపెనీకి నామమాత్రపు లీజుకు ఇచ్చారు. అయితే ఆ కంపెనీ ఒప్పందాలు ఉల్లంఘించి ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించడంతో ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో న్యాయస్థానం దృష్టికి దేవాదాయ శాఖ తీసుకువెళ్లింది. సుప్రీంకోర్టువరకు నడిచిన ఈ కేసు లో భూమి దేవాదాయశాఖ పరమైంది. అయితే ఇప్పుడు భూమిపై కొందరు పెద్దలు కన్నేసినట్లు ఆరోపణలు వస్తు న్నాయి. ఇక్కడ అక్కడ అని కాదు ఎక్కడ వీలైతే అక్కడ భూములను ఆక్రమించుకునేందుకు నిత్యం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. భక్తులు సమర్పించుకునే కాను కులపై కూడా అక్రమార్కుల కన్ను పడి పక్కదారి మళ్లీ స్తున్న సంఘటనలు కూడా తరచుగా జరుగుతున్నాయి. ఇక దేవుళ్ల హుండీలకు కూడా కన్నాలు పడుతున్నాయి. ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తిరుమల తిరుపతి వెంకన్న కూడా అవినీతిపరుల నుంచి తప్పించుకోలేకపో తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలి.



ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటి వాడు, అలల వంటి సమస్యలకు వెనుతిరిగిపోడు.
టి.ఎడిసన్



ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు, ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయలేరు.
జార్జ్ ఇలియెట్

# ఆ లక్షల ఓట్లు ఎటుపోయాయి?

**ఓటరు జాబితా ఎంత చిన్నదైందన్నది విజయానికి కొలమానం కాదు. అర్హత లేని ఒక్క పేరు కూడా లేకుండా, అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరుకూడా మిస్‌కాకుండా ఉండే జాబితానే నిజమైన, శుద్ధమైన ఓటరు జాబితా. ఈ నెల 17న వెలువడే డ్రాఫ్ట్ జాబితా నుంచి అక్టోబర్ 19న వచ్చే తుది జాబితా వరకు ప్రతి దశలో ఈ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగం పైనే కాకుండా ప్రతి పౌరుడిపైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజు క్యూలో నిలబడటం మాత్రమే పౌరుడి బాధ్యత కాదు. తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో చూసుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. 73లక్షల పేర్లు బయటపడుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రతి ఓటరూ అప్రమత్తం కావాలి. ఒకసారి పేరు తొలగిపోయిన తర్వాత ఎన్నికల సమయంలో ఆందోళన చెందడం కంటే, డ్రాఫ్ట్ జాబితా వచ్చినప్పుడే తన హక్కును నిర్ధారించుకోవడం మంచిది. ఎందుకంటే ఓటు కేవలం ఒక గుర్తింపు కాదు. అది ప్రజాస్వామ్యంలో పౌరుడి స్వరం. ఆ స్వరం జాబితాలో ఉండాలి.**

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్( సర్) ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం. అయితే తాజాగా వెలువడుతున్న గణాంకాలు మాత్రం రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షల ఓట్లు జాబితా నుంచి బయటపడినట్లు తెలుస్తుండటం సాధారణ పరిణామంగా కొట్టిపారేయలేని అంశం. ముఖ్యంగా గ్రామీణప్రాంతాల్లో స్పందన ఎక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా ఎనిమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ వంటి అనేక దశలు కొనసాగాయి. దాదాపు 47రోజులపాటు ఎనిమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ సాగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఓటర్ల నుంచి వచ్చిన వివరాలను ప్రస్తుత ఓటరు జాబితాలతో సరిపోల్చడం, ఒకే వ్యక్తి పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్నాయా, మరణించిన వారి పేర్లు కొనసాగుతున్నాయా, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించడం జరిగింది. జిల్లాల వారీగా చూస్తే యాదాద్రి భువనగిరి జిల్లా అత్యధికంగా 94.30 శాతం స్థాయిలో ఎనిమరేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో 58.58 శాతంతో నిలిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గడం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. పల్లెల్లో ప్రజలు ఎనిమరేషన్ ప్రక్రియపై ఎక్కువగా స్పందించగా, పట్టణాల్లో ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం ఇందుకు ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. జాబితా నుంచి తొలగించబడుతున్న వారిలో నిజంగా అర్హతలేని వారెంతమంది? వాస్తవంగా అర్హులైనప్పటికీ తమ వివరాలు సమర్పించలేకపోయిన వారు ఎంతమంది? ఈ రెండు అంశాల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడం అత్యంత కీలకం. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం ప్రజాస్వామ్యానికి అవసరమే. కానీ శుద్ధి పేరుతో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. ప్రత్యేకించి హైదరాబాద్ వంటి మహానగరాల్లో సమస్య మరింత సంక్లిష్టంగా ఉంటుంది. ఉపాధి, విద్య, ఉద్యోగాల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రజలు తరచూ వలస వెళ్తుంటారు. అద్దె ఇళ్లలో నివసించే వారి సంఖ్య ఎక్కువ. ఒకే కుటుంబంలోని కొందరు ఒక నగరంలో, మరికొందరు మరో ప్రాంతంలో ఉండే పరిస్థితి కూడా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో చిరునామా మార్పు, తాత్కాలిక వలస, శాశ్వత వలస మధ్య తేడాను గుర్తించడం అధికారులకు పెద్ద సవాలే. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం కుటుంబాలు, స్థానిక సంబంధాలు, స్థిర నివాసాలు స్పష్టంగా ఉండటంతో ఎనిమరేషన్ ప్రక్రియ సులభంగాసాగి ఉండవచ్చు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పనులకు వెళ్లిపోవడం, అద్దె ఇళ్లలో మార్పులు, అవగాహన లోపం, ఫారాలు అందకపోవడం లేదా సమర్పించకపోవడం వంటి కారణాలు ప్రభావం చూపి ఉండవచ్చు. అందువల్ల గ్రామాల్లో అధిక స్పందన, పట్టణాల్లో తక్కువ స్పందనను కేవలం ప్రజల



నిర్లక్ష్యంగా చూడటం సరైనది కాదు. ఇక సుమారు 73 లక్షల ఓట్లు జాబితా నుంచి బయటపడుతున్నాయన్నఅంశం అత్యంత సున్నితమైనది. ఓటర్ల జాబితా నుంచి తొలగించ బడిన ప్రతి పేరు వెనుక ఒక వ్యక్తి ఉంటాడు. ఆ వ్యక్తి ఒక కుటుంబ సభ్యుడు. ఒక ఓటు అంటే కేవలం ఒక సంఖ్య కాదు, అది రాజ్యాంగం కల్పించిన రాజకీయ హక్కు. ఎన్ని కల సమయంలో ఆ హక్కును వినియోగించే అవకాశం కోల్పోతే, దాని ప్రభావం వ్యక్తిపైనే కాకుండా మొత్తం ప్రజా స్వామ్య ప్రక్రియపై పడుతుంది. అందుకే ఈ ప్రక్రియలో పారదర్శకత అత్యంత అవసరం. ఈనెల 17న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ప్రజలకు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అన్నది తెలుసుకునే అవకాశం కల్పించాలి. పేరులేకపోతే అభ్యంతరం లేదా క్లెయిమ్ దాఖ లు చేసుకునే విధానం గురించి విస్తృత ప్రచారం చేయాలి. గ్రామాల్లోనే కాకుండా పట్టణాలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, బస్తీలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అంతే కాదు, డ్రాఫ్ట్ జాబితాలో పేరు తొలగించబడిన ప్రతి ఓటరుకు సాధ్యమైనంతవరకు కారణాన్ని స్పష్టంగా తెలియజేయడం అవసరం. ఒకవ్యక్తి మరణించాడని భావించి పేరు తొలగిస్తే, దానికి ఆధారం ఏమిటో ఉండాలి. వేరే ప్రాంతానికి శాశ్వతంగా మారిపోయాడని భావిస్తే, ఆ నిర్ధారణ ఎలా జరిగిందో వెల్లడించాలి. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లు గుర్తిస్తే, సరైన చిరునామా ఏదో నిర్ధారించుకున్న తర్వాతే చర్య తీసుకోవాలి. ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం, బూత్ స్థాయి అధికారులు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలి. రాజకీయ పార్టీలు కూడా కేవలంతమకు అనుకూలంగా ఉన్న పేర్లు మాత్రమే కాపాడాలని కాకుండా, అర్హులైన ప్రతి ఓటరి హక్కును కాపాడేందుకు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. ఓటర్ల జాబితా శుద్ధి రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా జరగాల్సిన ప్రక్రియ. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా వెలువడనుండటంతో ఇప్పుడు అందరి దృష్టి ఆ జాబితాపైనే ఉంది. డ్రాఫ్ట్ జాబితా నుంచి తుది జాబితా వరకు వచ్చేకాలం అత్యంత కీలకం. ఈ మధ్యలో వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, సవరణలను అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించాలి. తుది జాబితా తయారయ్యే ముందు ప్రతి అర్హుడి ఓటుహక్కు రక్షించబడిందా లేదా అన్నదే ప్రధాన ప్రమాణంగా ఉండాలి. ఓటర్ల జాబితా లో అక్రమంగా చేర్చిన పేర్లను తొలగించడం ఎంత ముఖ్య మో, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడడం అంతకంటే ముఖ్యం. దొంగ ఓట్లను తొలగించాలనే ఉద్దేశం తో నిజమైన ఓటర్లను కూడా జాబితా నుంచి తొలగిస్తే అది శుద్ధి కాదు హక్కుల హరణం అవుతుంది. అదే సమయంలో నకిలీ, డూప్లికేట్, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వ్యక్తుల పేర్లు కొనసాగితే అది కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదమే. కాబట్టి సర్‌ను అనుమానంతో చూడాల్సిన అవసరం లేదు. కానీ గుడ్డిగా స్వాగతించాల్సిన అవసరమూ లేదు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రక్రియగా మారాలి. దానికి ప్రజల భాగస్వామ్యం, అధికారుల నిష్పక్షపాత వైఖరి, రాజకీయ పార్టీల బాధ్యతాయుత సహకారం ఈ మూడు తప్పనిసరి. చివరికి ఓటరు జాబితా ఎంత చిన్నదైందన్నది విజయానికి కొలమానం కాదు. అర్హత లేని ఒక్క పేరు కూడా లేకుండా, అర్హతఉన్న ఒక్క ఓటరు పేరు కూడా మిస్ కాకుండా ఉండే జాబితానే నిజమైన శుద్ధమైన ఓటరు జాబితా. ఈ నెల 17న వెలువడే డ్రాఫ్ట్ జాబితా నుంచి అక్టోబర్ 19న వచ్చే తుది జాబితా వరకు ప్రతి దశలో ఈ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపైనే కాకుండా ప్రతి పౌరుడిపైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజుక్యూలో నిలబడటం మాత్రమే పౌరుడి బాధ్యత కాదు. తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో చూసుకోవడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. 73 లక్షల పేర్లు బయటపడుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రతి ఓటరూ అప్రమత్తం కావాలి. ఒకసారిపేరు తొలగిపోయిన తర్వాత ఎన్నికల సమయంలో ఆందోళన చెందడం కంటే, డ్రాఫ్ట్ జాబితా వచ్చినప్పుడే తన హక్కును నిర్ధారించుకోవడం మంచిది. ఎందుకంటే ఓటు కేవలం ఒక

# అపోహాలతోనే... మూఢ విశ్వాసాలు!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఆధునిక సాంకేతిక యుగంలో సమాంతరంగా మానవ జీవన విధానాల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు అనాదిగా వస్తున్న అనేక విశ్వాసాల గురించి వాస్తవికతను తెలుసుకునేందుకు అధిక అవకాశం నేటిసమాజంలో గోచరిస్తూ ఉంటుంది. తరచుగా విభిన్న ఆచార వ్యవహారాలకు సంబంధించిన దేవాలయాలకు వెళ్లి కొందరు సంకల్ప పూజలు చేసినట్టుగా వార్తలు రావడం కూడా వింటుంటాం. అది నిజమేనా కాదా అనే అంశాలను పక్కన పెడితే ఈకాలంలో కూడా అనాదిగా వస్తున్న నమ్మకాలతో జనాలు దైనందిన జీవితంలో ఇలాంటి అంశాలపై ఆసక్తిని పెంచుకోవడం సహజమే. అయినా సమాజంలో ఎవరినమ్మకాలు విశ్వాసాలు వారివి. అయితే ఇటీవల తెలంగాణరాష్ట్రంలో ఏకంగా క్షుద్రపూజల అంశమే చర్చ కొనసాగుతుంది. అది కూడా మామూలు జనాల మధ్య జరిగిన అంశాలు కాకుండా క్షుద్ర పూజలు మంత్ర తంత్రాలు విషయమైప్రజా నాయకులు చర్చించుకుంటున్న విధానం విస్తృతంగా సమాజంలో వినిపిస్తుంది. మానవ జీవన సరళిలో మూఢవిశ్వాసాలుగా చెప్పబడుతున్న చేతబడులు అంటే క్షుద్రపూజలు, మంత్ర తంత్రాలు లాంటిఅనేక రకాలైనటువంటి విశ్వాసాలు ఇప్పటికీ ఇంకా ఆధునిక నాగరిక జీవన విధానాలతో కలిసిపోయి ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ప్రజలకు సహజంగా ఈ అంశాలపై ఆసక్తి బాగాఉంటుంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో క్షుద్రపూజలు మంత్రతంత్రాలు అంటే చేతబడి లాంటి అంశాలపై విపరీతమైన విశ్వాసాలు గోచరిస్తూ ఉంటాయి. ఇలాంటి విషయాల్లోఅనేక గ్రామాల్లో కొందరు క్షుద్రపూజలు చేస్తున్నారనే అనుమానాలతో అలాంటి వ్యక్తులపై హింసాత్మకదాడులు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. వాస్తవంగా క్షుద్రపూజలు చేతబడులునేటి ఆధునిక జీవనవిధానాల్లో నమ్మదగినవి కాకపోయినా మానవ జీవన పురోగతిలో ఇలాంటి అంశాలు మానవుని బలహీనమైన మనసులకు మరింత ఆందోళన కలిగిస్తుంటాయి. అయితే సమస్యలు వచ్చినప్పుడు దానికి పరిష్కారం దొరకనప్పుడు ఏదో అతీత శక్తి ఉందని దానికి కారణమైన క్షుద్రశక్తులు ఉంటాయని నమ్మేవారు కూడా ఇప్పటికిఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. అందుకు ఎవరో ఒకరు ఇలాంటి క్షుద్ర పూజలతో చేతబడి చేస్తున్నారని ఇతరుల నష్టాన్ని కోరుకుంటారని అందుకే క్షుద్ర పూజలు చేయడం వలన ఏదో జరిగిపోతుంది అనేదిసామాన్య జనాల్లో ఉన్నప్పటికీ, కొందరు నాయకుల్లోకూడా ఇలాంటి చర్చకొనసాగుతూ వస్తుండడం గమనార్హం. ఏదిఏమైనప్పటికీ బలహీనమైన మనసు కలిగినవారికి క్షుద్రపూజలు మంత్రతంత్రాలు లాంటి అంశాలు ఎంతో కొంత ఆసక్తిని కలిగిస్తుంటాయి. నమ్మకమైన జీవితం ధృడవిశ్వాసం కలిగినటువంటిమనసు కలిగిన మానవులకు ఇలాంటివాటిపై ఆసక్తి తక్కువే. సమాజంలో కొంతమందిలో ఉండే లేనిపోని అపోహల వలన ఇలాంటి విభిన్నమైన అంశాలు తెరపైకివస్తుంటాయి. నిజానికి ఆధునికంగా పరిణితి చెందుతున్న సమాజంలోమానవ జీవనప్రస్థానంలో విభిన్నవైవిధ్యాలు కలిగిన మానవుల మధ్య జరుగుతున్న అనేక విషయాలపై వాస్తవిక దృష్టితో నిర్దిష్టమైన ఆధారాలతో సరైన దృక్పథం ఉండాలే కానీ మూఢ విశ్వాసాలపై చర్చ అవసరం లేదనిపిస్తుంది. ●

# ప్రజావాక్కు



## యుద్ధాలతో జిడిపి పతనం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇరాన్ అణు సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యమయ్యే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని ప్రకటించడం మధ్యప్రాచ్యాన్ని మరోసారి ఉద్రిక్తతల కేంద్రంగా మార్చింది. ఇది కేవలం రెండు దేశాల మధ్యయుద్ధం మాత్రమేకాదు, ప్రపంచఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతున్న అంతర్జాతీయ సంక్షోభం. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హార్ముజ్ జలసంధి గుండా సాగుతుంది. ఘర్షణ తీవ్రతతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 65-68 డాలర్ల నుంచి 80-82 డాలర్లకు పెరిగింది. దీంతో రవాణా, విద్యుత్ ఉత్పత్తి, ఎరువులు, పెట్రోరసాయనాలు, విమానయాన రంగాల్లో వ్యయభారం పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు మళ్లీ అధికమవుతున్నాయి. పరిస్థితులు మరింత దిగజారితే ఈ నష్టం 3.5 ట్రిలియన్ డాలర్లకు చేరే ప్రమాదం ఉంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడుప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## అధికారులకు లంచాలు ఇవ్వొద్దు

ప్రభుత్వ ఆఫీసులలో మనభూమి, ఆదాయం, కులం ఇంకా ఏవైనా తదితర సర్టిఫికేట్లకు మీ సేవ నిర్వాహకులకు గానీ ప్రభుత్వ అధికారులకు గానీ ఎక్కడ కూడా అదనపు రుసుం చెల్లించరాదు. అలాంటి అధికారులు ఎవరైనా డబ్బులు అడిగితే పై అధికారులకు ఫిర్యాదు చేయండి. తప్పు డబ్బులు ఇవ్వద్దు. ఒకసారి లంచం ఇవ్వడం మొదలుపెడితే అందరూ లంచగొండులుగా తయారవుతారు. అప్రమత్తంగా ఉండండి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## చట్టపరిధిలోనందరినీ రెగ్యులర్ చేయాలి

కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ రెగ్యులరైజేషన్ కొరకు గత ప్రభుత్వం యాక్ట్ 30 జి.ఓ.114 ద్వారా 2023లో చట్టం చేసి కొన్ని శాఖల ఉద్యోగులను రెగ్యులర్ చేసాక, ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల తరువాత మరల రెగ్యులర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కాంట్రాక్ట్ వ్యవస్థలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఇతర శాఖలకంటే కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఎక్కువగా ఉన్నారు. రెగ్యులర్ ప్రక్రియలో భాగంగా వీరి సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ కూడా ఆనాడే జరిగి నిధి పోర్టల్ ద్వారా కేటగిరీల విభజనతో ఇంటర్ కమీషనర్ గారికి దిగువస్థాయి అధికారులు అప్‌లోడ్ చేశారు. కేటగిరీల విభజనలో జె.డి. ఆఫీస్ సిబ్బంది అవకతవకలకు పాల్పడి ఓవరేజ్ వారివి పంపించి వోవరేజ్ కాని వారివి ఓవరేజ్‌లో ఉంచేసినట్లు ఆరోపణలున్నాయి. పైఅధికారులు పరిశీలించవలసి ఉంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## ఇజ్రాయెల్‌కి పెనుశాపం

అమెరికా మీద సౌదీ, పాకిస్థాన్, ఈజిప్ట్, టార్కీ వంటి దేశాలు నమ్మకం కోల్పోయాయా అంటేఅవుననే సమాధానమే వస్తుంది. సౌదీ రక్షణ రంగ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నప్పటికీ పాకిస్థాన్ దేశంలో అణుబాంబు ఉన్నప్పటికీ టర్కీ నాటో సభ్యత్వం ఉన్నప్పటికీ తన భయం అంత నాటో సహాయం అందిస్తుందా అని ఊగిసలాటలో ఉన్నది. ఇంకా పశ్చిమఆసియా సంక్షోభం అంత ఈఅపనమ్మకం కలిగించడానికి కారణం అయింది. అయితే ఈపరిస్థితి అంతా ఇజ్రాయల్‌కి పెను శాపం అవుతుంది. వెస్ట్ బ్యాంకులో ఉన్న అసాధారణ పరిస్థితి అంత ఇజ్రాయల్ మెడకు చుట్టుకుంటున్నది.

- భారత అవినాష్, జనగామ

## గ్రామాలలో జంతుబలిని నిషేధించాలి

గ్రామాలలో వీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షాకాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబరాలు, వ్యర్థపదార్థాలను, రక్తం, మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడుతున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలిని నిషేధించాలి.

- కె. శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో వార్త యాజమాన్యం ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సమకాలీనాంశాలపై రచనలకు ఆహ్వానం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రశ్నించే గొంతుకగా 'బొద్దింకల' ఉద్యమం



మేకిరి దామోదర్

యువతను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తును కోల్పోయి నట్టే. వారి ఆశలకు దిశ చూపితే దేశ భవిష్యత్తుకు బాట వేసినట్టే!' అనే మాట అక్షరాలా నిజమవుతున్న సమ యం ఇది. దేశ జనాభాలో యువత వాటా గణనీయంగా ఉన్న మనదేశం లో వారి చేతిలో ఓటుమాత్రమే కాదు ప్రశ్నించేశక్తి, డిజిటల్ వేదికలు, సామాజిక చైతన్యం కూడా ఉన్నాయి. ఒకప్పుడు రాజకీయ పార్టీల పిలుపుతో ఉద్యమా లు జరిగేవి. ఇప్పుడు సమస్య తమ జీవితాల్ని చిన్నాభిన్నం చేయడంతో ఆవేదన చెందిన యువతే ప్రజా స్వామ్య పద్ధతిలో రాజ్యాంగ బద్ధంగా, రాజ్యాంగాన్ని చేబూని స్వయంగా ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. ప్రజాస్వామ్య పాలనలో రాజకీయాల్లో తప్పులు చేస్తే వాటి దుష్ఫలితాలు లక్షల, కోట్ల మంది అనుభవించాల్సి వస్తుంది. పాలన ప్రజల ఇష్టాయిష్టాలపై సాగాలి కానీ అధికార రాజ కీయ ఆధిపత్యం కోసం పాలన చేయకూడదు. ప్రజాపాలన లో అన్నిసామాజిక స్థాయిల్లోని ప్రజలు సమ్మిళిత అభివృద్ధి సాధించాలి. అలాకాకపోతే, అది ప్రజాస్వామ్యం అనబడదు. నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే స్వేచ్ఛను కాపాడుకోగలు గుతాం. మనదేశంలో ఇటీవల పరీక్షల నిర్వహణా లోపాలు, ప్రశ్నపత్రాల లీకులు, ఫలితాల్లో జాప్యం, ఉద్యోగ నియామకాల ఆలస్యం వంటిఅంశాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగార్థుల్లో పెరుగుతున్న అసంతృప్తి ఉద్యమానికి నిదర్శనం. 2026లో పరీక్షా సంస్కరణలను డిమాండ్ చేస్తూజరిగిన యువత ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షా వ్యవస్థను సమూలంగా సంస్కరించేందుకు 'నందన్ నీలేకణి' నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయత, సాంకేతిక వినియోగం పెంచ డమే లక్ష్యమని, లీకుల అక్రమాలకు పాల్పడే వారిపై 2026 సవరణలు చేసిన చట్టంలో శిక్షలు కఠినతరం చేశామని ప్రధాని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి చేసే స్వాతంత్ర్య దినోత్సవ' ప్రసంగంపై యువతతో పాటు దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల్లో, రాజకీయపార్టీల్లో ఆసక్తి నెలకొంది. ఉపాధి, ఉద్యోగ నియామకాలు, పరీక్షా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, దేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉంటుందా? లేక సాధారణ హామీలకే పరిమిత మవుతుందా? అన్నదే ఇప్పుడు కీలకంగా మారుతోంది. దేశ యువతకు విద్య పూర్త యిన వెంటనే ఎదురయ్యే అతిపెద్ద ప్రశ్న తర్వాత ఏంటి?' అన్నదే. చదువుకున్నా ఉద్యోగం దొరకడం కష్టమ వడం, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి రావడం, నోటిఫికేషన్లుపరీక్షలుఫలితాల మధ్య అంతులేని జాప్యం యువతలో అసహనాన్ని పెంచుతున్నాయి. అందు లోనూ ప్రశ్నపత్రాల లీకులు జరిగితే కష్టపడి చదివిన విద్యార్థి నమ్మకం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. పరీక్ష రద్దయితే డబ్బు, సమయం, శ్రమ మాత్రమేకాదు. యువత భవిష్యత్ ప్రణాళిక కూడా



దెబ్బతింటుంది. అందుకే చదివితే ఉద్యోగం వస్తుందనే నమ్మకం' కంటే ముందు న్యాయంగా పరీక్ష రాస్తే నా ప్రతిభకు గుర్తింపు లభిస్తుందనే నమ్మకం' కలగాలి. ఈ నేపథ్యంలో కేంద్రం పరీక్షల్లో అక్ర మాలకు అడ్డుకట్ట వేయడానికి చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 2026 చట్టం సవరణలో పరీక్ష ప్రక్రియలో మోసాలకు, అక్రమాలకు లీకులకు పాల్ప డితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, కనీసం రూ. ఒక కోటి జరి మానా విధించే కఠిన నిబంధనను చేర్చారు. అయితే చట్టాలు చేయడం ఒక్కటే సరిపోదు. వాటి అమలు పకడ్బం దీగా ఉండాలి. పరీక్షా నిర్వహణలో ప్రతి దశలో జవాబు దారీతనం, సాంకేతిక భద్రత, స్వతంత్ర పర్యవేక్షణ, వేగవంతమైన దర్యాప్తు ఉండాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా..సమస్య తలెత్తక ముందే నివారణ చర్యలు తీసుకోవాలి. పరీక్షల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించడం, ఖాళీలను నిరంతరం భర్తీ చేయడం, ఫలితాలను నిర్ణీత గడువులో విడుదల చేయడం, అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి చర్యలు అత్యవసరం. ఇప్పటి జెన్‌జెడ్ యువత రాజకీయాలను కేవలం సభలు, ర్యాలీలు, పోస్టర్లు, ప్రసంగాల ద్వారా మాత్రమే చూడడం లేదు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువస్తున్నారు. 2026లో విద్యార్థి ఉద్యమాలు కేవలం పరీక్షా సమస్యకే పరిమితం కాకుండా యువతలోని విస్తృత అసంతృప్తికి ప్రతిబింబంగా మారాయి. నిరుద్యోగం, పరీక్షా పారదర్శకత, విద్యా అవకాశాలు, భవిష్యత్ భద్రత వంటి అంశాలు రాజకీయ చర్చలోకి బలంగా వచ్చాయి. ప్రతిపక్ష పార్టీలు కూడా పేపర్ లీకులు, నిరుద్యోగం, ఉద్యోగార్థుల సమస్యలను ప్రధాన రాజకీయ అంశాలుగా ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడే రాజకీయ పార్టీలకు అసలు పరీక్ష మొదలవుతుంది. యువతను కేవలం ఎన్నికల సమయంలో ఓటర్లుగా చూడకుండా, పాలనలో భాగస్వాములుగా చూడాలి. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తికాదు. ప్రతి యువకుడికి తన ప్రతిభకు తగిన అవకాశం లభించడం, ప్రతి విద్యార్థికి న్యాయమైన పరీక్షావ్యవస్థ ఉండడం, ప్రతి ఉద్యోగార్థికి పారదర్శక నియామక ప్రక్రియ అందుబాటులో ఉండడం కూడా స్వాతంత్ర్యానికి అర్థాన్ని ఇస్తాయి. అందువల్ల ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో యువతకు స్పష్టమైన దిశానిర్దేశం అవసరం. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలపై పారదర్శక సమాచారం, నియామకాలకు నిర్దిష్ట క్యాలెండర్, పరీక్షా సంస్కరణలకు కాలపరిమితి, పేపర్ లీకులపై కఠినచర్యలు, నైపుణ్యాభివృద్ధికి మెరుగైన అవకాశాలు, అప్రెంటి షిప్‌ల విస్తరణ, పరిశ్రమలకు అనుగుణ మైన విద్యా విధానం రావాలి. తదితర అంశాలపై ఆచర ణాత్మక, స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. అదే సమ యంలో దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ఒత్తిళ్లు ఉన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి వినిపించే ప్రతి మాటకు యువత, దేశ ప్రజలు చెవులు కొరుక్కుని ఎదురుచూస్తోంది. ఆ మాటల్లో ఉద్యోగానికి భరోసా, పరీక్షలకు పారదర్శకత, నియామకాలకు కాలపరిమితి, పాలనలో జవాబుదారీతనం కనిపిస్తేనే యువత, ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుంది. లేకపోతే హామీలకు అమలుకు మధ్య పెరుగుతున్న అంతరం రాజకీయ అసంతృప్తికి ఆజ్యం పోసే ప్రమాదం ఉంది. అంతేకాదు భారత రాజకీయ సమీకరణాలు కూడా మారనున్నాయి!. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాల కాలం ముగుస్తోంది. తమ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే తరంఆవిర్భవిస్తోంది.

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 10:07 Page 1



గుంటూరు వార్త

# అబ్దుల్ కలాం ఆశయాలతో యువత ముందుకు సాగాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

### సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం అందిస్తాం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, కలాం ఎక్కువగా నేర్చుకున్న సందేశం "ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి" అన్న సూత్రమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలలు కనడం, లక్ష్యాలను సాధించడం, నిరంతరం శ్రమించడం వంటి అనేక విలువలను కలాం బోధించినప్పటికీ, వినయం ఆయన జీవితంలో అత్యంత గొప్ప లక్షణమని అన్నారు. జీవితంలో ఎదుగుదలకు అంతం ఉండదని, ఒక లక్ష్యం చేరుకున్నాక



జీవిత చరిత్ర పుస్తకావిష్కరణతో పాటు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకువచ్చి యువతకు అందించడం ద్వారా ఆయన విలువలు, సేవా భావం, దేశభక్తి తదితర అంశాలను కొత్త తరాలకు పరిచయం చేస్తున్నారని తెలిపారు. కలాం పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్న సంకల్పం ఎంతో గొప్పదని కొనియాడారు. గుంటూరులో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై గత ఏడాదికాలంగా ఫౌండేషన్ ప్రతినిధులు కృషి చేస్తున్నారని, ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా అమలు అయ్యేలా తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అబ్దుల్ కలాం జీవితం నుంచి తాను మరో లక్ష్యం ఎదురుచూస్తూ ఉంటుందని చెప్పారు. సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎప్పటికీ ముగియవని, కలాం గారు చివరి శ్వాస వరకు దేశం కోసం ఆలోచించి పనిచేసిన మహనీయుడని గుర్తు చేశారు. యువతనే దేశ భవిష్యత్తుకు ప్రతిరూపమని, వారి ఆలోచనలే భారతదేశ ఆలోచనలుగా మారుతాయని తెలిపారు. తాము కూడా అబ్దుల్ కలాం వంటి మహనీయుల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, మహనీయుల ఆశయాలను అభిమానించే వ్యక్తిగా ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీవీసి కాలనీలో మహిళ,వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య



**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని డీవీసి కాలనీలో ఓ మహిళ, వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని డీవీసి కాలనీలో మేళం చిరంజీవి(37), బర్కతున్నీసా(35) అనే ఇరువురు ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం రాత్రి వీరిరువురి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగి, ఘర్షణ ఆత్మహత్య చేసుకొనేందుకు దారితీసి ఉంటుందని తెలుస్తోంది. ఇంటిలోపల గడియపెట్టుకుని ఉరి వేసుకున్నట్లు చెప్పారు. బర్కతున్నీసా తల్లి నజీరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా తిరంగా యాత్ర,బైక్ ర్యాలీ

**గుంటూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త :** సమాజం కోసం చిన్న బాధ్యత అయినా, నిర్వర్తించే ప్రతి ఒక్కరూ దేశ సేవలో ఉన్న సైనికుల్లాంటి వారేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర బైక్ ర్యాలీ ఘనంగా జరిగింది. శ్రీనివాసరావుపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీ చుట్టుగుంట, నగరంపాలెం, ఎత్తురోడ్డు మీదుగా సంపత్ నగర్‌లోని రామనామ క్షేత్రం ఎదురుగా ఉన్న భారతమాత విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే గళ్ళా మాధవి భారతమాత విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఎన్డీయే కూటమి నేతలతో కలిసి జాతీయ గీతం జనగణమన ఆలపించారు. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొనడంతో తిరంగా యాత్ర విజయవంతమైంది. ఈ తిరంగా యాత్రలో ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, యువత, మహిళలు, దేశభక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, ఎన్నో సంక్షోభాలు, యుద్ధాలు, సవాళ్లను అధిగమించి భారతదేశం నేడు ప్రపంచ పటంలో ఒక ఐకానిక్ దేశంగా నిలవడం వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, వీరుల త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. వారి త్యాగఫలితంగానే నేడు



మనం స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామని తెలిపారు. భారతదేశం ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సి ఉందని, దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న సైనికులు, దేశంలో శాంతి భద్రతలను కాపాడుతున్న పోలీసుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఒక మొక్క నాటడం నుండి సమాజ అభివృద్ధికి దోహదపడే ప్రతి చర్య దేశభక్తికి నిదర్శనమని చెప్పారు. భావితరం దేశ గౌరవాన్ని మరింత పెంచే విధంగా చైతన్యవంతంగా, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని కోరారు. రానున్న రోజుల్లో భారతదేశం మరెన్నో అద్భుత విజయాలను



సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసే గొప్ప సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి జాతీయ జెండాను అందించి, దేశభక్తి భావాన్ని మరింత బలపరిచే కార్యక్రమంగా దీనిని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ తిరంగా యాత్రను భారతమాత విగ్రహం వద్ద ముగించి, సమాజ అభివృద్ధి కోసం ప్రతి భారతీయుడు తనవంతు కృషి చేయాలనే ప్రతిజ్ఞ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు, సమాజం, దేశం కోసం సేవా భావంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# రాజకీయాల్లోకి వచ్చే యువతకు కన్నా లక్ష్మీనారాయణ ఆదర్శం

## అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**గుంటూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ జీవితం ఎంతో ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కొనియాడారు. గుంటూరు లో గురువారం ఘనంగా జరిగిన ఖికన్నాఖి రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు, ఆయన 73వ జన్మదిన మహోత్సవ వేడుకలకు అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి ఎన్నికల్లో గెలిస్తే రెండోసారి గెలవడం కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో, కన్నా లక్ష్మీనారాయణ ఏకంగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసిన ఏకైక నేతగా ఘనత సాధించారని కితాబిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ కన్నా నైజమని, ఆయన నడిచిన బాట నుంచి నేటి తరం ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం




ఉందన్నారు. నాడు దివంగత ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం వల్లే నేడు ప్రజల ఎదుట ఇలా నిలబడే అవకాశం కలిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు. నేటి యువత చురుగ్గా రాజకీయాల్లోకి వచ్చి స్వచ్ఛమైన పాలన అందించాలని పిలుపునిచ్చారు. కేవలం రాజకీయనాయకుడిగానే కాకుండా కన్నా లక్ష్మీనారాయణ గొప్ప నటుడిగా, బాడీ బిల్డర్‌గా, ఎన్.సి.సి కేడెట్‌గా బహుముఖ ప్రజ్ఞను కనబరిచారని ప్రశంసించారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఇలాంటి పెద్దాయన గురించి మాట్లాడే అవకాశం రావడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణకు దేవుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు ఆకాంక్షించారు.






# జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం సంఘీభావం

**గుంటూరు మెడికల్ ,ఆగస్టు 13, (ప్రభాతవార్త )**

రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమ్మె రెండో దశలో భాగంగా జూనియర్ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుతంగా ఆందోళన కొనసాగించారు.

జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. జూనియర్ వైద్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని సంఘీభావం తెలిపారు.



ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్‌తో పాటు డాక్టర్ కట్టా శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ రమ్య, డాక్టర్ కే. మారుతీదేవి, డాక్టర్ వై. రవీంద్రకుమార్, డాక్టర్ ఎస్. అరుణాదేవి, డాక్టర్ బి. శివగోపాల్, డాక్టర్ పి. రాజా, డాక్టర్ అజయ్, డాక్టర్ పి. సుధారాణి, డాక్టర్ టి. వెంకట శివరామకృష్ణ, డాక్టర్ పి. టాబితా, డాక్టర్ మురళి తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు.

> న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
> 
> పెరుగుతున్న విద్యా, వసతి ఖర్చులకు అనుగుణంగా ఉపకార వేతనం సవరించాలి
> 
> బోధనా నియామకాల్లో అర్హత, అనుభవానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జూనియర్ వైద్యులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవని, వైద్య రంగ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న సమయంలో విద్యార్థులపై ఫీజులు, వసతి గృహ రుసుములు, అద్దెలు, పుస్తకాలు, వైద్య సదస్సులు, ఇతర విద్యా సంబంధిత ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జూనియర్ వైద్యుల ఉపకార వేతనాన్ని సకాలంలో సవరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**అర్హత కలిగిన వారికే బోధనా అవకాశాలు**

ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బంది నియామకాల విషయంలో కూడా స్పష్టమైన విధానం అవసరమని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఇలాంటి బోధనా సిబ్బంది వైద్య కళాశాలలు లేదా జాతీయ స్థాయి వైద్య సంస్థల్లో శిక్షణ పొంది, వైద్య విద్యార్థులకు బోధించడంలో తగిన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు.

వైద్య విద్య బోధనలో తగిన అనుభవం లేని వైద్యేతర సంస్థల నుంచి నియామకాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వైద్య స్నాతకోత్తర బోధనా సిబ్బంది అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే ఇటువంటి నియామకాలను పరిగణించాలని, అవి మొత్తం నియామకాల్లో పది శాతానికి మించకూడదని సూచించారు.

**యువ వైద్యుల అవకాశాలను కాపాడాలి**

నిర్దేశిత నిబంధనలకు మించి నియామకాలు చేపట్టడం, పదవీ విరమణ వయస్సును పెంచడం వల్ల యువ వైద్యులకు ఉద్యోగ, బోధనా అవకాశాలు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే సీనియర్ వైద్యుల అనుభవం, విజ్ఞానం రాష్ట్ర వైద్య రంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. 63 ఏళ్ల వయస్సులో పదవీ విరమణ అనంతరం కూడా సీనియర్ అధ్యాపకుల అనుభవాన్ని రాష్ట్రవ్యాప్తంగా సలహా సేవలు, శిక్షణ, వైద్య విద్య, ఇతర తగిన బాధ్యతల్లో వినియోగించుకోవాలని సూచించారు.

జూనియర్ వైద్యుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం తెలిపిన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. తమ సమస్యలు, భవిష్యత్తు అవకాశాల పరిరక్షణకు మద్దతుగా నిలిచిన ప్రభుత్వ వైద్యుల సంఘానికి ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరింది.

# ఎల్ఆర్ఎస్ కు అందిన దరఖాస్తులను ఈ నెల 17లోగా నూరు శాతం పరిష్కరించాలి

## కార్పొరేషన్ సిటీ ప్లానర్ డి. రాంబాబు

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 13 ( ప్రభాతవార్త ) :** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో లే అవుట్ రెగ్యులేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)కు అందిన దరఖాస్తులను ఈ నెల 17లోపు నూరు శాతం పరిష్కరించాలని సిటీ ప్లానర్ రాంబాబు స్పష్టం చేశారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు గురువారం నగర పాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్ నందు పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు తొలుత వార్డ్ సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు తమ లాగిన్ లలోని లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) అప్లికేషన్ల వివరాలు, ఇన్ ప్రిన్సిపల్ లేఔట్ ప్యాట్రన్ (ఐ.పి.ఎల్.పి) దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిటీ ప్లానర్ మాట్లాడుతూ ఈ నెల 15 లోగా ఐ.పి.ఎల్.పి , 17 లోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఎటువంటి తప్పులు లేకుండా నూరు శాతం పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో సమస్యలు సందేహాలు ఏమైనా ఉంటె అధికారులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకొని సదరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే నగరంలో ఆక్రమణల తొలగింపు పై కార్యదర్శులు, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ



వహించాలని, ఈ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రతి రోజు జరగాలన్నారు. ముఖ్యంగా ప్రజల వద్ద నుండి వచ్చే పిర్యాదుల పట్ల నిరక్ష్యం వహించవద్దని, వాటిని నిర్దేశిత సమయానికి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఏసిపిలు రెహ్మాన్, జకీరా, టిపిఎస్ లు, టిపిబిఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# చెరువుల సంరక్షణతోనే స్వచ్ఛమైన పర్యావరణం

**నరసరావుపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త : :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న "స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెరువుల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం స్థానిక వల్లపు చెరువు వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదవాడ అరవింద బాబు పాల్గొని చెరువు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సంర్భంగా ఎస్ఎస్ఎన్ కళాశాల వాలంటీర్లు వల్లపు చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే అరవిందబాబు చీపురు పట్టి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారీలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ చెరువులు, ఇతర నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెరువులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ప్రజలకు ఆరోగ్యరమైన వాతావరణాన్ని అందించవచ్చు న్నారు. ప్రజల భాగస్వామ్యంతో చెరువులను పరిశుభ్రంగా, సుక్షితంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నీటి వనరుల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని, చెరువుల పరిరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సిద్ధలింమూర్తి, ఎంపీడీవో, ఏపీ బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నాగసరపు సుబ్బరాగుప్తా, టి డి పి నాయకులు , పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నిరంతరం ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు

## -వీసి గంగాధరరావు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్13, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో విద్యార్థులకు నిరంతరం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వీసి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల గురువారం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) ఆద్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాను ప్రారంభించి వీసి మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలతో పాటు ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు మొగ్గు చూపాలన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ 50ఏళ్ల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా వచ్చెనెల మొదటి వారంలో 100కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు మాట్లాడుతూ జాబ్‌మేళాకు 212మంది హాజరుకాగా వారిలో 54మందిని షార్ట్ లిస్ట్ చేశారని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం నియామక ఉత్తర్వులు వస్తాయని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ మాట్లాడుతూ ఏఎన్‌యు టీం లీజ్, డిజి వర్సిటీ సంయుక్తంగా నిర్వహించాయన్నారు. 13 కంపెనీలు వచ్చాయని వాటిల్లో ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ హెచ్ ఆర్ శివశంకర్, ఆదిత్య టాటా క్యాపిటల్ నుంచి సాయికుమార్, కిరణ్, క్విజ్‌యాక్సిస్ బ్యాంకు నుంచి పవన్, రవికిషోర్, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ నుంచి ఎస్.పావని, స్పందన, స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి సుధీర్. షేక్ వసీం, టీం లీజ్ ఎడ్యుటెక్ నుంచి సీనియర్ మేనేజర్ వెంకట తిలక్, సువిక్షా శెట్టి, మృణాల్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.




# 3 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

**గుంటూరు క్రైమ్, ఆగస్టు13, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే లక్ష్యంతో పాత నేరస్తులపై నిరంతర నిఘా, ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఎస్పీ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారామ్ పర్యవేక్షణలో పాత గుంటూరు సిఐ వెంకట ప్రసాద్ సిబ్బందితో కలిసి గంజాయి, మాదకద్రవ్యాల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరు ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టాండ్ - విజయవాడ బస్ సెక్టార్ వద్ద పోలీసులకు అందిన సమాచారంతో ఒరిస్సా నుంచి వచ్చి గంజాయి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో బాపట్ల పెయింటర్స్ కాలనీకి చెందిన కుంచాల శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 3 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మాదకద్రవ్యమైన లిక్విడ్ గంజాయిని అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం నేరమని నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పాత గుంటూరు సి ఐ గారు మాట్లాడుతూ ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించి నిర్మూలించేందుకు టీ సీతారాం డీస్పీ పర్యవేక్షణ లో పటిష్టమైన ప్రణాళికతో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈగల్ టీమ్‌తో సమన్వయం చేసుకుంటూ గంజాయి విక్రయం, వినియోగం ,సరఫరాకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయి కేసుల్లోని పాత నేరస్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ, వారి కదలికలు, కార్యకలాపాలు, వ్యవహార శైలిని పరిశీలిస్తున్నామని, వారికి యూరిన్ డ్రగ్స్ టెస్టులు నిర్వహించడం, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించిన వెంటనే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. గంజాయి రహిత గుంటూరు కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని గుంటూరు జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# ఏఎన్‌యులో జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్13, ప్రభాతవార్త:** వర్సిటీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ గ్రంథాలయంలో గురువారం పద్మశ్రీ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ లేబ్రేరియన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వీసి ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పద్మశ్రీ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో జ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోజూ లైబ్రరీని సందర్శించే పరిశోధకులు, విద్యార్థులను గుర్తించి ముగ్గురికి బెస్ట్ రీడర్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆచార్య కె.వెంకటరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం పాలకమండలి సభ్యులు త్రిమూర్తిరావు, మురళీమోహన్, ఓఎస్‌డి రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దివ్యతేజోమూర్తి, ప్రిన్సిపాల్స్ ఆచార్య పాల్‌కుమార్, తేజోమూర్తి, విట్ ఏపి లైబ్రేరియన్ డాక్టర్ సి.హెచ్.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

14 PLD 6fffff.qxd:14 PLD 6.qxd 01/01/2001 10:13 Page 1



## ఉన్నవ గ్రామంలో ఎస్ఐఆర్‌పై గ్రామసభ

**యడ్లపాడు, అగస్టు 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉన్నవ గ్రామ స్వర్ణ కార్యాలయ అవరణలో గురువారం ఎస్ఐఆర్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి జె విజయశ్రీ మాట్లాడుతూ.. గ్రామంలోని ఆరు పోలింగ్ బూత్‌ల పరిధిలో వివిధ కారణాల వల్ల 802 మంది ఓటర్ల ఓటు హక్కు నమోదు కాలేదని తెలిపారు. ఓటు హక్కు నమోదు కాని కారణాలను వివరిస్తూ సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు అందజేశామని తెలిపారు. నోటీసుల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను గ్రామసభకు తీసుకువచ్చిన వారికి పరిశీలన అనంతరం ఓటు హక్కును పునరుద్ధరించే చర్యలు చేపడతామని ఎన్నికల అధికారి తెలిపారు. 425మంది గ్రామ సభకు విచ్చేయటం జరిగిందని, మిగిలిన వారికి మరలా రెండు ధఫాలు నోటీసులు అందజేయటం జరుగుతుందన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



## గురుకుల పాఠశాల రహదారికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడ తొలగింపు

**యడ్లపాడు, అగస్టు 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారికి అడ్డుగా వెంచర్ నిర్వాహకులు గతంలో నిర్మించిన ప్రహరీ గోడను రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం తొలగించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామని తహశీల్దార్ జె విజయశ్రీ తెలిపారు. రహదారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రహరీ గోడను తొలగించడంతో పాటు రహదారిని చదును చేసి శుభ్రం చేశారు. గతంలో రహదారి ప్రారంభ ప్రాంతములో గేటును ఏర్పాటుచేయటం దానిని అధికారులు తొలగించటం జరిగింది. విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చామని అధికారులు తెలిపారు.



## మిట్టపల్లిలో ప్రాంగణ ఎంపికలలో 79మంది ఎంపిక

**యడ్లపాడు, అగస్టు 13, ప్రభాతవార్త :** మండలం పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ఇంజనీరి ంగ్‌లో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఇఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి, ఈసిఈ విద్యార్థులకు క్యా ంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. గోపీ కృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈఎమ్ఎమ్విఇఇ యనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాలకు చెందిన 79 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి కంపెనీ తరఫున సంవత్సరానికి రూ.3 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు వేతనం అందించనున్నట్లు కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షి ంచారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎం కిషోర్ కుమార్ ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపీ కృష్ణ, ఏడి సీహెచ్ శ్రీనివాసరావు, టీపీఓ కె విజయ్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్, నోట్‌బుక్స్, స్టేషనరీ వితరణ

**అచ్చంపేట, ఆగస్టు 13 (ప్రభాత వార్త):** స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రోసూరు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్), 88 తాళ్లూరు పాఠశాలకు మైక్‌సెట్, నోట్‌బుక్స్, కాపీ బుక్స్, స్టేషనరీ సామగ్రిని గురువారం అందజేశారు. సుమారు రూ.10 వేల విలువైన మైక్‌సెట్‌తో పాటు 80 మంది విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, కాపీ బుక్స్, స్టేషనరీని మండల విద్యాశాఖాధికారి-1 శ్రీ ఘట్టమనేని కృష్ణ, విద్యాశాఖాధికారి-2 శ్రీ మాచవరపు గణేష్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పెనుమాక స్వరూప రాణికి అందజేశారు. మైక్‌సెట్ ఖర్చులో 50 శాతం మొత్తాన్ని ప్రధానోపాధ్యాయురాలు స్వరూప రాణి భరించారు. ఈ సందర్భంగా ఎమ్ఈవో ఘట్టమనేని కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీమతి యం. లక్ష్మీ, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీ వి. లక్ష్మీనారాయణ, స్నేహహస్తాలు ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీ తాయి కరిముల్లా బాబు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో అవధూత అయోధ్య స్వామి ఆరాధన మహోత్సవం

**పెదకూరపాడు ఆగస్టు 13 ప్రభాతవార్త** మండల పరిధిలోని75 తాళ్లూరు గ్రామంలో కొలువై దీరిన అవధూత అయోధ్య స్వామి 21 ఆరాధన మహోత్సవం వేదమంత్రాలు మంగళవాద్యా నడుమును భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్ర మంలో వేద పండితులు ఆదిత్య శర్మ పాల్గొని అయోధ్య స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలు విశేష పూజలు భక్తిశ్రద్ధలతో భక్తులచే కార్యక్రమం నిర్వహించారు తెల్లవారుజామున భక్తులు పుణ్య స్థానం ఆచరించి డప్పు వాద్యాలతో కోలాటంతో తాళ్లూరు పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు పాల్గొని సత్సంగం ఏర్పాటు చేశారు అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులచే భజన వలి కార్యక్రమం నిర్వహించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తాళ్లూరు జడ్పీ పాఠశాల ఎన్సిసి విద్యార్థులచే విచ్చేసిన భక్తులకు భద్రతను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూల నుండి అయోధ్య స్వామి గురుభక్తులు విరివిరిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ సాయి స్వతంత్ర భారతి సుబ్బారావు సత్యవతి వెంకయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బాల చౌడేశ్వరి దేవి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు

**రాజుపాలెం, ఆగస్టు 13 (ప్రభాత వార్త):**

రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బాల చౌడేశ్వరి దేవి అమ్మవారి పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి



ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం బాల చౌడేశ్వరి దేవి అమ్మవారి సన్నిధిలో రాజుపాలెం భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమంలో పొత్తూరి పట్టాభిరాములు, చెవుల ఆదినారాయణ, చెవుల ఆంజనేయులు, జయలక్ష్మి, శివమ్మ, పద్మావతి, పొత్తూరి శ్రీధర్‌రావు, చెవుల వెంకట మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఆలయ పూజారి జొన్నగిరి జ్వాల నరసింహారావు, కమిటీ సభ్యులు పామిశెట్టి శ్రీనివాసరావు, సుఖమంచి ఓబుల్ స్వామి, పామిశెట్టి యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు

**50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల్లో ఘనంగా కేక్ కట్ చేసిన కన్నా**

**పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే కన్నా సంపాదించుకున్న అసలైన ఆస్తి**







**సత్తెనపల్లి (ఆగస్టు 13, ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారి 73వ జన్మదినం, 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని గుంటూరు శ్రీ కన్వెన్షన్‌లో జన్మదిన వేడుకలు, రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, సత్తెనపల్లి నియోజకవర్గం నలుమూలల నుంచి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్‌ను కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజల కేరింతల మధ్య కట్ చేసి అభిమానులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానులు పెద్ద ఎత్తున టపాసులు పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**ఐదు దశాబ్దాల ప్రజాజీవితం.. యువతకు స్ఫూర్తి**

ఈ సందర్భంగా కూటమి పార్టీలకు చెందిన పలువురు నేతలు మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్య ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం సాధారణ విషయం కాదన్నారు. కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ ప్రస్థానం నేటి యువ రాజకీయ నాయకత్వానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 1973లో ఎన్ఎస్‌యూఐ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కన్నా లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా యువజన నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారని గుర్తుచేశారు. 1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు నుంచి, 200 9లో గుంటూరు వెస్ట్ నుంచి, 2024లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఆయనపై ప్రజలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమన్నారు. "నియోజకవర్గాలు మారాయి.. కాలం మారింది.. రాజకీయ పరిస్థితులు మారాయి.. కానీ కన్నాపై ప్రజల అభిమానం మాత్రం మారలేదు. అదే ఆయన నిజమైన రాజకీయ బలం" అని నేతలు పేర్కొన్నారు. మంత్రిగా పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్, గృహ నిర్మాణం, వ్యవసాయం వంటి కీలక శాఖలను నిర్వహించి తనదైన ముద్ర వేశారని తెలిపారు. 2018-2020 మధ్య రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా పార్టీకి నాయకత్వం వహించారని గుర్తుచేశారు.

**పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే ఆస్తి**

కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ జీవితం చూస్తే రాజకీయమంటే పదవి కాదని, బాధ్యత అని, అధికారం కాదని ప్రజాసేవ అని నిరూపించారని నేతలు అన్నారు. ఆయన సంపాదించుకున్న అసలైన ఆస్తి పదవులు కాదని, ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం, ప్రజలతో ఏర్పడిన ఆత్మీయ బంధమని పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణ ఆరు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం సాధారణ విషయం కాదని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన రాజకీయ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు తదితరులు కన్నా లక్ష్మీనారాయణ సేవలను కొనియాడారు. వివిధ శాఖలకు మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రజలకు విశేష సేవలందించారని, జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటులో కూడా కన్నా కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఏ బాధ్యత అప్పగించినా పూర్తయ్యే వరకు అవిశ్రాంతంగా పనిచేయడం కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేకత అని ఎంపీ పురందేశ్వరి అన్నారు.

**కన్నాను సన్మానించిన సినీ నటుడు బ్రహ్మానందం**

కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందాన్ని ఘనంగా సన్మానించారు. తన స్వంత నియోజకవర్గమైన సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గారి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని బ్రహ్మానందం తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్య నాయకులు హాజరై కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ నియోజకవర్గాలు, జిల్లాల నుంచి వచ్చిన అభిమానులు, అనుచరులతో శ్రీ కన్వెన్షన్ ప్రాంగణం సందడిగా మారింది. కన్నా లక్ష్మీనారాయణ నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవిస్తూ మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని నేతలు, కార్యకర్తలు ఆకాంక్షి ంచారు.

## కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ లావు

**రాజకీయ స్వర్ణోత్సవ వేడుకల్లో ఘనంగా సన్మానం**

**సత్తెనపల్లి (ఆగస్టు 13, ప్రభాతవార్త):** గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో గౌరవ మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి నాయకుడిగా, యువజన నేతగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి శాసనసభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా ప్రజాసేవకు ఐదు దశాబ్దాలుగా తన జీవితాన్ని అంకితం చేసిన కన్నా లక్ష్మీనారాయణకు పలువురు నేతలు రాజకీయ స్వర్ణోత్సవ, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు కన్నా లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు, రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండుగల ఎల్లమ్మ తల్లి బోనాల జాతర

**కారంపూడిఆగస్టు 13 ప్రభాతవార్త** :కారంపూడిమండలంలోని చిన్న గార్లపాడు గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల జాతర గురువారం కన్నుల పండుగలా జరిగింది. గ్రామస్తులు ఏకమై భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పించారు. మహిళలు, యువతులు బోనాలను మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుల నడుమ ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, చాటుపు దెబ్బలు, భక్తుల శివశక్తుల పూనకాలు ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలో సానుకూలంగా వర్షాలు కురిసి వంటలు సమృద్ధిగా పండి, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని గ్రామానికి ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతి యువకులు



అ ధిక సంఖ్యలో పాల్గొన టంతో గ్రామం కొలహాలంగా మారింది.

## పర్యావరణ పరిరక్షణ అవగాహన సమావేశం

***మాచర్ల టౌన్ ఆగష్టు 13 ప్రభాతవార్త:***

మాచర్ల పట్టణ ంలోని మెడికల్ క్లబ్‌లో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవ గాహన సమావేశం నిర్వహించారు. పర్యావరణ స్పెషలిస్ట్ ఆకులపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సువ ారు 80 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గుండాల సత్యనారాయణ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి మనిషి మొక్కల మాదిరిగా ఎదిగి, ఒదిగి జీవించాలని సూచించారు. ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణ మేనేజర్ కలివల ప్రభాస్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని సంరక్షించడం వల్ల మానవ జీవన నాణ్యత మెరుగుపడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు, హనుమంతరావు, డాక్టర్ చంద్రయ్య, కలివల విక్టర్ బాబు, బొనిగే అనిల్ కుమార్, కలివల సాగర్ బాబు, బొనిగే చిన్న వెంకయ్య, అనుముల శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఆకులపల్లి మహేష్, బొనిగే చిన్న యాకోబు, ఆరుముళ్ల మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.




## కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు పట్టణ నాయకులు

**సత్తెనపల్లి (ఆగస్టు 13, ప్రభాతవార్త):** గౌరవ మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి శాస నసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీ నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణ నాయకులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు మద్ది వెంకటేశ్వరరావు, జవ్వాజి రామమోహన్‌సరావు, మారెళ్ల స్వామి (హెచ్‌డీఓ మెంబర్), దేవరపల్లి కాశీ, అన్నం బాలసుబ్రహ్మణ్యం, చంద్రపాటి శ్రీను తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



# పంటల బీమా చేయించుకోవాలి

**ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలి**

**వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి**

సత్తెనపల్లి (ఆగస్టు 13, ప్రభాతవార్త): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం కింద మిరప, కంది, వరి పంటలకు బీమా పొందేందుకు రైతులు ఈ నెల 15వ తేదీలోగా తమ వాటా ప్రీమియం చెల్లించాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి తెలిపారు. మిరప పంటకు ఎకరాకు రూ.90,000 బీమా పరిహారం ఉండగా రైతు వాటాగా రూ.360, కంది పంటకు ఎకరాకు రూ.20,000 బీమాకు రూ.40, వరి పంటకు ఎకరాకు రూ.40,000 బీమాకు రూ.80 చొప్పున ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈక్రాప్ నమోదు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, సాగు చేసిన పంట ధ్రువీకరణ పత్రాలతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించి, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), మీసేవ కేంద్రాలు లేదా ఇన్సూరెన్స్ ఏజెంట్ల ద్వారా పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు కూడా పంటల బీమాకు అర్హులేనని తెలిపారు. బీమా చేయించిన పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి సూచించారు.

## వెలుగు యానిమేటర్ పై మహిళా సంఘాల ఆందోళన

**అచ్చంపేట ఆగస్ట్ 13 (ప్రభాత వార్త):** పల్నాడు జిల్లా అచ్చంపేట మండల




కేంద్రంలోని వెలుగు యానిమేటర్ సల్మా ఇంటి వద్ద మహిళా సమాఖ్య సభ్యులు ఆందోళన చేపట్టారు. మూడు మహిళా సంఘాలకు సంబంధించిన సుమారు రూ.50 లక్షల వరకు నిధులు దుర్వినియోగం అయ్యాయని సభ్యులు ఆరోపించారు. ఇందులో డ్వాక్రా నిధులతో పాటు బయట తీసుకున్న హ్యాండ్ లోన్లు కూడా ఉన్నాయని తెలిపారు. బ్యాంకుకు వెళ్లినప్పుడు రుణాలు చెల్లించలేదని అధికారులు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చిందని సభ్యులు తెలిపారు. సల్మాను ప్రశ్నించగా పదో తేదీ వరకు డబ్బులు ఇస్తానని చెప్పి, ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా గ్రూపుల నుంచి వసూలు చేసిన సుమారు రూ.30 లక్షలను సల్మా సొంత అవసరాలకు వినియోగించుకున్న విషయం వాస్తవమేనని ఏపీఎం వెంకట్ రెడ్డి తెలిపారు. మిగతా మహిళా సంఘాలు కూడా తమ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించుకుని ఏవైనా సమస్యలు ఉంటే కార్యాలయానికి తెలియజేయాలని అధికారులు సూచించారు. అక్రమాలు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తాడువాయిలో ఘనంగా ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు

**పడవలపై జాతీయ జెండాలతో దేశభక్తి చాటిన మత్స్యకారులు**

**అచ్చంపేట ఆగస్టు 13 ( ప్రభాత వార్త):** అచ ్చం పేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం ఆధ్వర్యంలో గురువారం ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా




నిర్వహించారు. కృష్ణానదిలో మత్స్యకారుల పడవలపై జాతీయ జెండాలను ఎగుర వేసి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా మత్స్యకారులు, పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## నేటి నుంచే శ్రావణ మాసం



**సత్తెనపల్లి (ఆగస్టు 13, ప్రభాతవార్త):** నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుందని పండితులు తెలిపారు. శ్రావణ మాసాన్ని భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికంగా గడపాలని సూచించారు. ఉదయాన్నే తలస్నానం చేసి ఇంటిని శుభ్రం చేసుకుని, గుమ్మాలకు పసుపు, కుంకుమ, తోరణాలు కట్టుకోవాలని పేర్కొన్నారు. పూజా మందిరాన్ని అలంకరించి గణపతి, శివుడు, లక్ష్మీదేవిని పూజించాలని సూచించారు. శివాలయాలకు వెళ్లి రుద్రాభిషేకం లేదా జలాభిషేకం నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం తులసి కోట వద్ద, దేవుడి గదిలో దీపం వెలిగించడం వల్ల ఇంట్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని వివరించారు. శ్రావణ మాసంలో మాంసాహారానికి దూరంగా ఉండి సాత్వికమైన, తేలికపాటి ఆహారం తీసుకోవాలని పండితులు సూచించారు. భక్తిశ్రద్ధలతో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## చోరీ-చిలకలూరిపేట ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో చోరీ

**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** ఇంట్లోకి చొరబడిన దుండగులు కిలో వెండి ఆభరణాలు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరఇంట్లో ఎవరూ లేని సమయంలో జరిగిన ఘటహుబ్లీ లోని వాళ్ళ కొడుకు దగ్గరకు వారం క్రితం వెళ్లిన కండక్టర్ శారదా దంపతులుచోరీ జరిగిన విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారంహుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులుఇంటిని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులురంగంలోకి దిగిన క్లూస్ టీమ్.. వేలిముద్రలు, ఇతర ఆధారాల సేకరచోరీకి పాల్పడిన దుండగుల కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరంపలు ప్రాంతాల్లో సీసీ ఫుటేజ్ ను పరిశీల చిలకలూరిపేటలో వరుస చోరీలతో స్థానికుల్లో ఆందోళన. వరుస చోరీల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు చోరీ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులుదుండగులను త్వరగా గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

## త్రివర్ణ పతాకంతో దేశభక్తిని చాటుకున్న విద్యార్థులు



**కారంపూడి ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కారంపూడి లో హార్ ఘర్ తిరంగా కార్యక్రమం అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో గురువారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో తాసిల్దార్ వెంకటేశ్వర నాయక్, ఎంపీడీవో గంట శ్రీనివాసరెడ్డి, రవికుమార్, టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ సురేష్ యాదవ్, ఎంపీపీ శ్రీనివాసరావు, పాల్గొన్నారు. పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రెయిన్బో ఇంగ్లీష్ మీడియం స్కూల్, అక్ష ఇంగ్లీష్ మీడియం స్కూల్, అమెరికన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు త్రివర్ణ పతాకాలు పట్టుకొని దేశభక్తితో నినాదాలు చేయడంతో మార్మోగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకటేశ్వరా నాయక్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని అన్నారు. చిన్న వయసు నుండే విద్యార్థుల్లో దేశభక్తి, సమైక్యత స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. స్వాతంత్ర సమరయోధుల పూర్తిని ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రతి ఇంటి పై కూడా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి ఏక్ భారత్...... శ్రేష్ట భారత్ సందేశాన్ని ప్రతి గడపకు తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలను ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిన్నంటిన హార్ ఘర్ తిరంగా సంబరాలు

### రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు

### పద్దెనిమిది వందల అడుగుల జాతీయ జెండా తో విద్యార్థుల ర్యాలీ



**విజయపురిసౌత్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** విజయపురిసౌత్:గ్రామంలో భారత జాతీయ జెండాను భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆగస్టు 13న అన్ని మండల కేంద్రాల్లో హార్ ఘర్ తిరంగా లో భాగంగా గురువారం స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర నివాస పాఠశాల (పి.టి.జి)ప్రిన్సిపాల్ పి.శామ్యూల్ జోబ్ ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని రీతిలో మునుపెన్నడూ చూడని పద్దెనిమిది వందల అడుగుల భారత దేశ జాతీయ జెండాను గ్రామంలోని ప్రధాన పురవీధుల్లో తిప్పుతూ భారత్ మాతకు జై అని నినాదాలు ఇస్తూ స్థానిక అంబేద్కర్ కూడలి చేరుకొని మువ్వెన్నెల జెండాను ఆంధ్రప్రదేశ్ ఆకృతి వచ్చేలా చేర్చి ఔరా అని పించారు విద్యార్థులు. వారికి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు మరియు కేంద్ర భద్రత బలగాల ఇన్స్పెక్టర్ జయచంద్ర నాయుడు మరియు సిబ్బంది కూడా భాగస్వామ్యం అయి జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు ఇస్తూ పురవీధుల్లో జాతీయ నినాదాలతో హోరెత్తించి చూపరులను కట్టిపడేసేరు. పద్దెనిమిది వందల అడుగుల జాతీయ జెండాను చూస్తూ ఆనందం వ్యక్తం చేసేరు గ్రామస్తులు. అనంతరం పి.టి.జీ. ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాజం కోసం తన వంతు భాద్యత నిర్వర్తిస్తే సరి హద్దులోని సైనికుడి తో సమానం అని ప్రతి భారతీయుడిని తమ ఇళ్లలోకి తిరంగను తీసుకువచ్చి, మన దేశ స్వాతంత్ర్య వేడుకలలో గర్వంగా ఎగురవేయలని. భారత జాతీయ జెండా కేవలం ఒక చిహ్నం మాత్రమే కాదని, మన సమిష్టి గర్వం మరియు ఐక్యతకు లోతైన ప్రాతినిధ్యం అని అన్నారు. ఎ.పి.అర్.డి.సి. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఖిహర్ ఘర్ తిరంగా కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు ప్రజలకు తెలియజేస్తూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ రోజు అందరం స్వేచ్ఛ గా ఉంటున్నామని వారి యొక్క త్యాగాలు వెల కట్టలేనివాని నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గ్రామంలో భారత జాతీయ జెండా ను ఇంత భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబ్ కు గ్రామస్తులు, కళాశాల సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముందుగా స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు జాతీయ నాయకుల ఫోటోలకు పులాదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, సురేంద్ర, డిప్యూటీ వార్డన్, శాంతి రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్స్ టీచర్స్ ,వై.రవి, డేనియల్ మరియు కళశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సి.ఆర్.పి.ఎఫ్. సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు, యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్స్యకార సాధికారితే కూటమి ప్రభుత్వ ధ్యేయం..!

### యువ నాయకులు గౌతమ్ జూలకంటి..!



**దుర్గి, ఆగస్ట్13, ప్రభాతవార్త** మత్స్యకార సాధికారితే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని టిడిపి యువ నాయకులు గౌతమ్ జూలకంటి ఉద్ఘాటించ్చారు. గురువారం మండల పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన హర్ ఘర్ తిరంగ్ ర్యాలీలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. స్థానిక మత్స్యకారులతో కలిసి జాతీయ జెండాను చేతబూని తీరంలో పడవల్లో తిరంగ్ ర్యాలీ చేపట్టారు. విజన్ 2047 లో భాగంగా వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా గౌతమ్ కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడి ప్రసాద్, ఎంపీడీఓ ప్రసాదరావు, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, ఎంపీపీ యోచురి సాయి శంకర్, గోగుల వెంకట్రామిరెడ్డి యాగంటి నరేష్, కందుల విజయ్, మాచర్ల మాధార్, ఏసోబు, మహేష్, మందా రాంబాబు, ముత్తినేని పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన సందర్భంగా

## అనాథాశ్రమంలో అన్నదానం



**రాజుపాలెం, ఆగస్టు 13 (ప్రభాతవార్త):** సత్తెనపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజుపాలెం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అంచుల నరసరావు ఆర్థిక సహకారంతో అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వద్ద మంత్రికి సంబంధించిన వ్యక్తిగత బ్యాగ్ తీసుకువచ్చిన ఘటనపై కూడా చర్చ జరిగింది. రాజుపాలెం మండలం కొండమూడి పరిధిలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో గురువారం సాయంత్రం ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరసరావు స్వయంగా పాల్గొని ఆశ్రమంలోని చిన్నారులు, వృద్ధులకు భోజనం వడ్డించారు. అదేవిధంగా నెమలిపురి గ్రామానికి చెందిన శనగపూల వెంకయ్య ఆర్థిక సహకారంతో గురువారం ఉదయం ఆశ్రమంలోని చిన్నారులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అంకాల ప్రభుదాస్, వర్ల శ్రీనివాసరావు, కోట జోసెఫ్, సింకా ఆంజనేయులు, దీపంగి మంగయ్య, ఎస్కే సైదులు, సైదులు వెంకటేష్, తాటికొండ వెంకట్రావు, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకర్రావు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సాధించే మంచి విజయమే..శ్రేణుల పనితీరుకు కొలమానం..

### ప్రత్తిపాటి..



**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** ప్రజాసేవే ప్రజా ప్రతినిధుల ప్రధాన కర్తవ్యమని, ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెంచడంతో పాటు.. ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పార్టీకి లభించే అపూర్వ విజయమే.. టీడీపీ శ్రేణుల పనితీరుకు కొలమానమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన పట్టణ మరియు నాదెండ్ల మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో కీలకోపన్యాసం చేశారు. తొలుత స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన పట్టణ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడిన ప్రత్తిపాటి. అనంతరం సంకురాత్రిపాడులో జరిగిన నాదెండ్ల మండల స్థాయి టీడీపీ సమావేశంలో ప్రసంగించారు. పట్టణంలో పార్టీ విజయావకాశాలు మెరుగుపడాలి.. చిలకలూరిపేట పట్టణ పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువ అవడంలో వెనుకబడుతున్నారని, గతంలో, ఈ రెండేళ్లలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి చేసినా పార్టీ శ్రేణుల అనైక్యత, వ్యక్తిగత భేషజాల వల్ల ప్రజల ఆదరణ పొందలేకపోతున్నామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణంపై పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జులు, కే.ఎస్.ఎస్ లు సమన్వయంతో పనిచేసి, పార్టీ విజయావకాశాలు మెరుగుపరచాలని, ప్రజల్లో మంచి పట్టు సాధించాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనాలని, మొక్కుబడిగా పనిచేసేవారి విషయంలో కఠినంగానే వ్యవహరిస్తామని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. తమకు అప్పగించిన బాధ్యతల నిర్వహణలో పార్టీ శ్రేణులు ఎవరికి వారు పోటీపడి మెరుగైన పనితీరు కనబరిచి, పార్టీ అధిష్టానం దృష్టిలో పడాలని ప్రత్తిపాటి సూచించారు. నాదెండ్ల మండల పార్టీ శ్రేణుల పనితీరు ఇంకా మెరుగుపడాలని, మండల..గ్రామస్థాయి నాయకులు పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి సమన్వయం, కసితో పనిచేయాలన్నారు. త్వరలో జరిగే పంచాయతీ, ఎంపీపీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, అప్పుడే కేడర్ పనితీరుకు నిజమైన గుర్తింపు లభిస్తుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. నియోజకవర్గ శ్రేణుల పనితీరుకు ప్రత్యేక గుర్తింపు..చిలకలూరిపేట టీడీపీ శ్రేణులకు అధిష్టానం దృష్టిలో ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రభుత్వ.. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తారనే అభిప్రాయం ఉందని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్ని స్వల్ప వ్యవధిలోనూ అధిష్టానం ఊహించిన దానికంటే మిన్నగా ఎన్నోసార్లు విజయవంతం చేశామన్నారు. పట్టణ, నాదెండ్ల మండల పార్టీ సమావేశాల్లో పార్టీ కార్యక్రమాల అమల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ప్రత్తిపాటి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, షేక్ మస్తాన్ వలి, మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, జయప్రసాద్, సౌరెడ్డి, అమరా రమాదేవి, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు ప్రమాదబీమా చెక్కులు అందచేసిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి అండగా నిలిచారు. బుధవారం ఆయన పార్టీ అధిష్టానం మంజూరు చేసిన రూ.5 లక్షల ప్రమాద బీమా నగదు చెక్కుల్ని మృతుల భార్యలకు అందచేశారు. ప్రమాదంలో మరణించిన చిలకలూరిపేట మండలం, కావూరి గ్రామానికి చెందిన పెదవల్లి నాగేశ్వరరావు, యడ్లపాడుకు చెందిన పాలపర్తి రాంబాబుల కుటుంబసభ్యుల్ని పరామర్శించిన ప్రత్తిపాటి... పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. నాగేశ్వరరావు సతీమణి శ్రీమతి శైలజ, రాంబాబు సతీమణి శ్రీమతి కోటేశ్వరమ్మలకు ధైర్యం చెప్పిన ప్రత్తిపాటి, ప్రమాదబీమా నగదు చెక్కుల్ని వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య , వెంకట రత్తయ్య, కోడె హనుమంతరావు , చంద్ర, మలెంపాటి రామారావు, మద్దాలి వెంకట ప్రసాద్, హరిప్రసాద్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాట తప్పని నాయకుడు కన్నా : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** 5 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితం లో మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణతో తనకు ప్రత్యేక అనుబంధముందని, మాట తప్పని నాయకుడిగా ఆయన రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. గురువారం గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ లో సత్తెనపల్లి శాసనసభ్యులు, మాజీమంత్రి వర్యులు కన్నా లక్ష్మీనారాయణ పుట్టిన రోజు మరియు రాజకీయ స్వర్ణోత్సవ వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యే లతో కలిసి ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత కన్నాకు ప్రత్యేక అభినందనలు తెలియచేసిన ప్రత్తిపాటి.. ఆయన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం వేడుకలకు హాజరైన కన్నా అభిమానులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి ప్రసంగించారు. మోసపూరిత రాజకీయాలు కన్నాకు తెలియదు..కళాశాల రోజుల నుంచే కన్నా లక్ష్మీనారాయణతో తనకు మంచి స్నేహసంబంధాలున్నాయని, రాజకీయాల్లోకి అడుగుపెట్టాక అనేక పదవులు చేపట్టిన కన్నా, ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారన్నారు. 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కువ కాలం ఆయన ప్రజలకోసమే పనిచేశారని, ఇది సామాన్య విషయం కాదని, ఆయనకున్న ప్రజాభిమానం మరే నాయకుడికి లేదని ప్రత్తిపాటి ప్రశంసించారు. తన తండ్రిగారైన కన్నా రంగయ్య పేరుతో ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన కన్నా... సేవా కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కన్నా వంటి నాయకుడు మరొకరు లేరని, మోసపూరిత రాజకీయాలు చేయడం ఆయనకు తెలియదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటివరకు తాను చేపట్టిన పదవులకు వన్నె తీసుకొచ్చిన కన్నా, భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులతో ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. కాంగ్రెస్ లో ఉన్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థిగా రేసులో నిలిచిన కన్నా.. సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన

**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:**



చిలకలూరిపేట : స్థానిక ఏ.ఎం.జి. ఇంటర్నేషనల్ కాలేజీ విద్యార్థినులకు మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాలు, వేధింపులు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై చిలకలూరిపేట అర్బన్ పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అర్బన్ సీఐ పి. రమేష్ పర్యవేక్షణలో నిర్వహించగా, చిలకలూరిపేట టౌన్ ఎస్ఐ హజరత్తయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మహిళల భద్రత, సైబర్ మోసాలు, డ్రగ్స్ కు దూరంగా ఉండటంపై విద్యార్థులకు పలు సూచనలు అందించారు.

## ఏఎంజి డైరెక్టర్ అరుణ కుమార్ మహంతికి ఘన సత్కారం



**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** ఏ ఎం జి సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమార్ మహంతి నీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారు బుధవారం ఘనంగా సత్కారం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల్లో భాగంగా విశ్వవిద్యాలయానికి మౌలిక వసతులు కల్పించడంతోపాటు పలు సేవా కార్యక్రమాలకు దాతృత్వంతో ముందుకు వచ్చిన డైరెక్టర్ మహంతిని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ గంగాధర్ రావు ఘనంగా సత్కరించి మెమొంటోను అందజేశారు గతంలో ఏఎంజి సంస్థ విశ్వవిద్యాలయంలో ఆడిటోరియం నిర్మాణంతోపాటు ఆడిటోరియంలో వసతుల కల్పనకు రెండు కోట్ల 50 లక్షల రూపాయల విరాళం అందజేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వి సుబ్రహ్మణ్యం తదితరుల సమక్షంలో ఆయన ను సత్కరించారు

## ప్రజల భాగస్వామ్యం.. మద్ధతుతోనే మెరుగైన సంక్షేమం.. సుస్థిర అభివృద్ధి : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, ఆగస్టు13, ప్రభాతవార్త:** "ప్రజల భాగస్వామ్యం, మద్ధతుతో సుస్థిర అభివృద్ధి, మెరుగైన సంక్షేమం.. పారదర్శక పాలన సాధ్యమవుతాయి అనేందుకు కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన. సాధించిన విజయాలే నిదర్శనమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పట్టణంలోని 37వ వార్డులో పార్టీ శ్రేణులు నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రూ.21.35 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండకూడదు.. వారి ఆనందానికి లోటు రాకూడదన్న సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కుటుంబానికి, చిన్న చిన్న సంతోషాలకు దూరంగా నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తూ.. రాష్ట్రాభివృద్ధే శ్వాసగా చంద్రబాబు పనిచేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ లు తమకోసం పడుతున్న కష్టాన్ని ప్రజలు గుర్తించాలని, వారి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. పట్టణాభివృద్ధిలో రాజీలేదని, ప్రజల కోరిక మేరకు వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, పాములపాటి శివకుమారి, తుబాటి శ్రీహరి, విజయ, తొండేపి హరిబాబు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ప్రచారం

## కూటమికెంతో కీలకం..!

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి..!



**కారంపూడి ఆగస్టు 13, ప్రభాతవార్త::** ఇంటింటికీ తెలుగుదేశం ప్రచారం కూటమి పార్టీలకు ఎంతో కీలకమని, అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిధి గృహం నందు స్థానిక కూటమి పార్టీల శ్రేణులను సమావేశపరిచి, ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమంపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో ఇప్పటి వరకు జరిగిన ప్రచారం శైలిని అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో ప్రచార కార్యక్రమాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అందిస్తున్న సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్లి తెలియచెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పంగుల వారి అంజయ్య, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, మునుగోటి సత్యం, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, శేషగిరి రావు, కొదాటి ప్రభాకర్, పంగులూరి లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చౌడేశ్వరి అమ్మవారి

## జయంతి సందర్భంగా

## ఆయుష్ వైద్య శిబిరం

**రాజుపాలెం, ఆగస్టు 13 (ప్రభాత వార్త):** పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోట నెమలిపురి గ్రామంలోని శ్రీ లక్ష్మీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పూజారి గోవిందాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలతో పాటు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పూర్ణ చంద్రరావు, రమణ తదితరులు పాల్గొన్నారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఋతుచర్య, దినచర్యల ప్రాముఖ్యతపై భక్తులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక వ్యాధులు, తక్షణ వ్యాధులు, సీజనల్ వ్యాధులకు ఆయుష్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, పూర్ణ, వెంకట రమణ, సాంబశివరావు, జయలక్ష్మి పాల్గొని భక్తులకు ఆయుష్ మందులను పంపిణీ చేశారు. అలాగే నాగేంద్రమ్మ, వెంకాయమ్మ, ఏడుకొండలు, సత్యనారాయణ, కొండారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, పల్లా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి తదితరులతో పాటు ఆయుష్ సిబ్బంది, కాంపౌండర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా,వినియోగంపై ఉక్కుపాదం

**-అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్**

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** గంజాయి, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా-వినియోగంపై ఉక్కుపాదం మోతున్నట్లు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్ హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సిఐ చెప్పారు. అర్బన్‌స్టేషన్ ,ఇతర స్టేషన్ల పరిధిలో గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న యదాల రాజ్‌కుమార్‌ను పిట్-ఎన్‌డిపిఎస్ యాక్టు కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. పొన్నూరు పట్టణం, ఇతర స్టేషన్ల పరిధిలో నమోదైన పలు గంజాయి కేసుల్లో ముద్దాయిగా ఉన్న యదాల రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించి నిర్బంధించడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలకు పాల్పడుతూ పదే పదే నేర కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొంటున్నట్లు హెచ్చరించారు.



# మాల యువ చైతన్య సదస్సును జయప్రదం చేయండి

**-పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎద్దు రత్నరాజు**

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** పట్టణంలోని పాత పొన్నూరులోని అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4గంటలకు జరిగే మాల యువ చైతన్య సదస్సును జయప్రదం చేయాలని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎద్దు రత్నరాజు పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఐలాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎద్దు రత్నరాజు మాట్లాడుతూ మాల విద్యార్థులు, మేధావులు, సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాల మహాసభ, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, జైభీమ్ సమూహం, మాల యువ సేన, మాల మహానాడు సహకారంతో చైతన్య సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం దేశంలో అంటరాని జాతులకు చట్టసభల్లో దళితులకు ఒక రిప్రజెంటేషన్ ఉండాలని, బ్రిటీష్ ప్రభుత్వంతో కొట్లాడి 1932 ఆగస్టు 16న కమ్యూనల్ అవార్డు సాధించడం జరిగిందన్నారు. దీని ముఖ్య ఉద్దేశం దళిత నాయకుల్ని ఎన్నుకొని చట్టసభలకు పంపించే విధానం. అయితే గాంధీ ఆమరణ నిరాహారదీక్ష చేసి కమ్యూనల్ అవార్డును లేకుండా చేయడం జరిగిందన్నారు. దానికి ప్రత్యామ్నాయమే ఈ పొలిటికల్ రిజర్వేషన్. రిజర్వేషన్ ద్వారా ఎన్నికైన 29మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరు దళితులకు అన్యాయం జరుగుతున్నా నోరు ఎత్తి మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. ఇంకా అనేక సమస్యలపై చర్చించేందుకు ఈ సదస్సు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మామిడిసునీల్, చల్లపల్లి ఆనంద్, బొనిగల రాజారావు, యడ్లవందనం, తమనం ప్రశాంత్, చింతల అనీల్, మామిడి మనోజ్ పాల్గొన్నారు.



# పలు ప్రాంత వరి పొలాల్లో పర్యటించిన శాస్త్రవేత్తలు

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం లాం ఫామ్ శాస్త్రవేత్తలు పర్యటించారు. మండల పరిధిలోని ఆరెమండ, కట్టెంపూడి, సితారామపురం గ్రామాల్లో పర్యటించి వరి వెదసాగు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలుపు విభాగం సీనియర్ శాస్త్రవేత్త ఎస్.ప్రతిభాశ్రీ మాట్లాడుతూ వరి పంట తొలిదశలో బెట్టను తట్టుకోవడానికి ఒకశాతం 13-0-45ను వారం నుంచి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. తొలిదశలో చేట్టాల్సిన కలుపు యాజమాన్యం గురించి వివరించారు. తేమ ఉన్నప్పుడు కలుపు మందులు పిచికారి చేయాలని, మందులపై ఆధారపడకుండా అంతరకృషి చేపట్టడం ద్వారా కలుపును నివారించుకోవాలన్నారు. బెట్ట పరిస్థితుల్లో వరిలో ఇనుపధాతు లోపం తలెత్తవచ్చని, దీని నివారణకు ఎకరానికి ఒక కిలో అన్నబేది, 200గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని చెప్పారు. డాక్టర్ ఎస్‌వివిఎస్ గోపాలస్వామి మాట్లాడుతూ బెట్టలో ఎక్కువగా ఆశించే రసం పీల్చే పురుగులైన తామరపురుగులు, ఆకునల్లి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన విఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.




# బోడి సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటు

**-టిడిపి రైతు విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి బొర్రు రామారావు**


**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** టిడిపి సీనియర్ నాయకుడు బోడి సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. మండల పరిధి వల్లభరావుపాలెం గ్రామానికి చెందిన బోడి సుబ్బారావు అకాల మరణం పట్ల ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బోడి సుబ్బారావు స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి హయాం నుంచి టిడిపి నాయకుడుగా కొనసాగుతున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నాయకత్వంలో కొనసాగుతున్నారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేసే నాయకుల్లో సుబ్బారావు కూడా ఒకరని బొర్రు రామారావు చెప్పారు. సుబ్బారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో గణిపిశెట్టి రామకృష్ణ, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, చలమశెట్టి సీతారామయ్య, సముద్రాల ఆశీర్వాదం, మున్నింగి సుబ్బారెడ్డి, గరిగంటి సాయిబాబు తదితరులున్నారు.



# వైద్యశాలకు దాతల సహకారం అవసరమే

**-ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్**

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యశాలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా అవసరమేనని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. వైద్యశాలలో రక్త పరీక్షలకు ఉపయోగించే డిల్యూట్ సొల్యూషన్ కొరత గుర్తించిన మానవత శాఖ సభ్యులు 20లీటర్ల క్యాన్‌ను వైద్యశాలకు అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఫిరోజ్‌ఖాన్ మానవత శాఖ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మజీదాబేగం, లాయబ్ టెక్నీషియన్లు, మానవత సంస్థ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు లియాఖత్, కోశాధికారి ఎన్‌వి రమణ,కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక

**-అధ్యక్షుడిగా ఎం.వేణు**

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పొన్నూరు తాలూకా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. స్థానికంగా జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.వేణు, కార్యదర్శిగా వీరాస్వామి, కోశాధికారిగా షేక్ మీరాబి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, నాగేశ్వరరావు, ఎన్నికల అధికారిగా లక్ష్మీనారాయణ, పరిశీలకులుగా రత్తయ్య, ఈశ్వర్ ప్రసద్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా పోతురాజు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ఉద్యోగులు అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, అసోసియేషన్ ఉన్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.



# జ్ఞానజ్యోతి శిక్షణ ఎంతో ఉపయోగం

**నిజాంపట్నం, ఆగస్టు 13, ప్రభాతవార్త:** జ్ఞాన జ్యోతి శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిఇఒ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ముత్తుపల్లి జడ్‌పి ఉన్నతపాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు శిక్షణ పునాది వంటిదన్నారు. పునాది గట్టిగా ఉంటే భవిష్యత్ బాగుంటుందన్నారు.

పిపి1, పిపి2 పిల్లల బోధనా పద్ధతులపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్వరూపరాణి, మంజుల, వెంకటరత్నం, ఉపాధ్యాయుడు తులసీదాస్, గణేష్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**రేపల్లె, ఆగస్టు 14, ప్రభాతవార్త:** పట్టణంలోని 132/33 కెవిఎస్ఎస్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రేపల్లె పట్టణం,రేపల్లె రూరల్,భట్టి ప్రోలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్ బాబు గురువారం తెలిపారు.విద్యుత్ సరఫరా అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# భార్యపై భర్త దాడి

**రేపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండలంలోని మైనేనివారిపాలెంలో భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భార్య తీవ్రంగా గాయపడింది.గురువారం పదునైన ఆయుధంతో భార్య మోర్ల ఉషారాణిపై భర్త నాంచారయ్య దాడిచేశాడు.తీవ్రగాయాలపాలైన మోర్ల ఉషారాణిని వైద్య చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.తల,గొంతు,చేతుల భాగాలలో గాయాలయ్యాయి.ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.రేపల్లె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# మండలంలో లాం ఫామ్ శాస్త్రవేత్తలు పర్యటన

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు13, ప్రభాతవార్త :** మండలంలోని కొర్నెపాడు, యామర్రు, సొపాడు గ్రామాలలోని వ్యవసాయ భూముల్లో ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏరువాక కేంద్రం లాంపాం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.మనోజ్ తన సిబ్బందితో కలిసి




గురువారం పర్యటించారు. ఎల్నీనో ప్రభావంతో పై గ్రామలలో పర్యటించి పంటల వారీగా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డా.ఎ.మనోజ్ మాట్లాడుతూ..పంట తొలిదశలో బెట్టను తట్టుకోవడానికి ఒక శాతం 13045ను వారం నుంచి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. తేమ ఉన్నప్పుడు కలుపు మందులు పిచికారి చేయాలని మరియు మందులుపై ఆధారపడకుండా అంతరకృషి చేపట్టడం ద్వారా కలుపును నివారించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా నాలుగు వరసలకి ఒక నాగటి సాలును వర్షపు నీటి నిలుపుదలకు వేయాలని, రసం పీల్చే పచ్చదోమ, తెల్లదోమ తామర పురుగుల నివారణ తొలిదశ నుంచి చేపట్టాలని వివరించారు. లింగాకర్షక బుట్టలు తప్పనిసరిగా పెట్టుకుని గులాబి రంగు పురుగును నివారించాలని తెలియజేశారు. ఎల్నినో సమయంలో వరి పండించే ప్రాంతాలలో తక్కువ నీటి అవసరత గల పంటలైన రాగి, వరిగ, అండుకొర్ర, జొన్న పంటలను పండించాలని వెల్లడించారు. ప్రత్తి, మిరప వేసే చోట్ల కంది, పెసర, మినుము పంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఒక్క రసాయనిక ఎరువులనే కాకుండా జీవన ఎరువులైన అజోస్పిరిల్లం, పి.ఎస్.బి, కే.ఆర్.బి, వేమ్, ట్రైకోడర్మ వంటివి ఉపయోగించి నేల సారాన్ని కాపాడుకోవాలన్నారు. వాట్సాప్, ఫోన్ కాల్స్ ద్వారా శాస్త్రవేత్తల నుంచి సలహాలు తీసుకొని వాటి ఆధారంగా మారుతున్న పరిస్థితులను గుర్తించి ఖర్చు తగ్గించుకునే వ్యవసాయాన్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విఏఏలు, గ్రామ రైతులు, పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని రూపొందించిన మున్నంగి విద్యార్థులు

**కొల్లిపర, ఆగస్టు 13, ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు జాతీయ భావాన్ని ఇనుమడింపజేశారు.స్వాతంత్ర్య పోరాటంలో అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకాన్ని కొల్లిపర మండలం మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులు తమకు చేతనైన రీతిలో వివిధ వస్తువులతో రూపొందించారు.తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పలువురు ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థులు అయ్యంకి ప్రజ్వల్,అయ్యంకి రమ్యశ్రీలు బియ్యంతో జాతీయ జెండాను రూపొందించారు.కందిపప్పుతో వేమూరి అఖిల జాతీయ జెండా తయారు చేసింది.కలకోటి క్లౌదియా,కనపాల జయసూర్య సాత్విక్,కనపాల వరుణ్‌లు కాగితంతో తక్కువ ఖర్చుతో తయారు చేసి తమలోని సృజనాత్మకతను చాటారు. జాతీయ భావాన్ని పెంపొందించారు.విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి గురువారం అభినందించారు.



# అంకిత భావంతో విధులు నిర్వహించాలి

**కొల్లిపర, ఆగస్టు 13, ప్రభాతవార్త:** సచివాలయం సిబ్బంది అంకితభావంతో విధులను నిర్వహించాలని డిఎల్‌డివో హనుమంతరావు చెప్పారు.గురువారం మండలంలోని అత్తోట సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు,సూచనలిచ్చారు.హనుమంతరావు మాట్లాడుతూ సచివాలయంలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు.పేద ప్రజలకు న్యాయం చేయని సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.అనంతరం పారిశుధ్యపనులను పరిశీలించి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో భార్గవ్,పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కూలీలకు 125 రోజులు పని కల్పిస్తాం

**కొల్లిపర, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వ్యవసాయ కూలీల ఉపాధి కోసం 125 రోజుల పాటు పనులు కల్పిస్తామని ఎపిడి శివన్నారాయణ చెప్పారు.గురువారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు,వీబీ జీరామ్‌జీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.వీబీ జీరామ్‌జీ పథకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు,సూచనలిచ్చారు.ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ గ్రామాలలో తప్పనిసరిగా కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు.రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు 6 వేల మొక్కలను అందుబాటులో ఉంచామని చెప్పారు.ఈ మొక్కలను కూలీలతో నాటించాలన్నారు.పండ్ల తోటలు సాగుచేసే రైతులకు 100 శాతం సబ్సిడీ సదుపాయం కల్పిస్తామని చెప్పారు.వీబీ జీరామ్‌జీ సిబ్బంది పండ్ల తోటలకు మంజూరు చేసే సబ్సిడీ గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో ఎపివో వెంకయ్య,టెక్నికల్ అసిస్టెంట్ మాధురి,బీఎఫ్‌టీ విజయ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 13(ప్రభాతవార్త): విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న కొమ్మలు తొలపింపు మరియు లైన్ల మరమ్మత్తులు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు మారీస్పేట,మఠం బజార్, ఎరువుల కొట్టు బజార్ మరియు ఖాన్ స్ట్రీట్ లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని,కావున వినియోగదారులు గమనించి డిపార్టుమెంటు వారికి సహకరించగలరని మనవి చేస్తున్నామని,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు పాల్గొనాలి : కలెక్టర్ వినోద్‌కుమార్

**రేపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మంగా జరిగే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కోరారు.గురువారం రేపల్లె పురపాలక సంఘం పరిధిలోని హైవే 'వై'జంక్షన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.చంద్రమౌళి



ఉద్యానవనం ఎదుట నిజాంపట్నం రోడ్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అధికారులు,ప్రజా ప్రతినిధులు,300 మంది విద్యార్థులు దేశభక్తిని చాటుతూ 3 కి.మీ దూరం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఉత్సాహంతో పాల్గొనటం విశేషమన్నారు.రేపల్లె పట్టణ సుందరీకరణ,మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఫుట్‌పాత్‌ల విస్తరణ,ప్రధాన కూడళ్ళ అభివృద్ధి,ఐ లవ్ రేపల్లె వంటి ఆకర్షణీయమైన ఏర్పాట్లు ప్రజలకు ప్రయోజనం కలిగించేలా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన వివరించారు.అగస్టు 15వ తేదీ జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రజలు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళు,కార్యాలయాలు,వాణిజ్య దుకాణాల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్ఫీ తీసుకుని ఎపి అఫీషియల్ న్యూస్ హ్యాష్ ట్యాగ్‌తో సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాలని ఆయన సూచించారు.అలాగే ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద, వ్యాపార సంస్థ ఎదుట మొక్కను నాటాలని చెప్పారు.పచ్చదనంతో పర్యావరణను చ్చున్నారు.2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా ప్రజలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సాంఘిక,బిసి సంక్షేమ శాఖల డిప్యూటీ డైరెక్టర్లు సత్యనారాయణ,శివలీల,రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు,రేపల్లె ఎమ్మార్వో మోర్ల శ్రీనివాసరావు,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అనగాని శివప్రసాద్,గూడవల్లి బాబూరావు,జమీర్, వేమూరి అజయ్,బిజెపి నాయకుడు పిన్ని సాంబశివరావు,తెదేపా నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు,ప్రభుత్వ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

**రేపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:** గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు.గురువారం మండలంలోని పేటేరు పంచాయతీలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం కెనాల్ లైన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా కొబ్బరి మొక్కలను నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,డ్వామా పిడి ఎ.వి.విజయలక్ష్మి,డిఎల్‌డిఓ పద్మావతి,రేపల్లె తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు,ప్రభుత్వ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# డాక్టరేట్ పొందిన కిట్స్ అధ్యాపకురాలు పెనుమాక

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఈసీఈ) విభాగానికి చెందిన పద్మజ ప్రియదర్శిని పెనుమాక 5జీ కమ్యూనికేషన్స్ కోసం సూక్ష్మీకృత యాంటెన్నా వ్యవస్థల రూపకల్పన మరియు అమలుఖి అనే అంశంపై చేసిన పరిశోధనకు వివిఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, అమరావతి, ఆంధ్రప్రదేశ్ నుండి డాక్టరేట్‌ను పొందారని కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..డాక్టర్ చందు డిఎస్ పర్యవేక్షణలో పద్మజ ప్రియదర్శిని పెనుమాక చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడం తమకెంతో గర్వంగా ఉందని తెలిపారు. మా కళాశాలకు చెందిన పద్మజ ప్రియదర్శిని సూక్ష్మీకృత యాంటెన్నా వ్యవస్థల రూపకల్పన మరియు అమలు అంశంపై నిర్వహించిన పరిశోధనకు గుర్తింపు లభించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన డా. పద్మజ ప్రియదర్శిని ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరెన్నో పరిశోధనలు చేపట్టి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. తమ కళాశాలలో అధ్యాపకులను వివిధ పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. డాక్టరేట్ పొందిన ఆధ్యాపకురాలిని కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె. హరిబాబు, విభాగాధిపతి డా. ఎన్.ఆదినారాయణ అభినందిస్తూ ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.



# చర్మకారుల సంక్షేమ హామీలను నెరవేర్చాలి

**-చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు**

**కొల్లిపర, ఆగస్టు 13, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం చర్మకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు.గురువారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చర్మకార సంఘం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన చర్మకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.పిఎం విశ్వకర్మ ట్రైనింగ్ చేసిన వారిలో కొందరికి మాత్రమే కిట్స్ ఇవ్వడం శోచనీయమన్నారు.మిగిలిన వారికి కూడా కిట్స్ పంపిణీ చేయాలన్నారు.చర్మకార సేవా సంఘం మండల అధ్యక్షుడు పందిపాటి అశోక్ మాట్లాడుతూ చర్మకారులకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందజేసి ఆదుకోవాలని కోరారు.నివేశనస్థలాలు మంజూరు చేసి గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చర్మకార సేవా సంఘం ఉపాధ్యక్షుడు సిద్దెల కోటేశ్వరరావు,కార్యదర్శి పందిపాటి ఏసురత్నం,సేవా సంఘం నాయకులు గురువిందపల్లి సోమయ్య,వల్లభాపురం మోహన్,గురువిందపల్లి లక్ష్మయ్య,మున్నంగి సుబ్బారావు, నల్లవరపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




# పాత మున్సిపల్ భవనం కూల్చివేతకు బహిరంగవేలం


**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 13(ప్రభాతవార్త):** తెనాలి పురపాలక సంఘ పాత మున్సిపల్ భవనాన్ని కూల్చివేయుటకు మరియు కూల్చివేత అనంతరం లభించే ఇనుము, స్టీల్, కలప, తలుపులు, కిటికీలు, ఇటుకలు డెబ్రిస్ మొదలగు వంటివి బహిరంగ వేలం ద్వారా విక్రయించుటకు సీల్డ్ కవర్ టెండర్ కం బహిరంగ వేలము 14వ తేదీ శుక్రవారం,ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని,ఇందుకు సంబంధించి అర్హులైన కాంట్రాక్టర్లు, సంస్థలు మరియు ఆసక్తి కలిగిన వారు పాటలో పాల్గొన వచ్చునని,ఇతర సమాచారము నిమిత్తము తెనాలి పురపాలక సంఘ రెవిన్యూ విభాగము నందు సంప్రదించవలెనని మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



14-8Pg5_14-8Pg5.qxd 13/Aug/26 11:13 PM Page 1



# 'వందేమాతరం' ఆలాపనతో పార్లమెంటు ఉభయసభలు నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ప్రతిపక్షాల తీవ్ర నిరసనలు, ఆందోళనల నడుమ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం వందేమాతర గీతాలాపన అనంతరం లోక్‌సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు. చివరి రోజు సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు. దాదాపు 18 నుంచి 19 రోజుల పాటు సాగిన ఈ సమావేశాలు ఎలాంటి అర్థవంతమైన చర్చలు లేకుండా, ప్రతిరోజూ వాయిదాలకే పరిమితం కావడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు. వందేమాతరం ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది. వందేమాతరానికి చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వర్షాకాల సమావేశాల్లో సభ లోపల, వెలుపల అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో నిరసనలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్షాల తీరుపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన 30 యేళ్ల పార్లమెంటరీ జీవితంలో ఇంత బాధ్యతా రాహిత్యమైన ప్రతిపక్షాన్ని ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు దేశంలోని తీవ్రమైన సమస్యలపై చర్చించకుండా ప్లకార్డులతో నినాదాలు చేస్తూ పారిపోతున్నాయని ఆరోపించారు. నీట్ పరీక్షలు, విద్యార్థుల ఆందోళన వంటి కీలక విషయాలపై చర్చకు ప్రభుత్వం వెంటనే సిద్ధంగా ఉందని, స్వయంగా హోం మంత్రి అమిత్ షా సమాధానాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షం వెనకడుగు వేస్తోందని స్పష్టం చేశారు. మరోవైపు పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసనలు చేపట్టారు. గతనెల 20న విద్యార్థులపై జరిగిన చర్యలతో పాటు రామమందిర విరాళాల వ్యవహారంపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చివరి రోజున కూడా హోం మంత్రికి వ్యతిరేకంగా విపక్షాల ప్రచారం కొనసాగగా, ఎన్డీయే, ప్రతిపక్షాలు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో పార్లమెంట్ ఆవరణ ఉద్రిక్తంగా మారింది.

## ఖర్గే ప్రసంగించిన వేదిక శుద్ధిచేయడంపై రాజ్యసభలో రభస

**ఖర్గే సభావేదిక శుద్ధిచేయడంపై రాజ్యసభలో రభస...**

ఇదిలా ఉండగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో శుద్ధీకరణ పేరుతో హోమం చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈఅంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎస్‌సిఎస్టీ కేసునమోదుచేసి విచారణచేయాలని డిమాండ్‌చేసారు. ఇది ప్రజా స్వామ్య పద్ధతేనా రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్ అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మత పరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు. శుద్ధి కార్యక్రమంతో బిజెపికి సంబంధం లేదని ఎన్డీయే పక్షనేత కేంద్రమంత్రి జెపినడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బిజెపి ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు.



# ఎర్రకోట పేలుళ్లు ఆల్‌ఖైదా పనే

## ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో 2025 నవంబర్‌లో జరిగిన పేలుడికి అల్‌ఖైదా అనుబంధ సంస్థ అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్‌కాంటినెంట్ కారణమని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అధికారికంగా పేర్కొంది. ఈనెల 10న విడుదలైన యూఎన్‌ఎస్సీ విశ్లేషణాత్మక సహాయ, ఆంక్షల పర్యవేక్షణ బృందం తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత యేడాది నవంబర్ 10న రాత్రి 7 గంటల సమయంలో ఎర్రకోట సమీపంలో కదులుతున్న హ్యుందాయ్ ఐ20 కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. కారును ఉమర్‌ఎనబీ నడిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. అతడే ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దాడిని తొలుత పాకిస్థాన్ కేంద్రంగా ఉన్న జైష్‌ఎమొహమ్మద్ అయి ఉంటుందని అనుమానించారు. ఓ సభ్య దేశం కూడా వరుస దాడులతో పాటు రెడ్‌ఫోర్ట్ పేలుడికి జెఇఎం కారణమని పేర్కొన్నట్లు యూఎన్‌ఎస్సీ నివేదిక తెలిపింది. తాజాగా ఎక్యూఐఎస్‌కు అధికారికంగా ఆపాదించడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. 2014లో ఏర్పాటైన ఎక్యూఐఎస్ భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో అల్‌ఖైదా కార్యకలాపాలను విస్తరించేందుకు ఏర్పడిన ప్రాంతీయ అనుబంధ సంస్థ. పెద్ద ముఠాల కంటే చిన్న చిన్న చెదురుమదురు సెల్‌లుగా పనిచేస్తూ లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకుంటోందని యూఎన్‌ఎస్సీ నివేదిక పేర్కొంది. అల్‌ఖైదా, ఐఎస్‌ఐఎస్ అనుబంధ సంస్థల సామర్థ్యాలపై కూడా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. రసాయన, జీవ ఆయుధాలపై ఆసక్తి ఉన్నప్పటికీ వాటిని తయారు చేయడంలో సాంకేతిక సవాళ్లు ఇప్పటికీ ఉన్నాయని తెలిపింది.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించాలని అలహాబాద్ కోర్టు సిబిఐ, ఇడిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆగస్టు 17వ తేదీన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తులపై సిబిఐ ఇచ్చిన వివరణ పట్ల గతంలో అలహాబాద్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు చెందిన కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని జూలై 20వ తేదీన లక్నో బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఇడి విచారణ సమయంలో ఆదాయానికి మించిన ఆస్తులకేసులో ఏవైనా డాక్యుమెంట్లు సేకరించారా అనికూడా హైకోర్టు ప్రశ్నించింది. కర్ణాటక నివాసి ఎస్ విఘ్నేశ్ సిసిర్ దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు కూడా గతంలో విఘ్నేశ్ ఓ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## అధికమొత్తం యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** యుపిఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్‌ను మళ్లీ అమలు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. అన్ని లావాదేవీలపై కాకుండా అధిక విలువ కలిగిన కొన్ని యుపిఐ చెల్లింపులు లేదా నిర్దిష్ట వ్యాపారులకే ఎండిఆర్ విధించే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహకాలను దశలవారీగా తగ్గించే టియర్డ్ ఇన్సెంటివ్ విధానాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. యుపిఐ వ్యవస్థను దీర్ఘకాలం స్థిరంగా కొనసాగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గించేందుకు ఈ రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు ఆర్థిక సేవల విభాగం వెల్లడించింది. అధిక పరిమితి దాటిన లావాదేవీలు లేదా కొన్ని వర్గాల వ్యాపారులకు ఎండిఆర్ పునరుద్ధరించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

ప్రస్తుతం యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ లేదు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు 2020 జనవరి నుంచి కేంద్రం ఈ ఛార్జీని రద్దు చేసింది. అంతకుముందు వ్యాపారుల యూపిఐ లావాదేవీలపై గరిష్ఠంగా 0.30శాతం ఎండీఆర్ ఉండేది. యుపిఐ లావాదేవీలకు ప్రోత్సాహకంగా కేంద్రం రూ.2వేల కోట్లు కేటాయించింది. అయితే పరిశ్రమ అంచనా ప్రకారం యుపిఐ వ్యవస్థ నిర్వహణకు రూ.20,700 కోట్ల వరకు ఖర్చవుతోంది. ప్రస్తుత ప్రభుత్వ ప్రోత్సాహకం పరిశ్రమ వాస్తవ ఖర్చులో కేవలం 11 శాతానికే సరిపోతుందని పార్లమెంటరీ కమిటీ




పేర్కొంది. పరిహారం తగినంతగా లేకపోతే సైబర్ సెక్యూరిటీ, మోసాల నిరోధం, చెల్లింపు నెట్‌వర్క్ మౌలిక వసతులపై కీలక పెట్టుబడులపై ప్రభావం పడొచ్చని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. యుపిఐ వినియోగం మరింత భారీగా పెరగనున్నట్లు కమిటీ తెలిపింది. నెలకు 150 బిలియన్ లావాదేవీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మరో 60 కోట్ల మంది కొత్త వినియోగదారులు యుపిఐలో చేరొచ్చని అంచనా వేసింది. పార్లమెంటు ఆమోదించిన పన్నులు, ఇతర చట్టాల సవరణ బిల్లు 2026తో కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలకు ఛార్జీల నుంచి చట్టపరమైన రక్షణ కొనసాగించేలా ప్రభుత్వం మార్గం ఏర్పడింది. యుపిఐపై ఎండిఆర్ విధించేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతించలేదు.

# ప్రీరైడ్ టిప్స్ తక్షణమే తొలగించాలి

## కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ,ఆ గస్టు 13:** ఉబర్, ఓలా, ర్యాపిడో లాంటి రైడ్ హెయిలింగ్ యాప్స్‌లో ప్రయాణికులు ముందస్తుగా టిప్స్ చెల్లించాల్సిన అవసరం తప్పింది. ఈ ఒరవడికి చెక్ పెడుతూ కేంద్రం తాజాగా ఆదేశాలు జారీచేసింది. ప్రీ రైడ్ టిప్స్ ఆప్షన్‌ను తక్షణం తొలగించాలని రైడ్ హెయిలింగ్ యాప్స్‌కు కేంద్రం స్పష్టంచేసింది. ప్రీ రైడ్ టిప్స్‌తో త్వరగా రైడర్ వచ్చే అవకాశం ఉందన్న భావన కలిగించి ప్రయాణికుల నుంచి అదనపు డబ్బు తీసుకోరాదని కేంద్రం ఆదేశించింది. మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉన్న అడ్వాన్స్ టిప్, చూజ్ యాన్ యాడాన్, క్వికర్ రైడ్ కన్ఫర్మేషన్ వంటి ప్రీరైడ్ టిప్ ఆప్షన్స్‌ను తొలగించాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రీరైడ్ టిప్ ఇస్తే డ్రైవర్ తమ అభ్యర్థనను త్వరగా ఆమోదిస్తారన్న భావన యూజర్లలో కలుగుతున్నదని పేర్కొన్నది. ఈ మార్గదర్శకాల ప్రకారం ప్యాసింజర్లు స్వచ్ఛందంగా, అదీ ప్రయాణం ముగిసిన తరువాతే టిప్ చెల్లించాలి. త్వరగా క్యాబ్ బుకింగ్ జరుగుతుందన్న భావనతో టిప్స్ ముందస్తుగా చెల్లించే పరిస్థితి ఉండకూడదు. ఇక ప్యాసింజర్ టిప్ మొత్తం డ్రైవర్‌కే బదిలీ చేయాలి. ఓలా, ఉబర్ వంటి వాహన అగ్రిగేటర్‌లు ఇందులో ఎలాంటి వాటా స్వీకరించకూడదు. గతంలో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీచేసింది. త్వరగా రైడ్ బుక్ అవుతుందన్న భావన కలిగించి ప్రయాణికుల నుంచి ముందస్తుగా టిప్స్ వసూలు చేయొద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ తీరుకు శాశ్వతంగా ఫుల్ స్టాప్ పెట్టింది.

## సున్సరి ఘర్షణల్లో పాక్ ఐఎస్ఐ హస్తం

**సున్సరి,నేపాల్, ఆగస్టు 13:** భారత్‌కు సరిహద్దున ఉన్న నేపాల్లోని సున్సరి జిల్లాలో జూలై 26న చోటుచేసుకున్న కోమల ఘర్షణల వెనుక పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సున్సరిలోని దేవ్గంజ్ గ్రామీణ పురపాలక పరిధిలోని కప్తాన్గంజ్ ప్రాంతంలో మతపరమైన జెండాలు, ఎక్కువ సౌండ్తో డీజే ప్లే చేయడంపై రెండు వర్గాలమధ్య మొదలైన చిన్నవివాదం తీవ్ర హింసాత్మకంగా మారింది. పరిస్థితి చేయిదాటడంతో భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈహింస ఇతర ప్రాంతాలకూ వ్యాపించడంతో యంత్రాంగం కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. గతనెల31 నాటికి ఈ ఘటనల్లో కనీసం ముగ్గురు మరణించగా, 25 మందికి పైగా గాయపడినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ ఘర్షణలపై నేపాల్ నిఘా సంస్థ ఆ దేశ హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిన ప్రాథమిక నివేదికలో విదేశీ మత ప్రచారకుల కార్యకలాపాలు, సరిహద్దు ప్రాంతాల్లోని అనుమానాస్పద నెట్‌వర్క్‌పై సమగ్ర విచారణ జరపాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ నివేదికలో పాకిస్థాన్‌మూలాలున్న మోలానా మహమ్మద్ ఇలియాస్ ఘుమాన్, ఖాట్మండు మసీదుఇమామ్ ముఫ్తీ అబుబకర్ కాస్మీలు సున్సరిలో పర్యటించినట్లు ప్రస్తావించారు. భారత సరిహద్దులోని సున్నితమైన జిల్లాల్లో విదేశీ మత పెద్దలు పర్యటించారని ఆరోపణలు వచ్చినప్పటికీ, వారి సమక్షానికీ ఈ హింసకూ నేరుగా సంబంధం ఉందనే విషయాన్ని అధికారులు అధికారికంగా ధృవీకరించలేదు.

## రేవణ్ణ మొబైల్‌లో 90కిపైగా నీలిచిత్రాలు

**బెంగళూరు, ఆగస్టు 13:** అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జెడిఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన బ్యారక్‌లో దొరికిన మొబైల్ ఫోన్‌లో భారీగా పోర్న్ కంటెంట్ ఉన్నట్లు సమాచారం. బెంగళూరులోని అగ్రహార కేంద్ర కారాగారంలో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సిసిబి) నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో ఈ ఫోన్ బయటపడింది. అందులో సుమారు 80 నుంచి 90 పోర్న్ వీడియోలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. తక్కువ దుస్తుల్లో ఉన్న మహిళల ఫొటోలకు సంబంధించిన వార్తాపత్రిక కటింగ్స్ కూడా ఫోన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ ఫోన్‌లో ఎక్కువగా భారతీయ పోర్న్ వీడియోలు ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫోన్‌ను అధికారులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. వీడియోలు ఎప్పుడు డౌన్‌లోడ్ అయ్యాయి ఫోన్‌ను ఎవరు ఉపయోగించారు అందులో మరిన్ని ఫైళ్లు ఉన్నాయా అనే అంశాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలించనున్నారు. సిసిబి అధికారులు జైలులో నాలుగు నుంచి ఐదు గంటల పాటు సోదాలు నిర్వహించారు. హైప్రొఫైల్ ఖైదీల బ్యారక్‌లతో పాటు హై సెక్యూరిటీ జైలులోనూ తనిఖీలు చేశారు.



రేవణ్ణ బ్యారక్‌లో మొబైల్ ఫోన్‌తోపాటు పెన్‌డ్రైవ్, ఛార్జర్ కూడా లభించినట్లు జైలు అధికారులు తెలిపారు. ఇతర నిషేధిత వస్తువు లేవీ దొరకలేదని పేర్కొన్నారు. ఫోన్ బయటపడటంతో జైలు అధికారులపై చర్యలు మొదలయ్యాయి. నిషేధిత ఫోన్ జైలులోకి ఎలా చేరింది బ్యారక్‌లోకి ఎలావెళ్లింది అనే అంశాలపై శాఖా పరమైన విచారణకు ఆదేశించారు. ఫోన్‌లోని సిమ్ వినియోగం పైనా అధికారులు దృష్టి పెట్టారు. రేవణ్ణ ఫోన్‌లోని ఎయిర్‌టెల్ సిమ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో యాక్టివేట్ చేసినట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో యాక్టివేట్ చేసిన సిమ్‌లు జైలు సిగ్నల్ జామర్లను తప్పించుకుని పనిచేస్తున్నట్లు ఇటీవల ఫోన్ స్వాధీనం చేసుకున్న ఘటనల్లో గుర్తించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# సంక్షిప్త వార్తలు

## నాకు ముప్పందన్నారు.. అందుకే విమానం మారా: ట్రంప్



**వాషింగ్టన్, ఆగస్టు 13:** గత నెలలో తుర్కియే పర్యటన ముగిశాక తనకు ముప్పుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ వన్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా తప్పించుకుని మరో విమానంలో అమెరికా చేరుకున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వెల్లడించారు. అయితే ఈ బెదరింపులకు తానేమీ భయపడలేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు క్యాటరింగ్ కంటైనర్‌లో దాక్కుని వేరే విమానంలోకి మారి అమెరికాకు ప్రయాణమవడం, అటుపై ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాన్ని తప్పుదోవ పట్టించే డెకాయ్‌గా పంపిన ఘటనను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. అలాగే ఆ సమయంలో తన అధికారిక విమానంలో ప్రయాణించిన శ్వేతసౌధం అధికారులు, భద్రత-సహాయ సిబ్బంది, విలేకరులకు ఎదురయ్యే ప్రమాదాన్ని తక్కువ చేసి చూపారు. 'నేను వేరే విమానంలో ప్రయాణించాలని వారు కోరుకున్నారు. అక్కడ ఏదో ఓ ముప్పు ఉందని ఊహించా. అయితే దాని గురించి ఆరా తీయలేదు. నాకు చాలా ముప్పులు ఎదురవుతుంటాయి' అని ట్రంప్ ఒహాయోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన తర్వాత విలేకరులకు తెలిపారు.

## యుఎస్‌లో 'ఇండియా డే' అధికారిక గుర్తింపు

**వాషింగ్టన్, ఆగస్టు 13:** భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాలోని అనేక రాష్ట్రాలు ఇండియా డే వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఆగస్టు 15ను ఇండియా డేగా ప్రకటిస్తూ ఇటీవల కాలంలో పలు రాష్ట్రాలు అధికారిక ప్రకటన విడుదల చేశాయి. తాజాగా డెలావేర్ రాష్ట్రం కూడా 'ఇండియా డే'ను అధికారికంగా ప్రకటించింది. అంతకుముందు, న్యూయార్క్, న్యూజెర్సీ, మాసాచుసెట్స్ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆగస్టు 15న ఇండియా డేను అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో భారతీయ సంతతి ప్రజల భాగస్వామ్యంతో డెలావేర్ తనకంటూ ప్రత్యేకతను సంతరించుకుందని రాష్ట్ర గవర్నర్ మ్యాథ్యూ మేయర్ తాజాగా తెలిపారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు అనుసరించే ప్రజలు రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేశారని వ్యాఖ్యానించారు. భారత సంతతి వారు తమ నైపుణ్యాలు, నాయకత్వం, సేవాతత్పరతతో రాష్ట్రాన్ని సుసంపన్నం చేశారని ప్రశంసించారు.

## పాక్‌లో 62 మంది ఉగ్రవాదులు హతం

**ఇస్లామాబాద్, ఆగస్టు 13:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో 36 గంటలపాటు నిఘా సమాచారం ఆధారంగా జరిపిన వరుస ఆపరేషన్‌లలో 60 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారని భద్రతా అధికారులు తెలిపారు. దేశ వాయువ్య ప్రాంతంలోని ఉత్తర వజీరిస్తాన్, బన్నూ జిల్లాల్లో ఈ ఆపరేషన్లు జరిగాయి. ఉత్తర వజీరిస్తాన్‌లో మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించిన ఆపరేషన్లలో నలుగురు కీలక కమాండర్లతో సహా 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, బన్నూలో జరిగిన పలు ఆపరేషన్‌లలో 10 మంది ఉగ్రవాదులు హతమవ్వగా 16 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉత్తర వజీరిస్తాన్‌లో ఫిత్నా అల్-ఖవారిజ్ మిలిటెంట్లపై లక్షిత దాడికి ముందు భద్రతా దళాలు అనుమానిత ప్రాంతాలపై నిఘాను కట్టుదిట్టం చేశాయి.

## ఆర్జీకర్ వైద్యురాలి కేసులో టిఎంసి మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**కోల్‌కత్తా, ఆగస్టు 13:** ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి మృతదేహాన్ని అత్యవసరంగా దహనం చేసిన వ్యవహారంలో టిఎంసి మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఒడిశాలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సాక్ష్యాలను ధ్వంసం చేయడం, నేరపూరిత కుట్ర, ఒక వ్యక్తిని వారి ఇష్టానికి వ్యతిరేకంగా పని చేసేలా బలవంతం చేయడం వంటి ఆరోపణలపై పానిహతి మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదైనట్లు వెల్లడించారు. 2024 ఆగస్ట్ 9న కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న 31 యేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ అనుమానాస్పదంగా మరణించింది. ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లు వచ్చిన ఆరోపణల కేసుపై సిబిఐ దర్యాప్తు చేస్తున్నది. ప్రధాన నిందితుడికి ట్రయిల్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షవిధించింది. అయితే ఈ సంఘటన జరిగిన రెండేళ్ల తర్వాత బాధితురాలి తండ్రి తాజాగా సోమవారం ఖర్దాహా పోలీస్ స్టేషన్లో కొత్తగా ఫిర్యాదు చేశారు. తన కుమార్తె మృతదేహాన్ని హడావిడిగా దహనం చేయడంలో బలవంతం చేసిన ముగ్గురిలో టీఎంసీ మాజీ ఎమ్మెల్యే నిర్మల్ ఘోష్ కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు. దీంతో పోలీసులు కొత్తగా కేసు నమోదు చేశారు.

## అకాలిదళ్ అధినేత బాదల్‌పై దాడి



**నాందేడ్, ఆగస్టు 13:** శిరోమణి అకాలీ దళ్ అధినేత, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో దాడి జరిగింది. గురుద్వారా మాతా సాహిబ్ దర్శనం కోసం కుటుంబ సమేతంగా వెళ్లిన సమయంలో, ఓ నిహంగ్ సిక్కు వ్యక్తి పదునైన ఆయుధంతో ఆయనపై హఠాత్తుగా విరుచుకుపడ్డాడు. అతడు కత్తితో దాడి చేయడంతో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ చేతికి గాయాలయ్యాయి. ఆయన రక్షణగా ఉన్న సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరికికూడా ఈ ఘటనలో గాయాలైనట్టు తెలుస్తోంది. దాడి జరిగిన వెంటనే జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతా సిబ్బంది అప్రమత్తమై నిందితుడిని అడ్డుకున్నారు. అనంతరం గాయపడిన సుఖ్‌బీర్ బాదల్‌ను వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తు న్నారు. దాడికి పాల్పడిన నిహంగ్ సిక్కు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ వేగవంతం చేశారు.

## ప్యాకేజ్ ఫుడ్‌పై హెచ్చరిక లేబుళ్లు తప్పనిసరి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది.

# రూ.10.74 కోట్ల డిజిటల్ అరెస్ట్ మోసం

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వృద్ధుడిని మోసం చేసి రూ.10 కోట్లకు పైగా కాజేసిన కేసులో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌ను పుణే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన రోహన్ జాధవ్‌గా గుర్తించారు. పోలీసులు అతని బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక వనరులను స్తంభింపజేయడంతో అతను కోర్టులో లొంగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ యేడాది జనవరిలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. కొందరు మోసగాళ్లు సిబిఐ అధికారులుగా నటిస్తూ వృద్ధుడిని సంప్రదించారు. ఓ కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారని, డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరించారు. చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవాలంటే వివిధ బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు బదిలీ చేయాలని సూచించారు. దీంతో బాధితుడు మొత్తం రూ.10.74 కోట్లు పలు ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల్లో ఒకరు ఎటిఎం నుంచి డబ్బు ఉపసంహరించుకోవడంతో పోలీసులు అతని ఆచూకీని గుర్తించారు. ఈ క్రమంలో హర్షద్ సుభాష్ ధంతోలే, సమర్థ్ సురేశ్ దేశ్‌ముఖ్, అమర్ శివాజీ అట్టార్గిలను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ధంతోలే కీలక విషయాలు వెల్లడించాడు. తాను ఎటిఎం నుంచి తీసుకున్న డబ్బును రోహన్




జాధవ్‌కు ఇచ్చినట్లు తెలిపాడు. అప్పటికే జాధవ్ పరారీలో ఉన్నాడు. విచారణలో జాధవ్ మోసపూరితంగా పొందిన రూ.10.74 కోట్లను ఏకంగా 5,436 బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే జాధవ్‌కు హాంకాంగ్‌లోని కొందరువ్యక్తులతో టెలిగ్రామ్‌యాప్ ద్వారా సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వారితో తరచూ వీడియో కాల్స్‌లో మాట్లాడేవాడని పోలీసులు తెలిపారు. డిజిటల్ క్రిప్టోకరెన్సీ ద్వారా హాంకాంగ్‌లోని తన నిర్వాహకులతో ఆర్థిక లావాదేవీలు జరిపేవాడని, భారత్ నుంచి విదేశీ కరెన్సీకి డబ్బు బదిలీ చేసినందుకు భారీగా కమీషన్లు పొందేవాడని పోలీసులు పేర్కొన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గాఉన్న జాధవ్ సెలబ్రిటీ మేనేజ్‌మెంట్ రంగంలోనూ పనిచేసేవాడని అధికారులు తెలిపారు. అతనిపై రెండు కేసులు నమోదయ్యాయి.

# ఆపదలో ఆధరణగా నిలుస్తున్న సీఎం సహాయనిధి

## -ఎమ్మెల్యే రామాంజనేయులు

**ప్రత్తిపాడు, ఆగస్టు 13, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రజల పాలిట భాగస్వామ్యమై, ఆపదలో ఆదరణగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బుర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ.. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన 54 మంది కలిసి 31 పర్యాయాలుగా రూ.13 కోట్లకు పైగా విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను,1197 మందికి పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ ఒక్క రోజు ఎల్ఓసీ మరియు రీయింబర్స్మెంట్ చెక్కులు మొత్తంగా 54 మంది లబ్ధిదారులకు రూ.74 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించడం జరిగిందని, ఈ ఆర్థిక సహాయం వలన వారికి, వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగం ఉంటుందని మరియు వేయటను అందిస్తుందని వెల్లడించారు. పేద ప్రజలను ఆదుకుంటున్న సీఎం



లబ్ధిదారులకు గాను రూ.74 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో వైద్య సహాయం కోసం పేద కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలకు విలువనిస్తూ, అత్యవసర సమయంలో అర్హులైన ప్రతి కుటుంబానికి వైద్య సదుపాయం అందించేలా సీఎం రిలీఫ్ ఫండ్ ను సమర్థవంతంగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలో ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఈ రోజుతో చంద్రబాబు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వట్టిచెరుకూరు మండలానికి సంబంధించి వల్లపాడు గ్రామానికి చెందిన కొండకం వెంకటనారాయణకు రూ.30,650లు, వట్టిచెరుకూరు గ్రామానికి చెందిన బొర్రా శ్రీనివాసరావు రూ.71,800లు, సొలాడు గ్రామానికి చెందిన ఎర్రిబోయిన వీరయ్య రూ.25 వేలు, కాట్రపాడు గ్రామానికి చెందిన మక్కెన శ్రీనివాసరావు రూ.37,100లు చెక్కులను అందించారు. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నార్నె బాబు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కట్టూరి శ్రీనివాసరావు, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు గింజుపల్లి శివరామ ప్రసాద్, మల్లి, ఎడ్లపల్లి వీరయ్య, జాగర్లమూడి రంగారావు, మక్కెన శ్రీనివాసరావు, తదితర కూటమి నాయకులు, వివిధ మండల, డివిజన్ మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి ట్యాంక్ బండ్ పై సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

**తెనాలి ఆగస్ట్ 13(ప్రభాతవార్త):** తెనాలి ట్యాంక్ బండ్ పై స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ జరుగనున్నందున యావన్మంది ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. గురువారం తెనాలిలోని జిల్లా గౌడ సంఘం కార్యాలయంలో ఏలూరు బీసీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ మేరకు పిలుపునిచ్చారు.



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, రైతు బాంధవుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తెనాలి ట్యాంక్ బండ్ పై ఆవిష్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. ఉద్యమాల నిప్పు కణిక లచ్చన్న 17 ఏండ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్యోద్యమంలో దుమికిన యువకిశోరమన్నారు. 1930లో మహాత్మా గాంధీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహంలో,1932లో శాసనోల్లంఘన ఉద్యమం తో పాటు, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలలోనూ, 1942 క్విట్ ఇండియా ఉద్యమాలలోనూ వారు చురుకుగా పాల్గొన్నారన్నారు. హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ,వారికి ఆలయ ప్రవేశం కల్పించి అంటరానితనం నిర్మూలన చేసి చూపించారన్నారు. జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి,పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆనాడే గుర్తించి పోరాడిన యోధుడు వారన్నారు. బడుగుల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న తన గీత కార్మిక వర్గాల ఐక్యతను చాటుతూ గౌడ జాతిలోని బిడ్డల అభివృద్ధి కోసం వారు ఎనలేని సేవలందించారన్నారు. భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. వారి సాహసానికి,కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్ బిరుదన్నారు. మహాత్మా గాంధీజీతో సుభాష్ చంద్రబోస్,ఎన్.జి.రంగా,ఆచార్య రంగా మొదలగు జాతీయ నాయకులతో కలిసి స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేకసార్లు జైలు జీవితం గడిపారన్నారు. ఆ మహనీయుని జయంతివర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అందుకే బడుగుల ఆరాధ్య దైవమైన డా: సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై వారి జయంతి రోజైన ఈ నెల 16న ఆవిష్కరించుకుంటున్నామన్నారు. ముఖ్యంగా గౌడలు,బీసీలు,లచ్చన్న అభిమానులతో పాటు యావన్మంది ప్రజలు హాజరై లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శంకరరావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తుమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు తెనాలిలోని జిల్లా గౌడ సంఘం కార్యాలయం నుండి లచ్చన్న విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.సాయంత్రం నాలుగు గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలియజేశారు.ఇంకా ఈ మీడియా సమావేశంలో చెన్ను శ్రీనివాసరావు, కేసన కోటేశ్వరరావు, కేసన సోమలు, కుంభం బాలాజీ,బెల్లంకొండ సురేష్, వంది నారాయణ,ఆకాశ సాంబశివరావు,ఉప్పాల వెంకట్రావు,తుళ్లూరు మాధవరావు,కంచర్ల బాబూరావు, చెన్ను సురేష్(బుజ్జి) వలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# రోడ్డుప్రమాదంలో మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

**తెనాలి ఆగస్ట్13(ప్రభాతవార్త):** రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించిన ఘటన తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో జరిగింది. తెనాలి రూరల్ పోలీసుల కథనం ప్రకారం, గత మంగళవారం రాత్రి సుమారు 08.00 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అంగలకుదురు గ్రామంలోని బ్రహ్మం గారి గుడి ఎదురుగా రోడ్డు దాటుతూ



ఉండగా తెనాలి వైపు నుండి గుంటూరు వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ నిరక్ష్యంగా, అతివేగంగా ఆటో నడుపుతూ సదరు రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటోతో గుద్ది అక్కడి నుండి ఆటోతో పారిపోయినాడు. తర్వాత గ్రామస్తులు సదరు వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా తెనాలి గవర్నమెంట్ హాస్పటల్ కు తరలించగా,గాయపడిన మగవ్యక్తి వయసు 35, సంవత్సరాలు మరియు అతను హిందీ భాషలో మాత్రమే మాట్లాడుతున్నాడు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తెనాలి గవర్నమెంట్ హాస్పటల్ నుండి గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించగా సదరు వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినాడు. కావున పై ఫోటోలోని మరణించిన వ్యక్తిని గుర్తించినచో ఆ వివరాలను తెనాలి గ్రామీణ పోలీసు వారికి సమాచారం అందించవలసినదిగా కోరుచున్నామని ఎస్సై ఆనంద్ 9440796170, సీఐ షేక్ నాయబ్ రసూల్ 9440796219.లకు తెలియపరచవలసిందిగా తెనాలి గ్రామీణ పోలీసులు తెలిపారు.

# రీలాంచ్ ఐన బిఎస్ఎన్ఎల్ ఫ్రీడం2.0ఆఫర్ ప్లాన్

**తెనాలి ఆగస్ట్13(ప్రభాతవార్త):** బియస్ఎన్ఎల్ "ఫ్రీడం 2.0 ఆఫర్ ప్లాన్ బంపర్ ఆఫర్ ఎఫ్ఆర్సి 1 మరల రీ లాంచ్ కారణంగా,అనగా కేవలం రు.1/ తో.. ఫ్రీ సిమ్ ,1జిబి డేటా/డే, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్,మరియు 100 ఎస్ఎంఎస్ లు ..24 డేస్ వస్తుంది.ఈ ఆఫర్ 12.08.2026 నుండి 12.09.2026 వరకు ఉంటుంది.ఈ సదవకాశం తెనాలి మరియు రేపల్లె పరిసరప్రాంతాల వినియోగదారులు అందరూ,క్రొత్త సిమ్ తీసుకోవలసిందిగా, డివిజనల్ ఇంజనీర్ ,ఆకవరపు శ్రీనివాసరావు (ఆపరేషన్స్, తెనాలి)ఒక ప్రకటనలో తెలిపారు .కావున వినియోగదారులు ఈ గొప్ప అవకాశం ను సద్వినియోగం చేసుకోవలసిందిగా అయన కోరారు .

# కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయమే లక్ష్యం

**మంగళగిరి, ఆగస్టు 13, ప్రభాతవార్త :** మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గుంటూరు జిల్లా బీజేపీ కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ బీఎల్ఏ-1 పంచుమర్తి ప్రసాద్ (చిన్నా) ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు... సమావేశంలో జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే కార్పొరేషన్ ఎన్నికలు అభివృద్ధి, ప్రజాసేవకు మరింత బలమైన పునాది వేసే అవకాశమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజల మద్దతు పొందాలని సూచించారు. రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే ఎన్డీఏ బలమన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు బిట్ర శివనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని, ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని పార్టీ విజయంగా మలచేందుకు కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు. గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కూటమి అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వార్డు స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బీఎల్ఏ-1 పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ప్రతి బూత్‌లో కార్యకర్తల సమన్వయం, ఓటర్లతో నిరంతర సంబంధం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజా మద్దతును పెంచుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేస్తే మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో ఎన్డీఏకు ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివనారాయణ, చేనేత సెల్ కన్వీనర్ జగ్గరపు శ్రీనివాసరావు, కోస్తాంధ్ర ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి తుల్లిమిల్లి రామకృష్ణ, స్టేట్ కౌన్సిల్ సభ్యులు అమ్మయ్య చౌదరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ కోవెలకారు రాకేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, కాంద్రు భాను కిశోర్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షులు వడిగా మణికంఠ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు శివరామకృష్ణ, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు కనసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్థిక వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

## నేత్ర దానానికి ముందుకొచ్చిన భర్త

**తెనాలి ఆగస్ట్13(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిఐ కాలేజీ వద్ద నివాసముంటున్న లక్ష్మీ తిరుపతమ్మ (34) అనే వివాహిత ఆర్థిక,మానసిక వేధింపులు తాళలేక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా,భర్త నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... బాజీ మరియు నాగరాజు అనే ఇద్దరు వ్యక్తులతో లక్ష్మీ తిరుపతమ్మ కు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సదరు వ్యక్తులు ఆమె వద్ద నుండి నగదు, బంగారు ఆభరణాలు తీసుకుని, ఇంకా డబ్బులు తీసుకురావాలంటూ తీవ్ర మానసిక వేధింపులకు, బెదిరింపులకు గురిచేశారని,వారి వేధింపులు తట్టుకోలేక,భయంతో ఆమె మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని




చనిపోయిందని,భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్ టెక్నీషియన్.. యుగంధర్ సూచన మేరకు మృతురాలి భర్త నాగబాబు ని ..నేత్ర దానం.. చేయమని అడగగా ఆయన అంగీకరించి,ఎస్సై కె.ఆనంద్ సమక్షంలో తెనాలి గవర్నమెంట్ హాస్పిటల్ లో నేత్ర సేకరణ నిర్వహించి,డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్ వారికి అందచేశారు.నేత్ర దానం గురించి మరింత సమాచారం కోసం 8886399923 నెంబర్ ను సంప్రదించాలన్నారు.

# వ్యవసాయ మోటార్లు దొంగతనం చేసిన నిందితులు అరెస్ట్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 13(ప్రభాతవార్త):** గత మూడునెలలుగా తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంఘం జాగర్లమూడి, అంగలకుదురు, చావావారి పాలెం, ఏరుకులపూడి, కొలకలూరు, కాజీపేట గ్రామాలలో రాత్రి సమయంలో పంట పొలాలలోని ఎలక్ట్రికల్ మోటార్లలు దొంగతనాలు జరగగా తెనాలి రూరల్ పోలీస్ వారు మొత్తం 6 కేసులు నమోదు చేసి, ఆరు కేసుల్లో కలిపి మొత్తం 26 విద్యుత్ మోటార్లు దొంగతనం జరిగినవని,ఐతే జులై 27వ తేదీ పొన్నూరు రూరల్ పోలీసులు ఈ ఆరుగురు ముద్దాయిలను ( తాడికొండ మండలం , ఫణిదం గ్రామానికి చెందినవారు) అరెస్టు చేసి రిమాండ్ కి పంపించగా, సదరు



ముద్దాయిలను గురువారం తెనాలి గ్రామీణ పోలీసులు ..పిటి వారెంట్.. పై గుంటూరు జిల్లా జైలు నుండి తీసుకుని వచ్చి తెనాలి న్యాయమూర్తి ముందు కోర్టులో హాజరు పరిచి 14 రోజులు రిమాండ్ విధించగా, సదరు ముద్దాయిలను తిరిగి గుంటూరు జిల్లా జైలుకి తరలించామని,తెనాలి గ్రామీణ పోలీసులు తెలిపారు.

# దేశంలో మార్పు అనివార్యం

## -సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** దేశంలో మార్పు అనివార్యమని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యావసర ధరలను నియంత్రించాలని, విద్య,వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రుణమాఫీ చేయాలన్నారు. ప్రతి యువకుడికి ఉద్యోగం




కల్పించాలన్నారు. పట్టణ కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలన్నారు. దళితులు, ఆదివాసీలపై దాడులను అరికట్టాలన్నారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలను ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణాలు కూడా చేపట్టి ఇవ్వాలన్నారు. దేశంలో మార్పు లేకుంటే విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగదన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే భారీ ర్యాలీ, ధర్నాకు పొన్నూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్మికులు, రైతులు,యువజనులు, విద్యార్థులు, మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్.సుగుణ, సిహెచ్ విజయలక్ష్మి, బొట్టు శ్రీనివాసరావు, మిక్కిలి బాబూరావు, జంపని గోవిందరాజు, నాంచారయ్య, ముక్కాల రాజు, ప్రసాద్, నాగరాజు, దేవరకొండ శ్రీనివాస్, సయ్యద్ హనీఫ్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ఈ నెల 14వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు పొన్నూరు పట్టణ పరిధిలోని 11కెవి ఫీడర్లో విద్యుత్ తీగలపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగింపుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ బి.అశోక్‌కుమార్ తెలిపారు. సాంబశివపేట, కోర్టు ఏరియా, మీనా అపార్టుమెంట్, ఆంజనేయస్వామి దేవాలయం ప్రక్కన, డీవిసి కాలనీ, వైష్ణవి నగర్, సుజాతా కళాశాల వెనుక, తదితర ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గుర్తించాలన్నారు.

**పొన్నూరు రూరల్ పరిధిలో:** 11కెవి కొత్త విద్యుత్ లైను నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 14వ తేదీన పొన్నూరు రూరల్ పరిధిలో పలు గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉపకార్యనిర్వహక ఇంజనీర్‌బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. కట్టెంపూడి అడ్డరోడ్డు, పచ్చలతాడిపర్రు, మునిపల్లె, బ్రాహ్మణకోడూరు, గోళ్ళమూడిపాడు, దండమూడి, ఆరెమండ, గాయంవారిపాలెం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# జ్ఞానజ్యోతి కార్యక్రమంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి

## -మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 13,ప్రభాతవార్త:** జ్ఞానజ్యోతి కార్యక్రమం అంగన్‌వాడీలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని అంగన్‌వాడీలలోని పిల్లలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యే విధంగా చూడాలని మండల ప్రత్యేకాధికారి జయలక్ష్మి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జ్ఞానజ్యోతి ప్రత్యేక శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పొన్నూరు డివిజన్ ఐసిడిఎస్ సిడిపిఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ



శిక్షణ పొందినటువంటి ఉపాధ్యాయులు అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోనే విద్యార్థులకు చదవడం, వ్రాయడం వంటివి నేర్పించడం ద్వారా పెద్ద తరగతుల్లో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాలలో ఉపయోగించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఏడుకొండలు, సూపర్‌వైజర్ నాగరాజకుమారి, ఉపాధ్యాయులు మాధవి, పాపారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి

## -జిల్లా సంయుక్త సంచాలకురాలు పద్మావతి

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 13,ప్రభాతవార్త:** ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు పద్మావతి కోరారు. మండల కేంద్రమైన చేబ్రోలు వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయశాఖ ద్వారా నిర్వహిస్తున్న రైతన్న మీ కోసం ఎలినినో కార్యక్రమంలో భాగంగా సాగుచేస్తున్నటువంటి ప్రతి ఒక్క పార్సిల్‌లో వేసినటువంటి పంట



వివరాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. పంట యొక్క పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఒక వేల పంట పరిస్థితి బాగాలేకపోతే తీసుకున్న చర్యలను కూడా సంబంధిత యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.800లు చొప్పున చెల్లిస్తే రూ.40వేలు బీమా వర్తిస్తుందన్నారు. మినుము పంటకు రూ.200చెల్లిస్తే రూ.20వేలు బీమా వర్తిస్తుందన్నారు. మిర్చిపంటకు రూ.27వందలు చెల్లిస్తే రూ.90వేలు బీమా వర్తిస్తుందన్నారు.ఈ అవకాశాన్ని ఈ నెల 15లోపు మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పలాయనవాదంలో ఒకరికి ఒకరు పోటీపడుతున్న మో-షాలు

## -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్

**పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ప్రభుత్వ వ్యతిరేకత నానాటికి తీవ్రమవుతున్న నేపథ్యంలో జాతిని ఎదుర్కొనే ధైర్యం లేక మోదీ, అమిత్‌షాలు పార్లమెంట్ నుండి పలాయనవాదం చిత్తగించారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగింపు సందర్భంగా సభకు విచ్చేసిన మోదీ, అమిషాల నుద్దేశించి మాట్లాడుతూ





కేవలం పార్లమెంట్ సమావేశాల ముగింపు రోజు సభలో వివాదాస్పద వందేమాతర గేయాన్ని ఆలపించేందుకే మోదీ-షాలు రావడం వారి మతోన్మాద వైఖరికి నిదర్శనమన్నారు. రోజు రోజుకు మోదీ-షాల ప్రభ మసకబారుతుండగా, ప్రజల మధ్యలో ఇటువంటి మతపరమైన చిచ్చు రాజేసి మనుగడ సాగించే సిగ్గుమాలిన ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పన్నెండేళ్ళ బీజేపి పాలనలో వివాదాలతో వర్గాలుగా సమాజాన్ని విభజించి లౌకిక ప్రభుత్వ స్ఫూర్తిని దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో2002 వరకు జాతీయ జెండా ఎగురనియ్యనివారు ఈ రోజు పార్లమెంట్‌లో, రేపటి 80వ స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలలో వందేమాతర గీతాలాపన పనిగట్టుకుని పాడడంలో ఆంతర్యమేమిటో దేశ ప్రజలకు తెలుసునన్నారు. ప్రతిభను నీరుగార్చుతున్నారని యువత, ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో సామాన్యులు ప్రభుత్వ తీరును అడుగడుగునా ఎండగడుతుంటే ఇద్దరూ పలాయనవాదం లంకించుకున్నారని, పలాయనవాదంలో ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీపడుతున్నారని ముగించారు.

# రేపు మాంసం-చేపల విక్రయాలు నిషధం

## -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, ఆగస్టు 13,ప్రభాతవార్త: ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘ పరిధిలో మాంసం-చేపల విక్రయాలను పూర్తిగా నిషేధించినట్లు మునిసిపల్



కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. ఇందుకు భిన్నముగా వ్యవహరించినవారిపై ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్టం-1965ను అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని అన్ని మాంసం, చేపల విక్రయదారులు గమనించాలని కమిషనర్ కోరారు.

**రోడ్లపై దమ్ము చక్రాల సంచారం నిషేధం:** తారు, సిమెంట్ రోడ్లపై ఇనుప చక్రాల(దమ్ము చక్రాల)ట్రాక్టర్ల సంచారాన్ని నిషేధించినట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఇనుమ చక్రాలు ఉన్న ట్రాక్టర్లును నేరుగా తారు, సిమెంట్ రోడ్లపై నడవడం వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, దీనివల్ల గుంతలు పడి, ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాక్టర్ యజమానులు, రైతులు నిబంధనలను తప్పకుండా పాటించాల న్నారు. పూర్తి నిషేధం: ఇనుప చక్రాలతో రోడ్లపై ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరం. జాగ్రత్తలు: కేజ్ వీల్స్‌ను పొలం వద్దనే తొలగించాలి, లేదా ట్రైలర్‌పై పెట్టి రవాణా చేయాలి. కఠిన చర్యలు: నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై చక్రాల ట్రాక్టర్లు నడిపితే వాహనాలను సీజ్ చేసి, భారీ జరిమానాలు విధిస్తామన్నారు. ప్రజా ఆస్థి అయిన రహదారులను కాపాడుకోవడానికి, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు అధికారులకు సహకరించాలని కమిషనర్ రమేష్‌బాబు కోరారు.

# అంబేద్కర్ సమానత్వం, గౌరవం ఆధారిత సమాజాన్ని కోరుకున్నారు

## వివిఐటి ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

**గుంటూరు విద్య ఆగస్టు 13 ప్రభాతవార్త :** అంబేద్కర్ న్యాయం, సమానత్వం, గౌరవం ఆధారిత సమాజాన్ని కోరుకున్నారని, ఈ డిజిటల్ యుగంలో ఆయన ఆలోచనలు మరింత ప్రాసంగికమయ్యాయని వివిఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. డాక్టర్ కంభం జాన్ వెస్లీ శశికాంత్ సంపాదకత్వంలో రూపొందించిన "అంబేద్కర్ విజన్ ఇన్ ది డిజిటల్ ఏజ్" సంకలన గ్రంథాన్ని వివిఐటి విశ్వ



విద్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటి డీన్ ఫ్రెష్‌మెన్ డాక్టర్ ఎమ్.వి. రఘురామ్, సంపాదకులు డాక్టర్ కంభం జాన్ వెస్లీ శశికాంత్, సూరపనేని నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్ వెస్లీ శశికాంత్ మాట్లాడుతూ... వేద పబ్లికేషన్స్ ప్రచురణలో వెలువడిన ఈ సంకలనం అంబేద్కర్ భావజాలానికి, డిజిటల్ ప్రపంచానికి మధ్య ఉన్న సంబంధాన్ని చర్చిస్తుందని తెలిపారు. రాజ్యాంగ ఆలోచన, నైతికత, డిజిటల్ హ్యూమానిటీ, ఏఐ (కృ.మే.), డిజిటల్ పౌరసత్వం వంటి విభిన్న అంశాలు సమకాలీన దృష్టితో ఇందులో చర్చించబడ్డాయని వివరించారు. డిజిటల్ ప్రపంచం మన సమాజాన్ని ఏ దిశగా తీసుకెళ్తుందో ఆలోచించే ప్రతి పాఠకుడికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


MN 11PAGE-GNTv:MN 11PAGE-GNTv 01/01/2001 10:14 Page 1



## పెదవడ్లపూడిలో నల్లబోతుల శ్రావ్యకు రూ.1,50,952 ఆర్థిక సాయం

**మంగళగిరి, ఆగస్టు 13, ప్రభాతవార్త**

మంత్రి నారా లోకేష్ చొరవతో పెదవడ్లపూడి గ్రామానికి చెందిన నల్లబోతుల శ్రావ్య కి రూ.1,50,952 విలువైన ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. గురువారం మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ టీడీపీ నాయకులతో కలిసి చెక్కును కుటుంబ సభ్యులకు



అందజేశారు. ఈ సందర్భంగా జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో అర్హులైన బాధితులకు ఎల్‌ఓసీ ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు.ఎల్‌ఓసీ చెక్కు మంజూరుకు చొరవ చూపిన మంత్రి నారా లోకేష్ కు నల్లబోతుల శ్రావ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్‌బాబు, మినీగా వెంకటేష్, జాలాది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## జనం మెచ్చిన జననాయకుడు,కొత్త తరానికి స్ఫూర్తి కన్నా లక్ష్మీనారాయణ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు,ఆగస్టు 13 ప్రభాతవార్త:** జనం మెచ్చిన జననాయకుడు, కొత్త తరానికి స్ఫూర్తి కన్నా లక్ష్మీనారాయణ అని, ఆయన సేవలు రాజకీయాలకు ఎన్సైక్లోపీడియా లాంటివని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ



మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి హాజరయ్యారు. తొలుత కన్నవారితోటలోని శ్రీ కన్నా లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన జననాయకుడని పేర్కొన్నారు. రాజకీయం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తావించదగిన నాయకులలో కన్నా లక్ష్మీనారాయణ ఒకరని, ఆయన ఒక కులానికి, ఒక ప్రాంతానికి, ఒక పార్టీకి మాత్రమే చెందిన నాయకుడు కాదని, ప్రజలందరి ఆదరణ పొందిన మహోన్నత వ్యక్తిత్వమని కొనియాడారు.పాత తరానికి చెందిన నాయకుల అనుభవ సంపదను కొత్త తరానికి అందిస్తున్న ఎన్సైక్లోపీడియా లాంటి నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అని గళ్ళా మాధవి అభివర్ణించారు. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజా సేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గతంలో కన్నా లక్ష్మీనారాయణ కూడా సేవలందించారని, ఆ నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం తనకు రావడం ఆయన ఆశీర్వాద ఫలితమేనని అన్నారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించాలనే సంకల్పంతో తాను పనిచేస్తున్నానని, కన్నా లక్ష్మీనారాయణ చూపిన మార్గంలోనే ముందుకు సాగుతానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి పనుల్లో, శిలాఫలకాలపై, ప్రజా మౌలిక వసతుల రూపంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ముద్ర స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ప్రజాప్రతినిధికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సమాజ సేవలో, ప్రజా సంక్షేమంలో ఆయన చూపిన నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని తాము కూడా ప్రజలకు మరింత సేవ చేయాలని భావిస్తున్నామని తెలిపారు. రాజకీయాల్లోనూ ప్రజా సేవలోనూ మరెన్నో సంవత్సరాలు ఆయన తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

## ఎన్.సి.సి. బి సర్టిఫికేట్ పరీక్షలలో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య ఆగస్టు 12 ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు గుంటూరులోని 25(ఏ )బి ఎన్ వారు ఈ సంవత్సరం ఫిబ్రవరి 2026 నెలలో నిర్వహించిన బి సర్టిఫికేట్ పరీక్షా ఫలితాలలో 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. బి సర్టిఫికేట్ పరీక్షకు 20 మంది విద్యార్థులు హాజరైనట్లు వారిలో 15 మంది ఏ గ్రేడ్, 5 గురు బి గ్రేడ్ ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్.సి.సి. బి సర్టిఫికేట్ లో ఉత్తీర్ణత పొందిన విధ్యార్థులకు సుబేదార్ దోమన్ కుమార్ చేతుల



మీదుగా సర్టిఫికెట్స్ అందచేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, శిక్షణ సిబ్బందికి తమ అభినందనలు తెలియ చేశారు. వీరందరికీ ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో ప్రాధాన్యతనిస్తారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష, ఓ.ఎస్.డి. డాక్టర్ పి. సీతారామయ్య, ఎన్ సి సి ఎ.ఎన్.ఒ. లెఫ్టినెంట్ సి. హెచ్. అజిత్ బాబు పాల్గొని విద్యార్థులకు తమ అభినందనలు తెలియచేశారు.

## నేడు ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025 పై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

**గుంటూరు విద్య ఆగస్టు 13 ప్రభాతవార్త :** ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025 పై కీలకమైన పలు ఉద్యోగ సంఘాల నాయకులతో శుక్రవారం ఏపీ సెక్రటేరియట్ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక సమావేశానికి (జాయింట్ స్టాఫ్ కౌన్సిల్) సర్వీస్ అసోసియేషన్ ల నాయకులకు ఆహ్వానం పంపింది.ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025 అమలుకు సంబంధించి పోస్టుల ఆర్గనైజేషన్, కేడర్ స్ట్రెంగ్త్–వర్కింగ్ స్ట్రెంగ్త్ పంపిణీ, స్థానిక కేడర్లకు ఉద్యోగుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించేందుకు 2వ సంప్రదింపుల సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కాన్ఫరెన్స్ హాల్, 1వ అంతస్తు, రూమ్ నం.216, 2వ బ్లాక్, ఏపీ సెక్రటేరియట్, వెలగపూడి నందు సమావేశం జరగనున్నది. ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025 అమలులో పోస్టుల పంపిణీ, ఉద్యోగుల కేటాయింపు అంశాలతో పాటు వయస్సు, సీనియారిటీ గ్రూపులను పరిగణనలోకి తీసుకోవడంపై కూడా సమావేశంలో చర్చ జరగనుంది. ఈ అంశానికి సంబంధించి హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్లు కూడా సమావేశం చర్చలో భాగంగా ఉన్నట్లు పలు ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.

## 58 మంది పేదలకు రూ.1,350 విలువైన కిరాణా సరుకుల పంపిణీ

**నకరికల్లు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ మెడికల్ వ్యాపారి ప్రవల్లిక సత్యం పుట్టినరోజు, రమాదేవి సత్యం పెళ్లిరోజు సందర్భంగా నరసరావుపేట పట్టణంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 58 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.1,350 విలువైన కిరాణా సరుకులతో పాటు సబ్బులు, క్రీములు, పేస్టులు తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చిలకల శ్రీరామ్మూర్తి, మునగ వేణుమాధవ్, కాకుమాను బదరి,చేగువెంకటేశ్వరరావు, గార్లపాటి శ్రీనివాసులు, కొత్తమాసు సుధాకర్, కాకుమాను శ్రీనివాసరావుతో పాటు పలువురు మెడికల్ వ్యాపారస్తులు, మిత్రులు, రమాదేవి స్నేహితులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రవల్లిక సత్యం, రమాదేవి సత్యం దంపతులు నిండు నూరేళ్లఆయురారోగ్యాలతో జీవిస్తూ, భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే కన్నా స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా.అరవింద్ బాబు

**నరసరావుపేట,ఆగస్టు 13 ప్రభాతవార్త :** సత్తెనపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి శ్రీ కన్నా లక్ష్మీనారాయణ స్వర్ణోత్సవం, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ వేడుకల్లో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య పాల్గొని కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ ప్రయాణంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేశారు. యువతకు వారి స్ఫూర్తి అని ఎమ్మెల్యే డాక్టర్



చదలవాడ అరవింద బాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాకులు కొల్లి బ్రహ్మయ్య అన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు సాధించిన తిరుమల విద్యార్థులు

**రొంపిచర్ల,ఆగస్టు 13 ప్రభాతవార్త :** జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం హైదరాబాద్ కు చెందిన ప్రముఖ సెమికోర్ లాబ్స్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ లో తమ కళాశాలకు చెందిన 11 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.వి. నారాయణ గురువారం తెలిపారు.



ఈ డ్రైవ్ లో మొత్తం 471 మంది విద్యార్థులు హాజరుకాగా, సంస్థ ప్రతినిధి నరేంద్ర బాబు ఆన్లైన్ టెస్టో 49 మంది విద్యార్థులు అర్హత సాధించగా, టెక్నికల్ మరియు హెచ్ఆర్ ఇంటర్వ్యూలలో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 3.5 లక్షల వేతన ప్యాకేజీని కంపెనీ అందిస్తోందన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణా తరగతులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, సెక్రటరీ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## కృష్ణవేణిలో "నషా ముక్త్ భారత్ అభియాన్" అవగాహన సదస్సు

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త : :** స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బ్రహ్మకుమారీస్, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్



అభియాన్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, స్పష్టమైన లక్ష్యాలతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని, మనస్సును శాంతంగా ఉండేందుకు ధ్యానం, యోగా చేయాలని సూచించారు. జీవితానికి లక్ష్యం నిర్దేశించుకొని, స్పష్టమైన ఆశయాలతో ముందడుగు వేయాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థులందరిచే "నషా ముక్తి ప్రతిజ్ఞ" చేయించారు. "నషా రహిత భారత్ ఆరోగ్యకర భారత్ ఆనందమయ భారత్" లక్ష్య సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్కే. సతీష్ బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేత్ర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుస్మిత ఆర్థో అండ్ ట్రామా కేర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

**నరసరావుపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త :** గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సుస్మిత ఆర్థో ట్రామా కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుస్మిత ఆర్థో ట్రామా కేర్ హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. శిబిరంలో ఉచిత ఓపీ, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, రూ.3,000 విలువైన బోన్ డెన్సిటీ పరీక్షతో పాటు ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు.ఆపరేషన్ అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించే అవకాశం కల్పిస్తున్నట్లు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలనిఆయనకోరారు.శిబిరంలో ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పి. బాలకృష్ణ, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్. ప్రదీప్ కుమార్ రెడ్డి వైద్య సేవలు అందించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలనువినియోగించుకోవాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు.

## కొండవీడు ఈఎన్టి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న ఉచిత వైద్య శిబిరం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 13 ప్రభాతవార్త :** కొండవీడు ఈ ఎన్ టి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న ప్రత్యేక ఉచిత వైద్యశిబిరంనిర్వహిస్తున్నట్లు హాస్పటల్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి తెలియజేశారు. వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీ వర్షిని తెలియజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ డి. శేఖర్ రెడ్డి, డాక్టర్ సుదీర్ చంద్ర,డాక్టర్ విష్ణు రాజు,డాక్టర్ నాగేశ్వరరావు



పాల్గొంటారనితెలియజేశారు. ప్రతి ఏడాది ఆగస్టు 15, రిపబ్లిక్ డే వంటి జాతీయ పర్వదినాలలో తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని వారు తెలియజేశారు . వైద్య శిబిరంలో పూర్తిగా ఓపి, అవసరమైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితం అన్నారు. అదేవిధంగా చెవి,ముక్కు కు సంబంధించిన ఇతర అనారోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు, ఇతర వైద్య సేవలలో రాయితీ కల్పిస్తున్నట్లు కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ కె. జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారు . విలేకరుల సమావేశంలో హాస్పటల్ ప్రతినిధులు మస్తాన్ రెడ్డి, స్వామి, మహేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 21వ వార్డులో ఎమ్మెల్యే అరవిందబాబు ఇంటింటి ప్రచారం

**నరసరావుపేట, ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' డోర్ టు డోర్ కార్యక్రమం గురువారం నరసరావుపేట పట్టణంలోని 21వవార్డులోనిర్వహించారు. భావన కాలేజీ సమీపంలోని పంజాబ్ బ్యాంకు వద్ద నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వార్డులోని పలు ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీఅందుతున్నాయా లేదా



అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు షేక్ మీరావలి, కపలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఘనంగా హార్ ఘర్ తిరంగా

**నకరికల్లు, ఆగస్టు 13 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామంలోని ఏఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గురువారం హార్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జాతీయ జెండా, త్రివర్ణ పతాకం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూతెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఇంటిపై, కార్యాలయాలు, విద్యాసంస్థలపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించడం గర్వకారణమని తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. భార్గవ భూషణ్ రావు మాట్లాడుతూ.. దేశ ప్రజల ఐక్యతను చాటిచెప్పే త్రివర్ణ పతాకాన్ని విద్యాసంస్థల్లో ఎగురవేయడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యతా భావాలను పెంపొందించవచ్చని అన్నారు.

## బిసిలకు న్యాయం జరిగే వరకు పోరాటం : కేశన

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్13, ప్రభాతవార్త:** ధామాషా ప్రకారం బిసిలకు ఉద్యోగాలు, పదోన్నతులు, పదవులలో న్యాయం చేయాలని, లేకుంటే పోరాటం ఆగదని ఏపి బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశన శంకరరావు స్పష్టం చేశారు. గురువారం వర్సిటీకి వచ్చిన ఆయన వీసితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్సిటీలో ఉన్న 3 పాలనాపరమైన ఉన్నత పదవుల్లో ఒక పోస్టు బిసిలకు దక్కాలే చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి మాదిరిగా బిసిలకు కూడా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా పాలకమండలి సభ్యులుగా



నియమితులైన బిసి వర్గానికి చెందిన ఆచార్య ఎస్.మురళీమోహన్, ఆచార్య ఎం.త్రిమూర్తిరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కృష్ణ, ఆచార్య పూర్ణచంద్రరావు, ఆచార్య కె.వి.శాంతిశ్రీ, డిఇఇ ఎన్.వెంకటేశ్వర్లు, ఏసిఇ రెడ్డి ప్రకాశరావు, బిసి సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వర్లు, సెక్రటరి ఐ.సాయిరామ్, ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.కోటీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పై యాప్‌ల భారం తగ్గించాలి

### -ఏఐఎస్టిఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు

**గుంటూరు విద్య ఆగస్టు 13 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల బోధనా విధులకు ఆటంకంగా ఉన్న యాప్ ల భారాన్ని వెంటనే తగ్గించాలని ఏఐఎస్టిఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఎస్ టి యు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి పెదనందిపాడు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే



నియమించాలని, 30 మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ ను రద్దు చేయాలని కోరారు. మిషన్ మార్చ్ 2026 పేరిట హైస్కూల్ లోని ఉపాధ్యాయులకు సిలబస్ పూర్తి కాకుండా ఆందోళనకు గురి చేస్తున్న విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే కృష్ణ గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలలో తనను బలపరచాలని ఉపాధ్యాయులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు గుంటూరు జిల్లా ఆర్థిక కార్యదర్శి బి హనుమంత్ ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు మద్దిరాల వెంకటేశ్వర్లు, ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ మరియు గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు గేరా మోహనరావు, ఎస్ టి యు నాయకులు టి సుభా సుందరం, టీవీ చలపతిరావు, కే చంద్రశేఖర్, సాతులూరి సుబ్బారావు, ఎన్ డి కాంతారావు, జొన్నకోటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వీసికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల వినతి

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్13, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బృందం గురువారం వీసి ఆచార్య కె.గంగాధరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పి.రవి, కోశాధికారి డా. తౌసిఫ్, డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం కోసం 24రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గతంలో ఆమోదించిన యూజిసి పే స్కేల్‌ను వెంటనే మాకు వర్తింప చేయాలన్నారు. మా సేవలను ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం పాలకమండలిలో మా సమస్యలపై చర్చించి తమ సర్వీసులను క్రమబద్ధీకరించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు. తమ వేతనాల పెంపుకోసం నియమించిన కమిటీ సిఫార్సులను అమలుచేయాలని విజ్ఞప్తిచేశారు. వీసి స్పందిస్తూ ఉన్నత విద్యాశాఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

**బిసి సంఘం మద్దతు**

రిలే దీక్షలు చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఏపి బిసి వెల్ఫేర్ స్టేట్ ప్రెసిడెంట్ కె.శంకరరావు సంఘీభావం తెలిపారు. వీ సమస్యల పరిష్కారం కోసం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి జె.శ్యామలరావుతో మాట్లాడి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంలో డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ పుణ్యశేఖర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ విజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## చక్కటి హావాభావాలతో కూచిపూడి నృత్యాలు

గుంటూరు కల్చరల్,ఆగష్టు 13,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సౌజన్యంతో నృత్య కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ నిర్వహణలో జరుగుతున్న కూచిపూడి నృత్యోత్సవాల ముగింపుగా మద్దాళి సౌందర్య నృత్య దర్శకత్వంలో నాట్య మయూరి శిష్య బృందం,హైదరాబాద్ వారి ఇల వైకుంఠం కూచిపూడి నృత్యకీర్తనలు ప్రదర్శించి ఆహుతులను ఆలరించారు.అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా చైర్మన్ హైపవర్ కమిటీ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు,సభాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ,ఆలయ పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య,సహా కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. సంస్థ



అధ్యక్షులు డాక్టర్ ఆర్.ప్రభాకర్‌రావు,నిర్వాహకులు పి.విజయకుమార్,కోశాధికారి కె.వి.సుబ్బారావు తదితరులు అతిధులను,కళాకారులను సత్కరించి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


# ఈస్ట్ బెంగాల్ విజయం

## అల్ అరబీ 4-1 తేడాతో ఓటమి



**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ టూ గ్రూప్ దశకు అర్హత సాధించేందుకు, ఈస్ట్ బెంగాల్ కువైట్‌కు చెందిన అల్ అరబీ ఎస్‌సిని 4-1 తేడాతో ఓడించింది. 76వ నిమిషంలో అనాయో ఇవూలా పెనాల్టీని గోల్‌గా మలిచి అతిథి జట్టును ఆధిక్యంలోకి తీసుకురావడంతో, ఐఎస్ఎల్ ఛాంపియన్లు టోర్నమెంట్ నుండి నిష్క్రమించే దిశగా పయనిస్తున్నట్లు కనిపించారు. అయితే, 90వ నిమిషంలో జయ్ గుప్తా హెడర్‌తో చేసిన గోల్ అదనపు సమయానికి దారితీయగా, ఆ తర్వాత ఈస్ట్ బెంగాల్ పూర్తి నియంత్రణ సాధించింది. 108వ నిమిషంలో కెప్టెన్ మహమ్మద్ రషీద్ అద్భుతమైన హాఫ్‌వాలీతో ఆతిథ్య జట్టును ఆధిక్యంలోకి తీసుకువెళ్లగా, ఆట ముగియడానికి ఏడు నిమిషాల ముందు ప్రత్యామ్నాయ ఆటగాడు డేవిడ్ లాల్‌హ్లన్‌సంగా మూడవ గోల్ చేశాడు. స్టాపేజ్ టైమ్‌లో రోహిత్ దాను ఈ ఘన విజయాన్ని పూర్తి చేశాడు. ప్రభ్‌సుఖన్ సింగ్ గిల్ కూడా కీలకమైన సేవ్‌లు చేసి ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టాడు. 50వ నిమిషంలో జెసిన్ తోనిక్కర అందించిన పాస్‌ను అందుకున్న బిపిన్ సింగ్ బంతిని లక్ష్యం నుండి దూరంగా కొట్టడంతో ఈస్ట్ బెంగాల్ ఒక గొప్ప అవకాశాన్ని కోల్పోయింది. గుప్తా చివరి నిమిషంలో చేసిన గోల్ ఆట స్వరూపాన్ని మార్చేసి గెలుపొందింది. ఈ విజయంతో ఈస్ట్ బెంగాల్ ఏఎఫ్‌సి ఛాంపియన్స్ లీగ్ టూ యొక్క వెస్ట్ రీజియన్ గ్రూప్ దశకు చేరుకుంది, అక్కడ 16 జట్లు హోమ్‌అండ్‌అవే రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో పోటీపడతాయి.

# కెనడియన్ ఓపెన్ ఫైనల్‌కు స్వియాటెక్



**న్యూఢిల్లీ:** కెనడియన్ ఓపెన్‌లో జరిగిన యూఎస్ ఓపెన్ ట్యూన్‌అప్ ఈవెంట్‌లో ఇగా స్వియాటెక్ ఫైనల్‌కు చేరుకుంది. నిర్ణయాత్మక సెట్‌లో స్వియాటెక్ ఒక బ్రేక్ వెనుకబడినప్పటికీ పుంజుకుని ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాను 6-3, 1-6, 6-3 తేడాతో ఓడించి, ఈ సీజన్‌లో తొలిసారిగా టొరంటోలో ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. 2022లో ఫ్లషింగ్ మెడోస్‌లో తన ఆరు గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌లో ఒకదాన్ని గెలుచుకున్న స్వియాటెక్, ఈ యూఎస్ ఓపెన్ వెంట్‌లో వర్షం కారణంగా ఆలస్యమైన మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత స్విటోలినా ఆటను తన వైపుకు తిప్పుకుని, ఏకపక్షంగా సాగిన రెండో సెట్‌లో పోలిష్ క్రీడాకారిణి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణయాత్మక సెట్‌లో స్విటోలినా బ్రేక్ సాధించి 3-2 ఆధిక్యం సంపాదించినప్పటికీ, మాజీ ప్రపంచ నంబర్ వన్ స్వియాటెక్ చివరి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకుని విజయాన్ని కైవసం చేసుకుంది. మరో సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ఎలెనా రైబాకినా, నాలుగో సీడ్ క్రీడాకారిణి కోకో గాఫ్‌ను 5-7, 6-2, 6-2 తేడాతో ఓడించింది. క్వార్టర్ ఫైనల్‌లో ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని నవోమి ఒసాకాను ఓడించి, రెండో సీడ్ క్రీడాకారిణి మరో పునరాగమన విజయాన్ని పూర్తి చేసింది.



# వన్డేలోనూ అఫ్ఘాన్ విజయం

## 42 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఐర్లాండ్ గడ్డపై అఫ్గానిస్తాన్ జైత్రయాత్ర నిర్విఘ్నంగా కొనసాగించింది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో ఆతిథ్య ఐర్లాండ్‌ను 42 పరుగుల తేడాతో అఫ్గాన్ ఓడించింది. ఈ విజయంలో అఫ్గానిస్తాన్ ఓపెనర్లు సెదీఖుల్లా అటల్, ఇబ్రహీం జద్రాన్‌లు భారీ సెంచరీలతో చెలరేగి కీలక పాత్ర పోషించారు. అటల్ ఏవలం 120 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సర్లతో 143 పరుగులు సాధించగా, జద్రాన్ 118 బంతుల్లో 107 పరుగులు చేశాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 343 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఐరిష్ జట్టు 48 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌట్ అయింది. అఫ్గాన్ పేసర్ యామిన్ అహ్మద్‌జాయ్ 4,రషీద్ ఖాన్ తలా 3 వికెట్లు సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో సత్తాచాటిన సెదీఖుల్లా అటల్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. పుట్టిన రోజున వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన ప్లేయర్‌గా అటల్ వరల్డ్ రికార్డు సృష్టించాడు.



# 23 యేళ్ల తర్వాత తొలి టెస్ట్

## ఆస్ట్రేలియాను గడగడలాడించిన బంగ్లాదేశ్





**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనను బంగ్లాదేశ్ ఘనంగా ప్రారంభించింది. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్ ఆడుతున్న బంగ్లాదేశ్, ఫస్ట్ టెస్ట్ తొలి రోజు ఆతిథ్య జట్టును గడగడలాడించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్‌లో టాస్ గెలిచిన బ్యాటింగ్ దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించి ఇజ్జత్ కాపాడాడు. ట్రావిస్ హెడ్(22), జాక్ వెదరాల్డ్(23), మార్నస్ లబుషేన్(1), కామెరూన్ గ్రీన్(13), అలెక్స్ క్యారీ(19), బ్యూ వెబ్‌స్టర్(12), పాట్ కమిన్స్(9), మిచెల్ స్టార్క్(1), నాథన్ లయన్(7) తీవ్రంగా నిరాశపర్చారు. ఓవైపు వరుసగా వికెట్లు పడినా స్టీవ్ స్మిత్ ఒంటరి పోరాటం చేశాడు. టెస్ట్‌ల్లో బంగ్లాదేశ్‌పై ఆసీస్‌కు ఇదే అత్యల్ప స్కోర్. ఈ మ్యాచ్‌లో పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగిన ఆసీస్ ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్‌తో ఆసీస్ 7 టెస్ట్‌లు ఆడగా, ఇదే అత్యల్ప స్కోర్. 9 ఏళ్ల క్రితం 2017లో మిర్‌పూర్‌లో బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఓడిన టెస్ట్‌లో 217 పరుగులకే ఆలౌటైంది. ఇప్పటి వరకు ఇదే అత్యల్పం కాగా.. తాజా ఇన్నింగ్స్ దాన్ని బ్రేక్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు. ఓపెనర్ షాదమన్ ఇస్లామ్(20)ను మిచెల్ స్టార్క్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 102 పరుగుల వెనుకంజలో ఉంది. మొత్తంగా తొలి రోజు ఆటలో మూడు సెషన్లలో బంగ్లాదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో చాలా మంది ఎడ్జ్‌లతో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగారు.




# కీమర్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి!

## స్విస్ గ్రాండ్ మాస్టర్‌ను ఓడించిన దివ్య

**న్యూఢిల్లీ:** సింక్‌ఫీల్డ్ కప్ 2026లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద కొనసాగిస్తున్న అజేయ ప్రస్థానానికి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో మూడో రౌండ్‌లో ఓటమితో తెరపడింది. 21 ఏళ్ల యువకుడు నల్ల పావులతో ఆడి సూపర్ చెస్ క్లాసిక్ రొమేనియా ఛాంపియన్ చేతిలో ఓడిపోయి, లీడర్‌బోర్డ్‌లో సంయుక్తంగా నాలుగో స్థానానికి (1.5) పడిపోయాడు. అమెరికాకు చెందిన వెస్లీ సో తన స్వదేశీయుడైన ఫాబియానో కరువానాను ఓడించి 2.5 పాయింట్లతో ఏకైక అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రెంచ్ జీఎం మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్ మరియు అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్, జవోఖిర్ సిందరోవ్ మరియు జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌లతో డ్రాలు పంచుకుని, మూడు రౌండ్ల తర్వాత 2 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నారు. ప్రజ్ఞానంద, కరువానా, కీమర్ మరియు సామ్ సెవియన్‌లతో కలిసి నాల్గవ స్థానాన్ని పంచుకున్నారు. మరోపక్క కెయిర్న్స్ కప్‌లో వరుసగా మూడో ఓటమిని చవిచూసిన స్విస్ గ్రాండ్ మాస్టర్ అలెగ్జాండ్రా కోస్టెనియుక్‌ను ఓడించిన భారత క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ మూడో స్థానానికి ఎగబాకింది. దివ్య ఇప్పుడు 2 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. 2.5 పాయింట్లతో సంయుక్త అగ్రగాములుగా ఉన్న చైనాకు చెందిన టాన్ జోంగ్యీ, అమెరికాకు చెందిన ఆలిస్ లీల కంటే ఆమె వెనుక ఉంది.



# టాటా సన్స్ తదుపరి ఛైర్మన్ ఎంపికకు కమిటీ ఏర్పాటు



**ముంబయి,ఆగస్టు 13:** టాటా సన్స్ తదుపరి ఛైర్మన్‌ను ఎంపిక చేసేందుకు సెలెక్షన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాలని సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ గురువారం తీర్మానం చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమయ్యే మూడో విడత పదవీకాలానికి తిరిగి నియమించుకోవడానికి ప్రస్తుత ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఆసక్తి చూపకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విభిన్న రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ రెండు ప్రధాన వాటాదారుల్లో ఒకటి. మరో కీలక ట్రస్ట్ అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ ప్రస్తుతం బోర్డు కూర్పుపై నియంత్రణ సంస్థ విచారణను ఎదుర్కొంటోంది. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆదేశాల కారణంగా ఆ ట్రస్ట్ సమావేశాలు నిర్వహించడంపైనా ఆంక్షలు ఉన్నాయి. చంద్రశేఖరన్ మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగేందుకు తనను తాను ప్రతిపాదించుకోవడం లేదని టాటా సన్స్ నామినీ డైరెక్టర్లకు ఈమెయిల్ ద్వారా తెలియజేసినట్లు టాటా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌కు అనుగుణంగా, కొత్త బోర్డు ఛైర్మన్‌గా నియమించాల్సిన వ్యక్తిని సిఫారసు చేసేందుకు వీలుగా వీలైనంత త్వరగా సెలెక్షన్ కమిటీ ఏర్పాటును ప్రారంభించాలని తీర్మానించినట్లు వెల్లడించారు. నాయకత్వ మార్పు సజావుగా, నిర్ణీత సమయంలో, క్రమబద్ధంగా జరిగేలా టాటా సన్స్‌కు పూర్తి సహకారం అందిస్తామని టాటా ట్రస్ట్ తెలిపింది. టాటా సన్స్, టాటా గ్రూప్ విలువలు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా ఈ మార్పు ఉండేలా చూస్తామని పేర్కొంది.గత పదేళ్లలో టాటా సన్స్, టాటా గ్రూప్‌కు చంద్రశేఖరన్ అందించిన విశేష సేవలు, నాయకత్వానికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ పేర్కొంది. ముఖ్యంగా గ్రూప్‌లో గణనీయమైన మార్పులు, వృద్ధి, పరివర్తన చోటుచేసుకున్న సమయంలో ఆయన అందించిన సేవలను ట్రస్ట్ కొనియాడింది.

## వాణిజ్యం



# భారత్ వాణిజ్య లోటు జులైలో 31.9 బిలియన్ డాలర్లకు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత్ వాణిజ్య లోటు జులై నెలలో 31.9 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 27.88 బిలియన్ డాలర్లతో పోలిస్తే లోటు పెరిగినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ గురువారం వెల్లడించింది. వాణిజ్యనిపుణుల అంచనా 30.5 బిలియన్ డాలర్లతో పోలిస్తే వాణిజ్య లోటు కొంత అధికంగా నమోదైంది. జులైలో దిగుమతులు 17.5 శాతం వార్షిక వృద్ధితో 76.22 బిలియన్ డాలర్లకు చేరుకోగా, ఎగుమతులు 19.6 శాతం పెరిగి 44 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులతో పోలిస్తే ఎగుమతులు వేగంగా పెరిగినప్పటికీ, దిగుమతుల విలువ అధికంగా ఉండటంతో వాణిజ్య లోటు విస్తరించింది. మొత్తం వాణిజ్యంలో సరుకుల వాణిజ్య లోటు వాటా గత ఏడాది 27.3 శాతంగా ఉండగా, ఈ ఏడాది జూలైలో 26.5 శాతానికి తగ్గింది.ఎగుమతుల్లో ఎలక్ట్రానిక్స్ దూకుడుపెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రత్నాలు-ఆభరణాలు, ఇనుప ఖనిజం, మాంసం-పౌల్ట్రీ ఉత్పత్తులు ఎగుమతుల్లో మెరుగైన పనితీరు కనబరిచాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 30 శాతం పెరిగాయి. ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు 18 శాతం, రత్నాలు-ఆభరణాలు 6 శాతం, ఇనుప ఖనిజం 33 శాతం, మాంసం-పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతులు 45 శాతం వృద్ధి చెందాయి. తైవాన్, జపాన్, వియత్నాం, ఆస్ట్రేలియా, స్పెయిన్, ఆస్ట్రియా, ఆసియాన్ దేశాలకు ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. కెన్యా, ఎస్‌ఏసీయూ ప్రాంతాలకు కూడా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో ఎగుమతులు పెరిగాయి.




# స్వల్ప లాభాలతోనే సెన్సెక్స్, నిఫ్టీ ముగింపు

**ముంబయి, ఆగస్టు 13:** వారాంతపు బీఎస్‌ఈ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభనష్టాలతో ముగిశాయి. మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తగా ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమికల్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు అండగా నిలిచాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు రెండూ లాభాల్లో ముగిశాయి.బీఎస్‌ఈ సెన్సెక్స్ 113.61 పాయింట్లు లాభపడింది. మరోవైపు నిఫ్టీ 50 40.10 పాయింట్లు కోల్పోయి 24,395.85 వద్ద ముగిసింది. నిఫ్టీని పైకి నడిపిన షేర్లలో లార్సెన్ అండ్ టూబ్రో, ఎటర్నల్ 1.26 శాతం చొప్పున, టీసీఎస్ 1.08 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.29 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.09 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్‌ఈలో మొత్తం 2,192 షేర్లు లాభపడగా, 2,127 షేర్లు నష్టపోయాయి. మరో 237 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు అక్టోబర్ 2026 ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 1.64 డాలర్లు తగ్గి 87.34 డాలర్లకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.3325 వద్ద ముగిసిన రూపాయి గురువారం 95.4800 వద్ద కొనసాగింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి 0.28 శాతం తగ్గి 6.758 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 6.777 శాతంగా ఉంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.44 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,54,200 వద్ద నిలిచాయి. టాటా మోటార్స్ 3.82 శాతం, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ 3.57 శాతం, మిశ్రధాతు నిగమ్ 9.19 శాతం, బ్లాక్ బాక్స్ 7.76 శాతం, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 1.63 శాతం, ఆస్ట్రల్ 8.74 శాతం, లింకన్ ఫార్మాస్యూటికల్స్ 4.79 శాతం పెరిగితే థైరోకేర్ టెక్నాలజీస్ 6.21 శాతం, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 1.54 శాతం, 63 మూన్స్ టెక్నాలజీస్ 8.09 శాతం, 63 మూన్స్ టెక్నాలజీస్ 8.09 శాతం చొప్పున క్షీణించాయి.

# 'ఫండ్స్'లోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత మ్యూచువల్ ఫండ్‌రంగంలోకి వచ్చిన మొత్తం నికర పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.85.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వివిధ మార్కెట్ విభాగాల్లో పెట్టుబడిదారుల విశ్వాసం బలంగా కొనసాగుతున్నదానికి పెట్టుబడుల రాక నిదర్శనమని ఆంఫీ వెల్లడించింది.జిఇపిఎల్ క్యాపిటల్ నివేదిక ప్రకారం.. జూన్‌తో పోలిస్తే జూలైలో మొత్తం నికర పెట్టుబడులు సుమారు 4.30 శాతం పెరిగాయి. ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్ల నికర ఆస్తుల నిర్వహణ విలువ 13.80 శాతం వృద్ధిని నమోదు చేసింది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల యాజమాన్య వివరాలను పరిశీలిస్తే వివిధ వర్గాల మధ్య దాదాపు సమతుల్య పంపిణీ కనిపించింది. మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో కార్పొరేట్లు 37.17 శాతంతో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. ఆ తర్వాత అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు 33.83 శాతం వాటాతో రెండో స్థానంలో ఉన్నారు. రిటైల్ ఇన్వెస్టర్ల వాటా సుమారు 27 శాతంగా ఉండగా, బ్యాంకులు, ఆర్థిక సంస్థల వాటా 1.92 శాతంగా ఉంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు , విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా కలిపి సుమారు 0.07 శాతంగా ఉంది.ఇతర రంగాల్లో పరిశీలిస్తే ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ ఫండ్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో వీటి వాటా 61.06 శాతంగా ఉంది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్14.01 శాతం వాటాను నిర్వహిస్తున్నాయి.లిక్విడ్, మనీ మార్కెట్ ఫండ్ల వాటా 13.37 శాతంగా ఉండగా లిక్విడ్, మనీ మార్కెట్ ఉత్పత్తులను మినహాయించిన డెట్ ఫండ్ల వాటా 11.57 శాతంగా ఉంది. ఈక్విటీ ఫండ్లలోకి రూ.24,697 కోట్ల పెట్టుబడులు జూలైలో ఈక్విటీ విభాగంపై పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి కనిపించింది. ఈ విభాగంలోకి మొత్తం రూ.24,697 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ విభాగంలో పెట్టుబడిదారులు స్మాల్‌క్యాప్ ఫండ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వగా మిడ్‌క్యాప్, ఫ్లెక్సీ క్యాప్ తదితర కేటగిరీలు కూడా మెరుగైన పెట్టుబడులను ఆకర్షించాయి.







Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14